www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

30 సంవత్సరాలుగా లక్షలాదిమంది
విజేతల రూపకల్పనలో అందుకే...
లైఫ్ కెరీర్ ఏదైనా
'కేశవరెడ్డి' తోనే లైన్ క్లియర్
కేశవరెడ్డి విద్యాసంస్థలు
91003 30121, 91000 65505

శుక్రవారం | 25-4-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 9 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: ద్వాదశి ఉ.11.45 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.8.53 తదుపరి: ఉత్తరాభాద్ర, వర్జ్యం: సా.5.30-6.56, దుర్ముహూర్తం: ఉ.8.27-9.17, మ.12.38-1.28, అమృతఘడియలు: రా.2.08-3.34, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.30 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేటి మ్యాచ్ | వేదిక చెన్నై
చెన్నై X హైదరాబాద్ | రా.7.30 నుంచి

అలా చేస్తే.. అర్జున్ మరో గేల్ అవుతాడు



న్యూఢిల్లీ: సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్‌ను యువరాజ్ సింగ్‌కు అప్పగిస్తే మరో క్రిస్ గేల్‌లా తయారవుతాడని మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ అన్నాడు. 25 ఏళ్ల అర్జున్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్నాడు. అలాగే యువీ తండ్రి అయిన యోగ్‌రాజ్ దగ్గర గతంలో శిక్షణ తీసుకున్నాడు కూడా. అప్పట్లో తాను అర్జున్‌కు బ్యాటింగ్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టమని కోరినట్టు చెప్పాడు. అయితే ప్రస్తుతం తన కుమారుడి కెరీర్ గురించి యువరాజ్‌తో సచిన్ మాట్లాడితే బావుంటుందని చెప్పాడు.

అనిమేష్, చిత్రవేల్ జాతీయ రికార్డులు

ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్



అనిమేష్

కోచి: ఒడిశా స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ పురుషుల 200 మీ. రేస్‌లో, ట్రిపుల్ జంప్ స్టార్ ప్రవీణ్ చిత్రవేల్ కొత్త జాతీయ రికార్డులతో భళా అనిపించారు. గురువారం ముగిసిన ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 200 మీ. పరుగులో 21 ఏళ్ల కుజుర్ 20.40 సెకన్ల రికార్డ్ టైమింగ్‌తో గమ్యాన్ని చేరి స్వర్ణం సాధించాడు. ఇక ట్రిపుల్ జంప్‌లో చిత్రవేల్ తన పేరిటే ఉన్న 17.37 మీటర్ల జాతీయ రికార్డును సమం చేసి పసిడి పతకం కొల్లగొట్టాడు. ఈ క్రమంలో 17.22 మీటర్ల ప్రపంచ చాంపియన్‌షిప్స్ నిర్దేశిత దూరాన్నీ అతడు అధిగమించాడు.




ప్రవీణ్

గెలిచి.. నిలిచేదెవరో?




నేడు చెన్నైతో రైజర్స్ ఢీ



చెన్నై: చెరి ఆరేసి ఓటములతో ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకొన్న చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇక ప్రతి మ్యాచ్ చావోరేవో కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే కీలక మ్యాచ్‌లో ఇరుజట్లూ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టుకు నాకౌట్ అవకాశాలు దాదాపుగా గల్లంతయినట్టే. మామూలుగా సొంత మైదానం చెపాక్‌లో చెలరేగిపోయే చెన్నై జట్టు.. ఈ సీజన్‌లో మాత్రం తడబడుతోంది. సీఎస్‌కే బ్యాటర్లు ఆశించినట్టు ఆడలేకపోతున్నారు. మరోవైపు సన్‌రైజర్స్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. టాపార్డర్‌లో అభిషేక్, హెడ్ ఆ జట్టుకు బలం.. బలహీనతగా మారారు. వారి ఆటపైనే జట్టు విజయావకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉండడం కమిన్స్ సేనకు మైనస్‌గా మారింది. ఈ నేపథ్యంలో మిడిలార్డర్ బాధ్యత తీసుకోవాలి.

చంపేస్తాం!

గంభీర్‌కు బెదిరింపు మెయిల్స్



న్యూఢిల్లీ: భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్‌కు బెదిరింపు లేఖలు వచ్చాయి. 'ఐ కిల్ యూ' అంటూ గంభీర్ ఈ-మెయిల్‌కు ఐసిస్, కశ్మీర్ పేరిట రెండు బెదిరింపు లేఖలు పంపారు. ఉగ్రవాదులు పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసిన రోజే గంభీర్‌కు బెదిరింపు రావడం కలకలం రేపింది. దాంతో స్థానిక రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో గంభీర్ ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే అధికారికంగా కేసు నమోదు కాకున్నా..ఈ-మెయిల్ మూలాన్ని, పంపిన వారిని గుర్తించే పనిలో సైబర్ క్రైమ్ పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా..బీజేపీ మాజీ ఎంపీ అయిన గంభీర్‌కు 2022లోనూ ఇలాంటి బెదిరింపే వచ్చింది. దాంతో అతడి కుటుంబానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

భారత బాక్సర్ల జోరు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15 చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ల హవా కొనసాగుతోంది. ముగ్గురు బాలురు, ఇద్దరు బాలికలు సెమీఫైనల్లోకి అడుగుపెట్టారు. 55 కిలోల్లో నెల్సన్, 61 కిలోల్లో అభిజిత్, 64 కిలోల్లో లక్షయ్ ఫొగట్ సెమీస్‌కు దూసుకుపోయారు. బాలికల విభాగంలో..ప్రిన్సి (52కి.), సమృద్ధి సతీష్ (55) చివరి నలుగురిలో ప్రవేశించారు. అండర్-15 విభాగంలో ఇప్పటికే ఆరుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్లో అడుగు పెట్టిన సంగతి తెలిసిందే.

ఉగ్రదాడులపై స్పందించరేం?

పాక్ ప్రధానిపై కనేరియా విమర్శ



కరాచీ: పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా తమ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై విరుచుకుపడ్డాడు. కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడులపై కనీస స్పందన కరువైందని దుయ్యబట్టాడు. 'పహల్గాం ఉగ్రదాడిలో పాక్ హస్తం లేకుంటే.. ఇప్పటిదాకా ప్రధాని షెహబాజ్ ఎందుకు స్పందించనట్టు? ఎందుకు మీ సైన్యం ఒక్కసారిగా అప్రమత్తమైంది? ఎందుకంటే టెర్రరిస్టులకు ఆశ్రయం ఇచ్చి పోషించేది మీరే కాబట్టి. సిగ్గుండాలి' అంటూ ఎక్స్‌లో కనేరియా తీవ్రస్థాయిలో స్పందించాడు. మరోవైపు భారత ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసించాడు. దాడులు చేసిన ఉగ్రవాదులను భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోదన్నాడు.

హంపికి చంద్రబాబు అభినందన

అమరావతి (ఆంధ్రజ్యోతి): పుణె అంచె మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోనేరు హంపికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. హంపి తన విజయంతో దేశానికి గర్వకారణంగా నిలిచారన్నారు.

సొంతగడ్డపై మురిసె..

- చిన్నస్వామిలో ఆర్‌సీబీ బోణీ
- హాజెల్‌వుడ్‌కు నాలుగు వికెట్లు
- ఆఖర్లో తడబడిన రాజస్థాన్
- ప్లే ఆఫ్స్ ఆశలు దాదాపు గల్లంతు



హాజెల్‌వుడ్ (4/33)



కోహ్లి (70)

బెంగళూరు: ఇతర వేదికల్లో అదిరే విజయాలతో ఆకట్టుకుంటున్నా.. తాజా సీజన్‌లో సొంత వేదికపై మాత్రం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలిచిందే లేదు. ఇక్కడ హ్యాట్రిక్ ఓటములతో చిన్నబోయిన ఆర్‌సీబీ ఎట్టకేలకు రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో నెగ్గి అభిమానులను మురిపించింది. అటు ఆర్ఆర్‌కిది వరుసగా ఐదో ఓటమి. కేవలం నాలుగు పాయింట్లతో ఉన్న ఈ జట్టు ప్లేఆఫ్స్ ఆశలు దాదాపు గల్లంతైనట్టే. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. విరాట్ (70), దేవ్‌దత్ (50) ధాటిగా ఆడారు. సందీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 194 పరుగులు చేసి ఓడింది. జైస్వాల్ (49), జురెల్ (47) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హాజెల్‌వుడ్‌కు నాలుగు, క్రునాల్‌కు రెండు వికెట్లు దక్కాయి.

ధాటిగా ఆరంభించినా..: 206 పరుగుల ఛేదన.. అయితేనేం ఓపెనర్ జైస్వాల్ ధాటికి రాజస్థాన్ తొలి 9 ఓవర్లలోనే 110 పరుగులతో నిలిచింది. అప్పటికి రెండు వికెట్లు కోల్పోయినా 12 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. కానీ స్పిన్నర్ క్రునాల్ పాండ్యా మ్యాజిక్ బంతులతో కట్టడి చేయడంతో 10-15 ఓవర్లలో జట్టు చేసింది 38 పరుగులే.. పైగా మరో రెండు వికెట్లు కూడా కోల్పోయింది. ఈ తడబాటు జట్టు భారీ ఛేదనపై ప్రభావం చూపింది. చివర్లో జురెల్ పోరాడినా నిరాశ తప్పలేదు. ఇన్నింగ్స్ తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన జైస్వాల్ ఉన్నంత సేపు ఎదురుదాడికి దిగాడు. రెండో ఓవర్‌లో 4,4,6తో 18.. నాలుగో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో 12 రన్స్ రాబట్టాడు. అటు మరో ఓపెనర్ వైభవ్ (16)ను భువనేశ్వర్ అవుట్ చేసినా జైస్వాల్ తగ్గలేదు. ఆరో ఓవర్‌లో 4,4,6తో 14 రన్స్ అందించాడు. పవర్‌ప్లేలో 72/2 స్కోరుతో పటిష్ఠంగా కనిపించినా.. జైస్వాల్ పరుగు తేడాతో హాఫ్‌సెంచరీని కోల్పోయాడు. ఆ తర్వాత పరాగ్ (22), రాణా (28) సైతం భారీ షాట్లతో చెలరేగారు. కానీ పదో ఓవర్‌లో పరాగ్‌ను క్రునాల్ అవుట్ చేయడంతో ఆర్ఆర్ తడబాటు ఆరంభమైంది. రాణాను సైతం క్రునాల్ వెనక్కిపంపాడు. అటు హిట్టర్ హెట్‌మయెర్ (11) నిరాశపర్చగా.. సమీకరణం 3 ఓవర్లలో 40 పరుగులకు చేరింది. ఈ దశలో 18వ ఓవర్‌లో జురెల్ 6,4,4 శుభమ్ (12) 6తో 22 రన్స్‌తో ఆర్‌సీబీలో గుబులు రేపారు. కానీ వరుస బంతుల్లో జురెల్, ఆర్చర్ (0)లను హాజెల్‌వుడ్ అవుట్ చేయడంతో ఆశలు లేకుండా పోయాయి. చివరి ఓవర్‌లో 17 రన్స్ కావాల్సి ఉండగా శుభమ్, హసరంగ (1) వికెట్లను కోల్పోయి 5 పరుగులే చేయడంతో ఆర్‌సీబీ సంబరాల్లో మునిగింది.

టాపార్డర్ అదుర్స్ : టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు శుభారంభం దక్కింది. బంతి అనూహ్యంగా బౌన్స్ అవుతున్నా టాపార్డర్ నిలబడింది. విరాట్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగించగా.. అతడికి పడిక్కళ్, ఓపెనర్ సాల్ట్ (26) చక్కగా సహకరించారు. చివర్లో డేవిడ్ (23) మెరుపులు తోడయ్యాయి. దీనికితోడు రాజస్థాన్ పేలవ ఫీల్డింగ్ కూడా కలిసివచ్చింది. సాల్ట్ ఒక్క పరుగు వద్ద ఉన్నప్పుడే కెప్టెన్ పరాగ్ అతడి క్యాచ్‌ను వదిలేశాడు. ఓపెనర్ల అడపాదడపా బౌండరీలతో పవర్‌ప్లేలో స్కోరు 59కి చేరింది. కానీ ఆ వెంటనే స్పిన్నర్ హసరంగ సాల్ట్‌ను అవుట్ చేసి తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. మరోవైపు స్పిన్నర్ల ధాటికి 7-11 ఓవర్ల మధ్య స్కోరు కాస్త నెమ్మదించింది. 12వ ఓవర్‌లో విరాట్ రెండు ఫోర్లతో సీజన్‌లో ఐదో ఫిఫ్టీని పూర్తి చేశాడు. అటు పడిక్కళ్ 28 రన్స్ దగ్గర ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌ను తుషార్ వదిలేశాడు. అనంతరం ఇద్దరూ దూకుడు పెంచడంతో ఇన్నింగ్స్ గాడినపడింది. 15వ ఓవర్‌లో పడిక్కళ్ రెండు సిక్సర్లు, విరాట్ ఓ సిక్సర్‌తో 22 రన్స్ సమకూరాయి. అలాగే 26 బంతుల్లోనే పడిక్కళ్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. అయితే 16వ ఓవర్‌లో బంతి ఆర్చర్ చేతికివ్వడంతో తను ఈ ఫార్మాట్‌లో తొలిసారి విరాట్‌ను అవుట్ చేశాడు. అప్పటికే రెండో వికెట్‌కు 95 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేరింది. ఈ దశలో సందీప్ 17వ ఓవర్‌లో పడిక్కళ్, రజత్ (1)ల వికెట్లను తీయడంతో 200 స్కోరుపై సందేహం నెలకొంది. అయితే డేవిడ్, జితేశ్ (19 నాటౌట్)ల జోరుకు ఆఖరి మూడు ఓవర్లలో 38 పరుగులు రావడంతో ఆర్‌సీబీ 205 రన్స్‌తో సవాల్ విసిరింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	9	6	3	0	12	0.482
ముంబై	9	5	4	0	10	0.673
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	9	2	7	0	4	-0.625
హైదరాబాద్	8	2	6	0	4	-1.361
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (సి) హెట్‌మయెర్ (బి) హసరంగ 26; విరాట్ (సి) రాణా (బి) ఆర్చర్ 70; పడిక్కళ్ (సి) రాణా (బి) సందీప్ 50; డేవిడ్ (రనౌట్) 23; రజత్ (సి) జురెల్ (బి) సందీప్ 1; జితేశ్ (నాటౌట్) 20; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 205/5. వికెట్ల పతనం:** 1-61, 2-156, 3-161, 4-163, 5-205; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-33-1; ఫరూఖి 3-0-30-0; తుషార్ 2-0-36-0; సందీప్ 4-0-45-2; హసరంగ 4-0-30-1; పరాగ్ 3-0-30-0.

రాజస్థాన్: యశస్వీ (సి) షెపర్డ్ (బి) హాజెల్‌వుడ్ 49, వైభవ్ (బి) భువనేశ్వర్ 16, నితీశ్ రాణా (సి) భువనేశ్వర్ (బి) క్రునాల్ 28, రియాన్ (సి) జితేశ్ (బి) క్రునాల్ 22, జురెల్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 47, హెట్‌మయెర్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 11, శుభమ్ (సి) సాల్ట్ (బి) యశ్ 12, ఆర్చర్ (సి) పటీదార్ (బి) హాజెల్‌వుడ్ 0, హసరంగ (రనౌట్) 1, తుషార్ (నాటౌట్)1, ఫరూఖి (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు 5, మొత్తం: 20 ఓవర్లలో 194/9; వికెట్ల పతనం:** 1-52, 2-72, 3-110, 4-134, 5-162, 6-189, 7-189, 8-189, 9-191; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-50-1, యశ్ దయాల్ 3-0-33-1, హాజెల్‌వుడ్ 4-0-33-4, షెపర్డ్ 1-0-15-0, సుయాశ్ 4-0-31-0, క్రునాల్ పాండ్యా 4-0-31-2.

టెక్ మహీంద్రా లాభం జూమ్



ఒక్కో షేరుకు రూ.30 డివిడెండ్

క్యూ4లో 77% వృద్ధితో రూ.1,167 కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 76.5 శాతం వృద్ధి చెంది రూ.1,166.7 కోట్లకు పెరిగింది. ఆదాయం 4 శాతం పెరిగి రూ.13,384 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)తో పోలిస్తే మాత్రం కంపెనీ లాభంలో 19 శాతం, ఆదాయంలో కేవలం 1 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి టెక్ మహీంద్రా నికర లాభం 80 శాతం వృద్ధితో రూ.4,252 కోట్లకు, ఆదాయం 2 శాతం పెరుగుదలతో రూ.52,988 కోట్లకు చేరుకుంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.30 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- క్యూ4లో కంపెనీ 79.8 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,800 కోట్లు) విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. ఏడాది క్రితం ఇదే కాలానికి లభించిన ఆర్డర్లతో పోలిస్తే 60 శాతం అధికమిది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లభించిన కొత్త డీల్స్ విలువ 270 కోట్ల డాలర్లు (దాదాపు రూ.23,000 కోట్లు)గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 42 శాతం ఎక్కువ.
- క్యూ3తో పోలిస్తే క్యూ4లో సంస్థ ఉద్యోగుల సంఖ్య 1,757 మేర తగ్గింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 3,276 మంది తగ్గారు. దాంతో, ఈ మార్చి 31 నాటికి టెక్ మహీంద్రాలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 1,48,731కి జారుకుంది. కాగా, మార్చి త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 11.8 శాతంగా నమోదైంది.
- గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలన్న లక్ష్యాన్ని మించి 6,100 నియామకాలు చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) క్యాంపస్ హైరింగ్ లక్ష్యాన్ని వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించింది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి పెరిగిన నేపథ్యంలో ఐటీ సేవలకు డిమాండ్ మందగించడం ఇందుకు కారణంగా పేర్కొంది.
- ఈ మార్చి త్రైమాసికం నాటికి కంపెనీ వద్ద రూ.7,656 కోట్ల నగదు, అందుకు తత్సమానమైన నిల్వలు ఉన్నాయని టెక్ మహీంద్రా వెల్లడించింది.

6% తగ్గిన సైయెంట్ లాభం

ఒక్కో షేరుకు రూ.14 డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైయెంట్ డిఈటీ.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.1,472 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.163 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే కాలంతో పోల్చితే రెవెన్యూ 3.4 శాతం క్షీణించగా లాభం 6 శాతం తగ్గింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం 12.2 శాతం తగ్గుదలతో రూ.605 కోట్లుగా నమోదు కాగా ఆదాయం కూడా 1.6 శాతం క్షీణించి రూ.5,816 కోట్లుగా నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.14 డివిడెండ్ (280 శాతం)ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

బిజినెస్

మదుపరులూ మోసపోవద్దూ..

బీఎస్ఈ ఎండీ,సీఈఓ సుందరరామన్ రామమూర్తి 1అర్థం చేసుకుని ట్రేడింగ్ చేయండి..



కోల్‌కతా: స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై రిటైల్ మదుపరులు అప్రమత్తంగా ఉండాలని బీఎస్ఈ ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తి హెచ్చరించారు. స్పష్టమైన అవగాహన, బాధ్యతలు గుర్తెరిగి పెట్టుబడులు పెట్టాలని కోరారు. లేకపోతే కొంప కొల్లేరయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పెట్టుబడులు పెట్టేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోతే మదుపరులను కాపాడడం రెగ్యులేటరీ సంస్థలకు కూడా సాధ్యం కాదని స్పష్టం చేశారు. 'మీకు అర్థమైతేనే ట్రేడింగ్ చేయండి. లేదా అర్థం చేసుకుని ట్రేడింగ్ చేయండి. లేకపోతే సమస్యలు తప్పవు' అన్నారు. కోల్‌కతా చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఒక సదస్సులో బీఎస్ఈ ఎండీ ఈ హెచ్చరికలు చేశారు.

చెప్పుడు మాటలు వినొద్దు

చాలా మంది రిటైల్ మదుపరులు తాము కొనే కంపెనీల షేర్లపై కనీస కసరత్తు కూడా చేయకుండా.. గుడ్డిగా ఎవరో చెప్పిన మాటలు విని పెట్టుబడులు పెట్టడాన్ని బీఎస్ఈ చీఫ్ తప్పుపట్టారు. కూరగాయలు కొనేటప్పుడే అవి బాగున్నాయో లేదో ఒకటికి రెండు సార్లు పరిశీలిస్తాం. అలాంటిది జీవితమంతా కష్టపడి సంపాదించుకున్న మొత్తాన్ని ఎవరో చెప్పిన మాటలు విని పెట్టుబడి పెట్టడం ఏ మాత్రం సరికాదు' అన్నారు. చిన్న మదుపరులు నేరుగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడానికి బదులు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా మదుపు చేయాలని సూచించారు. మళ్లీ ఇందులో ఏదో ఒక ప్రత్యేక సెక్టార్‌కు చెందిన ఫండ్స్‌లో కాకుండా లార్జ్ క్యాప్ లేదా మల్టీ అసెట్ ఫండ్స్‌లో మదుపు చేయడం మంచిదని రామమూర్తి అన్నారు.

7 రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 315 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ఏడు రోజుల ర్యాలీకి తెరపడింది. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాల కారణంగా ప్రామాణిక సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 315.06 పాయింట్లు కోల్పోయి 79,801.43 వద్దకు.. నిఫ్టీ 82.25 పాయింట్ల నష్టంతో 24,246.70 వద్దకు జారుకున్నాయి. ఆసియా, ఐరోపా మార్కెట్లో స్తబ్ధత కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 నష్టపోయాయి. మార్చి త్రైమాసిక లాభం తగ్గడంతో ఎఫ్ఎంసీజీ దిగ్గజం హెచ్‌యూఎల్ షేరు 4 శాతం క్షీణించి సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.16 శాతం వరకు తగ్గాయి. రంగాల వారీ సూచీల్లో రియల్టీ 1.39 శాతం నష్టపోగా.. ఎఫ్ఎంసీజీ, టెక్ ఇండెక్స్‌లు అర శాతానికి పైగా తగ్గాయి.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసలు పెరిగి రూ.85.33 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర ఒక దశలో 66.10 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.200 పెరిగి రూ.99,400 స్థాయికి చేరింది. కిలో వెండి రూ.700 పెరుగుదలతో రూ.99,900 ధర పలికింది. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 1.43 శాతం పెరిగి 3,335 డాలర్లకు చేరగా.. సిల్వర్ 33.42 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

వైశాఖి డెవలపర్స్‌తో ఆరమ్ జట్టు

విశాఖపట్నం కేంద్రంగా ఉన్న వైశాఖి డెవలపర్స్.. ప్రీమియర్ సేఫ్ డిపాజిట్ లాకర్స్ సంస్థ ఆరమ్‌తో జట్టు కట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో వైశాఖి అభివృద్ధి చేస్తున్న స్కైపార్క్‌లో పూర్తి ఆటోమేటిక్, స్విస్ బ్యాంక్ తరహా సేఫ్ డిపాజిట్ లాకర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖలో తొలి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్ అయిన స్కైపార్క్‌లోని ఫ్లాట్లలో 400 ఆటోమేటెడ్ లాకర్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఆరమ్ వెల్లడించింది. అంతే కాకుండా ప్రతి లాకర్‌కు రూ.25 లక్షల వరకు బీమా కవరేజీ కల్పిస్తున్నట్లు తెలిపింది. కాగా రాబోయే ప్రాజెక్టుల్లో 2,000 వరకు లాకర్లను ఏర్పాటు చేయాలని ఆరమ్ భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	450	విశాఖపట్నం	425

డజను గుడ్లు రూ. 60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	112
వరంగల్	120	గుంటూరు	115
కరీంనగర్	120	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	88
కర్నూలు	120	నెల్లూరు	93
విశాఖపట్నం	111	అనంతపురం	93
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,240 ▼	90,050 ▼	1,10,900 ▼
విజయవాడ	99,000 ▼	93,500 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	99,170 ▲	90,050 ▼	1,10,900 ▲
రాజమండ్రి	98,240 ▼	90,050 ▼	1,00,900 ▲
ప్రొద్దుటూరు	97,300 ▼	89,520 ▼	1,00,000 ▲
ముంబై	96,286 ▲	88,198 ▲	97,634 ▲

వడ్డీ రేట్లు తగ్గించిన కెనరా, ఇండియన్ బ్యాంక్

న్యూఢిల్లీ: మరో రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ గృహ, వాహన రుణాల వడ్డీ రేట్లు తగ్గించాయి. కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ తమ రెపో ఆధారిత రుణాల వడ్డీ రేటును పావు శాతం (0.25%) మేర తగ్గించాయి. ఇండియన్ బ్యాంక్ గృహ రుణాలపై కనీస వడ్డీ రేటు 8.15 శాతం నుంచి 7.90 శాతానికి, వాహన రుణాలపై కనీస వడ్డీ రేటు 8.5 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గాయి. వడ్డీ రేటు తగ్గింపుతో పాటు తమ రుణాలపై జీరో డాక్యుమెంటేషన్ చార్జీలు, డిస్కౌంటెడ్ ప్రాసెసింగ్ ఫీజు కూడా అమలు చేస్తున్నట్టు ఇండియన్ బ్యాంక్ తెలిపింది. కెనరా బ్యాంక్ కూడా తన గృహ రుణాల కనీస వడ్డీ రేటును 8.15 శాతం నుంచి 7.90 శాతానికి, వాహన రుణాల వడ్డీ రేటును 8.45 శాతం నుంచి 8.2 శాతానికి తగ్గిస్తున్నట్టు వెల్లడించింది.

వియత్నాం నుంచి భారత్‌కు..

స్మార్ట్‌ఫోన్ల తయారీని తరలించేందుకు సామ్‌సంగ్ సన్నాహాలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటోంది. వియత్నాంలో ఉన్న తన స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తిలో కొంత భాగాన్ని మన దేశానికి తరలించాలని యోచిస్తున్నట్టు సమాచారం. ట్రంప్ సర్కారు వియత్నాం దిగుమతులపై 46 శాతం, భారత దిగుమతులపై 26 శాతం సుంకాలు విధించడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఈ సుంకాల పోటు నుంచి 90 రోజుల విరామం దొరికినా.. దీర్ఘకాలంలో తన స్మార్ట్‌ఫోన్లను వియత్నాం కంటే భారత్ నుంచి ఎగుమతి చేయడమే మేలని సామ్‌సంగ్ భావిస్తోంది.

మన వాటా స్వల్పమే: సామ్‌సంగ్ గత ఏడాది భారత్ నుంచి 350 కోట్ల డాలర్ల (సుమారు రూ.29,850 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో వియత్నాం నుంచి 3,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.98 లక్షల కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. ఇందులో 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.85,290 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఒక్క అమెరికాకే ఎగుమతయ్యాయి. భారత్‌లో ఉత్పత్తి పెంచడం ద్వారా అమెరికా స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో తన పట్టు నిలుపుకోవాలని సామ్‌సంగ్ యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకమూ ఈ విషయంలో కంపెనీని ఆకర్షిస్తోంది.

రూటు మార్చిన చైనా

అమెరికా భారీ సుంకాలను తప్పించుకునేందుకు చైనా కంపెనీలు కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. తమ దేశంలో తయారైన వస్తువులను దక్షిణ కొరియాకు ఎగుమతి చేసి.. అక్కడ మళ్లీ వాటిని రీప్యాకింగ్ చేసి మేడిన్ ఇన్ సౌత్ కొరియా పేరుతో అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. కొరియా కస్టమ్స్ అధికారులను ఉటంకిస్తూ జపాన్ వార్తా సంస్థ నిక్కీ ఏషియా న్యూస్ ఒక కథనం ప్రచురించింది. కొంత మంది చైనా పౌరులు దక్షిణ కొరియాలో ఇందుకోసం కొన్ని గిడ్డంగులు ఏర్పాటు చేసి ఈ పని చేస్తున్నట్టు తెలిపింది.

- **లారస్ ల్యాబ్స్ లాభం మూడింతలు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో లారస్ ల్యాబ్స్ రూ.234 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.76 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా మూడింతలు వృద్ధి చెందింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం కూడా రూ.1,440 కోట్ల నుంచి రూ.1,720 కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి లాభం రూ.161 కోట్ల నుంచి రూ.358 కోట్లకు, ఆదాయం రూ.5,041 కోట్ల నుంచి రూ.5,554 కోట్లకు పెరిగింది. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై 80 పైసల డివిడెండ్ ప్రకటించింది.

- **తాన్లా లాభంలో 11% వృద్ధి**

మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో తాన్లా ప్లాట్‌ఫామ్స్ రూ.1,024 కోట్ల ఆదాయంపై రూ.117 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 11.5 శాతం వృద్ధి చెందింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4,028 కోట్ల రెవెన్యూపై రూ.507 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 25-4-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ

అమెరికాలో విద్యార్థి వీసాల రద్దుకు బ్రేకులు!

133 మంది సెవిస్ రికార్డుల పునరుద్ధరణకు జార్జియా ఫెడరల్ కోర్టు ఆదేశం 9

వీరిలో ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే

హెచ్-1బీ వీసా కోసం చిరునామా, బయోమెట్రిక్ తప్పనిసరి అంటున్న అధికారులు



అంతమొందించేందుకు ఎంతవరకైనా..

ఆ ఉగ్రవాదులు భూమ్మీద ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటాం

'పహల్గాం' హంతకులను, వారికి మద్దతిస్తున్న వారిని కలలో కూడా ఊహించనట్లు శిక్షిస్తాం

ఇది పర్యాటకులపై దాడి మాత్రమే కాదు..

భారత ఆత్మపై దాడికి శత్రువుల దుస్సాహసం

ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసే సమయం ఆసన్నమైంది: ప్రధాని మోదీ

పట్నా, ఏప్రిల్ 24: పహల్గాంలో అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల అంతు చూస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆ హంతకులు భూమ్మీద ఎక్కడ దాక్కొన్నా వెతికి పట్టుకొని శిక్షిస్తామన్నారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు తీవ్రమైన హెచ్చరిక చేశారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తన ప్రసంగం ఆరంభంలో 'పహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన మన కుటుంబ సభ్యుల గౌరవార్థం మనమంతా మౌనం పాటిద్దాం' అని మోదీ సభికులను కోరారు. ప్రధానితో పాటు సభకు హాజరైన వారంతా ఒక నిమిషం పాటు

మిగతా 12వ పేజీలో...

రాష్ట్రపతి ముర్ముతో అమిత్‌షా, జైశంకర్ భేటీ

నేడు కశ్మీర్‌కు ఆర్మీ చీఫ్.. రేపు రాహుల్‌గాంధీ

భారత్, పాక్ పోటాపోటీగా క్షిపణి పరీక్షలు

ఎంఆర్-ఎస్‌ఏఎంను పరీక్షించిన భారత నౌకాదళం

అరేబియా జలాల్లో ఐఎన్ఎస్ విక్రాంత్ మోహరింపు

ఒకటి రెండు రోజుల్లో పరీక్షలకు పాక్ మిలటరీ నోటమ్



పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ గురువారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆ పార్టీ నేతలు వర్ల రామయ్య తదితరులు



పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

సిమ్లా ఒప్పందం నిలిపివేత

భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై పాకిస్థాన్ ప్రతిచర్యలు

పాక్ ప్రధాని నేతృత్వంలో జరిగిన భేటీలో కీలక నిర్ణయాలు

మన విమానాలు తమ గగనతలంలోకి రాకుండా నిషేధం

వాఘా బోర్డర్ మూసివేత.. వాణిజ్యం బంద్.. వీసాల రద్దు

సింధు జలాల ఒప్పందం కింద తమకు రావాల్సిన నీటిని మళ్లించే యత్నాల్ని యుద్ధచర్యగా భావిస్తామని హెచ్చరిక

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే!.. పాక్ నిర్ణయం ప్రభావం

విమానాల దారి మళ్లింపు.. ప్రయాణికులపై మరింత భారం

పాకిస్థాన్‌కు యుద్ధ భయం!.. సరిహద్దులకు సైన్యం

సిమ్లా ఒప్పందం.. సరిహద్దు, కశ్మీర్ అంశాలు సంక్లిష్టం

సమగ్ర కథనాలు 11,12,13లో



అఖిలపక్ష సమావేశం అనంతరం బయటకు వస్తున్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా

ఉగ్ర క్యాంపులను నాశనం చేయాల్సిందే!

కేంద్రం ఏ చర్య తీసుకున్నా మద్దతిస్తాం

జాతీయ భద్రత అంశంలో రాజకీయాల్లేవ్

ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడుదాం

అఖిలపక్ష సమావేశం ప్రకటన

జాతీయ భద్రతపై కేంద్రానికి టీడీపీ మద్దతు

తిరుమలలో భద్రత కట్టుదిట్టం

రెండున్నర గంటలు పరుగెడుతూనే ఉన్నాం

చెట్ల చాటున దాక్కున్నాం.. కిందికి ఎలా దిగామో తెలియదు

మా కళ్ల ముందే చంద్రమౌళిని మెకాళ్లపై కూర్చోబెట్టి కాల్చేశారు

'ఆంధ్రజ్యోతి'తో పహల్గాం ప్రత్యక్ష సాక్షులు శశిధర్, సుమిత్రాదేవి

పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి అరెస్టు



మాధవరెడ్డి

మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో సీఐడీ దూకుడు

9 నెలలుగా ముందస్తు బెయిల్‌పై ఉన్న మాధవరెడ్డి

బెయిల్ రద్దు చేయించి మరీ అరెస్టు చేసిన సీఐడీ

రొంపిచర్ల ఫాంహౌస్‌లో అదుపులోకి

తిరుపతి సీఐడీ ఆఫీసుకు తరలింపు

త్వరలో పెద్ద తలకాయల వంతు?

రాయచోటి/తిరుపతి నేరవిభాగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డిని గురువారం సాయంత్రం సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు జిల్లా రొంపిచర్ల మండల పరిధిలోని తన ఫాంహౌస్‌లో ఉండగా.. ఆయన్ను అదుపులోకి తీసుకుని తిరుపతి సీఐడీ కార్యాలయానికి తరలించారు. గత ఏడాది జూలై 21వ తేదీ రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్లు కాలిపోయాయి. వైసీపీ హయాంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిధిలో పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు అనేక భూఅక్రమాలకు పాల్పడ్డారని, ప్రభుత్వం మారాక ఈ అక్రమాలు వెలుగులోకి రాకుండా చేసేందుకే.. ఫైళ్లను దహనం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనకు మాధవరెడ్డిని సూత్రధారిగా పేర్కొంటూ మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు(క్రైమ్ నంబరు 138/2024) నమోదైంది. ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించిన సీఐడీ పోలీసులు బస్తాలకొద్దీ డాక్యుమెంట్లను స్వాధీనం

మిగతా 11వ పేజీలో...

మాజీ మంత్రి రజిని మరిది గోపి అరెస్టు



హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఏసీబీ

యడ్లపాడు మైనింగ్ వ్యాపారులను బెదిరించి

11 రూ.2.20 కోట్లు అక్రమ వసూళ్లు

వసూళ్లు నిజమేనని విజిలెన్స్ నిర్ధారణ

రజిని సహా నలుగురిపై ఏసీబీ కేసు నమోదు

అర్ధరాత్రి దాటాక కోర్టు ముందు హాజరు

రిమాండ్ విధించిన న్యాయాధికారి

పాలనలో మానవీయకోణం



వేగవంతమైన సేవలకు ఏఐ వినియోగం

స్మార్ట్ పాలనకు '4.0'లో అధిక ప్రాధాన్యం

పాత పాలన పంథాను మార్చుకోవాలి

గతంలోని పద్ధతులకు నూతన సాంకేతికత జోడించాలి

ఆ దిశగా ప్రజాసేవకు సిద్ధం కావాలి

రాష్ట్రంలో త్వరలోనే భారీ డేటా లేక్

శాఖాధిపతులకు ఏఐ వర్క్‌షాప్ ప్రారంభంలో సీఎం చంద్రబాబు 2

నేడు ఢిల్లీకి చంద్రబాబు

అమరావతి పనుల పునఃప్రారంభానికి మోదీని ఆహ్వానించనున్న సీఎం 2



ఉగ్రదాడిలో మరణించిన కావలి వాసి మధుసూదన్‌రావు భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఇక స్థానిక ప్రభుత్వాలు

ప్రతి పంచాయతీలో జాతీయ సమగ్రతా ప్రాంగణం

అందులో జాతీయ స్తూపం ఏర్పాటు.. రాజకీయాలకతీతంగా పంచాయతీలకు నిధులు

వాటి స్థలాలు, ఆస్తులకు ఆడిట్ జరగాలి.. అవి స్వయంప్రతిపత్తి సాధించాలి

అభివృద్ధి, ఆకాంక్షలతో స్వర్ణ గ్రామాలుగా వెలగాలి.. నిధుల మళ్లింపు, వృథా వ్యయం వద్దని ఆదేశించా

పారదర్శకంగా సిబ్బంది బదిలీలు.. ఉపాధి కూలీలని అనొద్దు

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన 3

436 ఖనిజ లీజులు ఏపీఎండీసీకే

మైనింగ్ హక్కులు కూడా అప్పగింత 3

9 వేల కోట్ల రుణం కోసం కీలక నిర్ణయం

నాయీబ్రాహ్మణుల కనీస వేతనం రూ. 25 వేలకు పెంపు

2

కొత్తగా 89,788 మందికి వితంతు పింఛన్లు

రాష్ట్రం నిప్పుల కొలిమి

139 ప్రాంతాల్లో 41 డిగ్రీలపైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు

దొర్నిపాడులో 43.8, పెద్దదోర్నాలలో 43.7 డిగ్రీలు 3

జూన్ 1న పోలీసు ఫైనల్ పరీక్ష

ఫిట్‌నె‌స్‌లో అర్హత సాధించిన 38,910 మందికి

కమీషన్ల కిక్కు జగన్ జేబులోకే!

'సొంత లాభం' కోసమే మద్యం పాలసీ

వసూలులో చాణక్యదే కీలక పాత్ర

ఆయన నుంచి రాజ్ కసిరెడ్డికి నిధులు

సాయిరెడ్డి, మిథున్, బాలాజీ,

వైఎస్ అనిల్ ద్వారా జగన్‌కు...

హైదరాబాద్‌లోని హోటల్లో స్కామ్‌కు బీజం

మద్యం కంపెనీలతో సజ్జల శ్రీధర్ భేటీ

12తో మొదలై 20 శాతానికి చేరిన కమీషన్

ముడుపులు ఇచ్చిన వారికే ఆర్డర్లు

చాణక్య రిమాండ్ రిపోర్టులో 'సిట్' వెల్లడి

రిమాండ్ విధింపు.. బెజవాడ జైలుకు తరలింపు



చాణక్యను కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మద్య నిషేధ హామీతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్... అదే మద్యం నుంచి వేల కోట్ల కమీషన్లు పిండుకున్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేల్చింది. స్కామ్‌కు రాజ్ కసిరెడ్డి సూత్రధారి కాగా... కంపెనీల నుంచి కమీషన్ల వసూలులో ఆయన తోడల్లుడు చాణక్య కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించింది. ఆయన...

మిగతా 11వ పేజీలో...

నాడు డాక్టర్.. నేడు యాక్టర్

పీఎస్ఆర్‌ను వెంటాడుతున్న 'స్త్రీ గండం'

సీపీ హోదాలో నాడు లైంగిక వేధింపుల ఆరోపణలు

బదిలీ వేటు వేసిన డిపార్ట్‌మెంట్

నిఘా బాస్‌గా జత్వానీపై కేసుకు కుట్ర!

ఈసారి ఏకంగా జైలుకే..

రెండు ఘటనలకూ విజయవాడే కేంద్రం



11

దేశం దాటిన 'మద్యం' కిరణ్‌రెడ్డి

అమెరికాలో ఆచూకీ పట్టిన నిఘా వర్గాలు.. గతంలోనూ అక్కడ పలేళ్లు

భార్యతో పరిచయమూ అక్కడే.. గత హయాంలో డిశార్జ్ పేరిట లావాదేవీలు

రెండో రోజూ సహకరించని మాధవ్!

జగన్ భార్యను తిట్టారన్న కోపంతోనే

చేబ్రోలు కిరణ్‌పై దాడికి యత్నం

ఆయన్ను తీసుకెళ్తున్న వాహనం

యాదృచ్ఛికంగానే కంటబడింది: మాజీ ఎంపీ

ముగిసిన రెండ్రోజుల కస్టడీ

తిరిగి కోర్టు ముందు హాజరు

రిమాండ్‌పై రాజమండ్రి జైలుకు తరలింపు 11

చెప్పకుండా విదేశాలకు ఎందుకెళ్లారు?

నెలలో జవాబివ్వకుంటే క్రమశిక్షణ చర్యలు

సీనియర్ ఐపీఎస్ సునీల్‌కు ప్రభుత్వం హెచ్చరిక

అభియోగాలు నమోదు చేస్తూ ఉత్తర్వులు

అంతర్గత టెర్రరిస్టుగా తయారైన చౌకీదార్

» మోదీ వ్యవస్థలుగా మారిన నిఘా వ్యవస్థలు: షర్మిల


చంద్రమౌళి భౌతికకాయం వద్ద షర్మిల

విశాఖపట్నం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 'దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ అంతర్గత టెర్రరిస్ట్ మాదిరిగా తయారయ్యారు. ఇండియా నిఘా వ్యవస్థలను మోదీ వ్యవస్థలుగా మార్చేశారు. ఈ ఘటనకు అమిత్‌షా, మోదీ బాధ్యత వహించాలి. తక్షణమే రాజీనామా చేయాలి' అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన చంద్రమౌళికి గురువారం మధ్యాహ్నం ఆమె నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'కశ్మీర్ ఘటన దేశంపై జరిగిన దాడిగా భావిస్తున్నాం. దేశానికి చౌకీదార్(చేతిలో స్టిక్ చూపిస్తూ...) అంటూ చెప్పుకునే మోదీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఆయన బీజేపీకి మాత్రమే చౌకీదార్. దేశంలో ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్‌కు ఈ ఘటన నిదర్శనం. దేశ భద్రతను గాలికి వదిలేశారు. ముమ్మాటికీ ఈ ఘటన కేంద్రం తప్పిదమే. దేశంలోని ముస్లింలను చెడ్డవాళ్లగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనలో ఒక ముస్లిం కూడా చనిపోయాడు. దేశంలో అంతర్గత భద్రత సరిగా లేదు' అని షర్మిల విమర్శించారు.

అకారణంగా సస్పెండ్ చేశారు: దువ్వాడ

అమరావతి, శ్రీకాకుళం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కోసం నిరంతరం కష్టపడి పని చేసి.. పార్టీ గొంతుకనైన తాను రాజకీయ క్రీడకు బలైపోయానని వైసీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వీడియో సందేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ పార్టీ తనకు అందించిన సహకారం, వైఎస్ రాజశేఖరరెడ్డితో, జగన్‌తో తనకున్న అనుబంధాన్ని వివరించారు. పాతికేళ్లుగా ప్రజా జీవితంలో ప్రజాసేవే పరమావధిగా భావించి పనిచేసిన తాను ఏనాడూ అవినీతికి, భూకబ్జాలకు పాల్పడలేదని తెలిపారు. స్వతంత్రుడిగా.. తటస్థుడిగా ప్రజల్లోకి వెళ్తానని తెలిపారు.

89,788 కొత్త వితంతు పింఛన్లు మంజూరు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 2023 డిసెంబరు 1-2024 అక్టోబరు 31 మధ్య కాలంలో పింఛన్ పొందుతున్న భర్తను కోల్పోయిన వితంతువులకు పింఛన్లు మంజూరుచేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. స్పౌజ్ కేటగిరి కింద 89,788 మందికి పింఛన్లు మంజూరు చేసింది. నెలకు రూ.4 వేలు చొప్పున మొత్తం రూ.35.91 కోట్లు విడుదల చేసింది. ఈ బకాయిలను ఆయా కులాల కార్పొరేషన్ల ద్వారా అందించనున్నారు.

ప్రభుత్వ సలహాదారుగా సతీశ్‌రెడ్డి బాధ్యతలు

» రాష్ట్రానికి డిఫెన్స్, ఏరో స్పేస్ పరిశ్రమలు రావాలి: ఎంపీ కేశినేని చిన్ని



అమరావతి, మంగళగిరి సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఏరో స్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జీ.సతీశ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ శివనాథ్ పాల్గొని సతీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. 'గత ఎనిమిది నెలల్లో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తీసుకువచ్చాం. వీటితోపాటు డిఫెన్స్, ఏరో స్పేస్ పరిశ్రమలు కూడా రావాల్సిన అవసరముంది. సతీశ్‌రెడ్డి అనుభవాన్ని రాష్ట్రానికి ఉపయోగపడే విధంగా ఏరో స్పేస్, డిఫెన్స్ మ్యానుఫాక్చరింగ్ హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు' అని ఎంపీ చిన్నీ అన్నారు. సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ... 'నాకు ఏరో స్పేస్, డిఫెన్స్ రంగాల్లో వున్న అనుభవంతో రాష్ట్రంలో ఎక్కడెక్కడ డిఫెన్స్ క్లస్టర్స్ ఏర్పాటు చేయాలనే అంశంపై అధికారులతో చర్చించి కృషి చేస్తాను. విజయవాడ, అమరావతి ప్రాంతాల్లో హైదరాబాద్ వెళ్లే మార్గంలోను, అనంతపురం, విశాఖపట్నం, కర్నూలు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో పరిశ్రమలు అభివృద్ధి చెందేందుకు అనేక వనరులు పుష్కలంగా ఉన్నాయి' అని అన్నారు.

నాయీబ్రాహ్మణుల కనీస వేతనం 25 వేలకు పెంపు

» 44 ఆలయాల్లో తలనీలాల విధులు నిర్వహించే వారికి అమలు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాల్లో తలనీలాలకు సంబంధించిన విధులు నిర్వహించే నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం కింద రూ.25 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో '6ఏ' కింద దాదాపు 175 ఆలయాలున్నాయి. అందులో 44 ఆలయాల్లో మాత్రమే భక్తులు నిత్యం తలనీలాలు సమర్పిస్తుంటారు. ఈ ఆలయాల్లో విధులు నిర్వహించే నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల కనీస వేతనాన్ని అమలు చేయనున్నారు. దీంతో ఎన్నికలముందు దేవదాయ శాఖపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం వంద శాతం పూర్తి చేసింది.

'సీతారామ'కు సాంకేతిక అనుమతి

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలశక్తి శాఖ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) సాంకేతిక అనుమతి మంజూరు చేసింది. గురువారం కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన 158వ టీఏసీ సమావేశం జరిగింది. పర్యావరణ అనుమతి (ఈసీ) పెండింగ్‌లో ఉందని, బ్యారేజీ నిర్మాణ పనులు చేపట్టరాదని ఆదేశాలు ఉన్నాయి కదా అని దేబశ్రీ ముఖర్జీ అడగ్గా... పర్యావరణానికి జరిగిన నష్టానికి పరిహారం కింద రూ.53 కోట్లు జమ చేశామని తెలంగాణ అధికారులు తెలిపారు. దాంతో జల విద్యుత్ డిజైన్లు, పర్యావరణ అనుమతికి లోబడి క్లియరెన్స్ ఇస్తున్నామని దేబశ్రీ ముఖర్జీ తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పలు రాయితీలు అందజేస్తూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఈవో), ఎంఎస్ఎంఈడీసీ, ర్యాంప్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో ఇంటర్నేషనల్ బయ్యర్స్ అండ్ సెల్లర్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివశంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేవారికి మానవ వనరులకు, సహజ వనరులకు కొదవ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐఈవో సౌత్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ జనరల్ కె.ఉన్నికృష్ణన్, ఎఫ్ఐఈవో అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథ్‌బాబు పాల్గొన్నారు.

బండి రామకృష్ణారెడ్డి కన్నుమూత

» దేశ భాషల పరిరక్షణకుగాను పద్మశ్రీ గుర్తింపు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భాషావేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత బండి రామకృష్ణారెడ్డి(83) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా వయసు రీత్యా తలెత్తే సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. రామకృష్ణారెడ్డి కవి, కుయి, మండా భాషల పరిరక్షణకు అవిరళ కృషి చేశారు. ఇంది, ఆవే భాషలకు లిపి తయారు చేశారు. ఆయన స్వస్థలం చిత్తూరు జిల్లా రెంటాలచెను. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ హిందీ, పుణే దక్కన్ కాలేజీలో భాషా శాస్త్రాన్ని అభ్యసించారు. ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి తెలుగు వాక్య నిర్మాణంలో స్థానిక అధ్యయనాలు అంశంపై పీహెచ్‌డీ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భాషా శాస్త్ర విభాగంలో 1977 నుంచి 1990 వరకు ఆచార్యుడిగా సేవలందించారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం అధిపతిగా, తర్వాత రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కుప్పం, ద్రవిడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గానూ పనిచేశారు. అంతరించిపోతున్న భారతీయ భాషల పరిరక్షణకు రామకృష్ణారెడ్డి అందించిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2023లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11 గంటలకు తార్నాకలోని శ్మశానవాటికలో నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.


చంద్రమౌళి ఇంట్లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత


మధుసూదనరావు పాడె మోస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్

ఉగ్రవాదుల్ని ఏరిపారేయాలి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

» మధుసూదన్‌రావు, చంద్రమౌళి కుటుంబాలకు పరామర్శ

» నివాళులర్పించిన మంత్రులు అనిత, ఆనం, సత్యకుమార్, మనోహర్, డోలా

» బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు..


మధుసూదనరావు కటుంబ సభ్యులను ఓదారుస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కావలి, విశాఖపట్నం, బీచ్‌రోడ్డు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు, విశాఖకు చెందిన చంద్రమౌళి మృతదేహాలను ఆయన గురువారం సందర్శించి నివాళులర్పించారు. కావలిలో జరిగిన కార్యక్రమంలో పవన్‌తోపాటు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, కావలి, సర్వేపల్లి, ఉదయగిరి ఎమ్మెల్యేలు వెంకటక్రిష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేశ్.. పాల్గొన్నారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ... భార్య, పిల్లల కళ్లెదుటే మధుసూదన్‌రావును ఉగ్రవాదులు అతికిరాతకంగా కాల్చి చంపారని, ఈ ఘటన ఎలా జరిగిందో వాళ్ల కుటుంబ సభ్యులు చెబుతుంటే తనకే పేగులు మెలపెట్టినట్టుగా ఉంద న్నారు. కాగా, ఉగ్రవాద చర్యల వల్ల నష్టపోయిన కటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుం దని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ప్రకటించినట్లు చెప్పారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి ఘటనను చీకటి రోజుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అభివర్ణించారు. పరామర్శించిన వారిలో ఎస్పీ క్రిష్ణకాంత్, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డి, బీజేపీ, జనసేనతోపాటు వామపక్ష పార్టీల నాయకులు ఉన్నారు. అనంతరం మధుసూదనరావు అంతిమ యాత్రను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు.

చంద్రమౌళి కుటుంబానికి పవన్ పరామర్శ

పహల్గాం ఘటనలో మృతిచెందిన విశాఖ వాసి చంద్రమౌళి కుటుంబాన్ని పవన్‌కల్యాణ్ గురువారం రాత్రి పరామర్శించారు. ఆయన రాత్రి 8.15 గంటలకు విమానంలో విశాఖకు వచ్చారు. ముందుగా జిల్లా పరిషత్ జంక్షన్ దగ్గరున్న కనకదుర్గ ఆస్పత్రిలో చంద్రమౌళి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి పాండురంగాపురంలో ఉన్న చంద్రమౌళి నివాసానికి వెళ్లి ఆయన భార్య నాగమణి, కుటుంబీకులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పవన్ వెంట జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి వంగలపూడి అనిత, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఉన్నారు. కాగా, చంద్రమౌళి కుటుంబానికి అండగా ఉంటామని విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు. చంద్రమౌళి కుటుంబసభ్యులకు గురువారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చెక్కును అందజేశారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ.. పర్యాటకులపై ముష్కరుల దాడి దుర్మార్గ చర్య అని అన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ.. ఉగ్రవాదులు అమాయకుల ప్రాణాలు తీశారని విచారం వ్యక్తం చేశారు.

పీపీపీతో స్వర్ణాంధ్ర లక్ష్యాలు సులువు

» మూలధన వ్యయం పెంచేందుకు దోహదం: సీఎం చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలు సులువుగా సాధించాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా రావాలన్నా ప్రభుత్వ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానమే ఉత్తమ మార్గమని సీఎం చంద్రబాబు అన్నారు. వెలగపూడి సచివాలయంలో గురువారం పీపీపీ విధానాన్ని విస్తృత పరచడంపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు వీలుగా పీపీపీ విధానంలో అభివృద్ధి ప్రాజెక్టులను పెద్దఎత్తున చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారులను అనుసంధానిస్తూ జిల్లా యూనిట్‌గా రహదారుల నిర్మాణం, పోర్టులు, వైద్యరంగం, పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల్లో ఈ విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటా మరింత పెంచేందుకు పీపీపీ దోహదపడుతుందని చెప్పారు. కేంద్రం "ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ ఫండ్" ద్వారా రాష్ట్రాలకు పీపీపీ ప్రణాళికలు రూపొందించేలా ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు. పీపీపీ విధానంలో భూకేటాయింపులు, సకాలంలో అనుమతులు మంజూరు చేయకపోవడం వంటి సమస్యలను అధిగమించాలని అధికారులకు సూచించారు.

1422 కి.మీ. రోడ్లకు డీపీఆర్‌లు

రాష్ట్రంలో 1,422 కిమీ పొడవైన 20 రహదారులకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయని సీఎం దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. ప్రాధాన్యాలను బట్టి వీటిని 8,899 కి.మీలకు పెంచే వీలుందని సీఎం సూచించారు. ఖనిజ వనరులను ఏపీఎండీసీ ద్వారా నిర్వహిస్తే రాష్ట్రం అదనంగా తొమ్మిది వేల కోట్లను పొందే వీలుందన్నారు. పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పనకు ఏపీఐఐసీ సహకారంతో రూ. 5,000 కోట్ల రుణాలు సేకరించాలన్నారు. సుస్థిర ఆదాయాన్ని పెంచేందుకు రాజధానిని అభివృద్ధి చేయాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

లోకం తీరు



వందేళ్ల కోసం
అమరావతికి ప్లానింగ్

» 58 రోజుల్లోనే 34వేల ఎకరాలు ఇచ్చిన రైతులు

» 2న ప్రధాని సభలో రైతులకు గౌరవం

» మంత్రి నారాయణ వెల్లడి

» ప్రధాని సభ ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ/తుళ్లూరు (వెలగపూడి), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే వంద సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణం చేపట్టారని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో మే 2న జరగనున్న ప్రధాని సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులను ప్రధాని సభలో గౌరవించాలని సీఎం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అమరావతి రైతులు కేవలం 54 రోజుల్లోనే 34 వేల ఎకరాలను రాజధాని అభివృద్ధి కోసం ఇచ్చారని గుర్తుచేశారు. అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉండాలనేది సీఎం సంకల్పం అని చెప్పారు. రాజధానికి అదనపు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్నామని, ప్రజలు అంగీకరిస్తేనే ల్యాండ్ పూలింగ్ చేస్తామన్నారు. స్మార్ట్ ఇండస్ట్రీలు వస్తేనే రాష్ట్రం, నగరం అభివృద్ధి చెందుతాయన్నారు.

11 చోట్ల పార్కింగ్

ప్రధాని పర్యటన ఏర్పాట్లు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. సభ కోసం 11 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామన్నారు. 5 లక్షలు మంది వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సభలో చల్లదనం కోసం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

పాలనలో మానవీయకోణం

» వేగవంతమైన సేవలకు ఏఐ వినియోగం

» స్మార్ట్ పాలనకు '4.ఓ'లో అధిక ప్రాధాన్యం

» పాత పాలన పంథాను అధికారులు మార్చుకోవాలి

» గతంలోని పద్ధతులకు నూతన సాంకేతికత జోడించాలి

» రాష్ట్రంలో త్వరలోనే భారీ డేటా లేక్ ఏర్పాటు చేస్తాం

» శాఖాధిపతులకు ఏఐ వర్క్‌షాప్ ప్రారంభంలో సీఎం


స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడానికి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను వినియోగించినా, పాలనలో మానవీయ కోణం అత్యంత ముఖ్యమని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. టెక్నాలజీ వినియోగంతో రియల్ టైమ్ పాలనను ప్రజలకు అందించాలని చెప్పారు. స్మార్ట్ పాలనకు '4.ఓ'లో అత్యంత ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో గురువారం ప్రభుత్వశాఖాధిపతుల కోసం ఏర్పాటు చేసిన రెండు రోజుల ఏఐ వర్క్‌షాపును సీఎం చంద్రబాబు ప్రారంభించారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్" అంశంపై జరిగిన వర్క్‌షాప్‌లో అధికారులకు పలు సూచనలు చేస్తూ సీఎం ప్రసంగించారు. పాలనలో ఏఐకు అధిక ప్రాధాన్యం ఇస్తూనే మానవీయ కోణంలో ప్రజలకు సేవలందిస్తామని, సంక్షేమాన్ని అమలు చేస్తామని సీఎం చెప్పారు. ఏఐ ఆధారిత స్మార్ట్ పాలనా వ్యవస్థ వల్ల రియల్ టైమ్‌లో వేగవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. పాత పరిపాలనా విధానాలకు నూతన సాంకేతిక నైపుణ్యాలను జోడిస్తామన్నారు. అధికారులు ఈ దిశలో ప్రజా సేవలకు సిద్ధం కావాలని సీఎం పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో త్వరలోనే భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను ఆదేశించారు.

ఇంటర్నెట్ కోసం ఎదురు చూసే రోజులవి

టెక్నాలజీలో వచ్చిన మార్పులను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. ఒకప్పుడు ఇంటర్నెట్ కనెక్షన్ కోసం ఎదురు చూసేవారమని, 2 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ సేవలు దొరకడమే గగనమయ్యేదని గత రోజులను గుర్తుచేశారు. ఆ దశ నుంచి వేగవంతమైన ఇంటర్నెట్ సేవలతో కూడిన పాలన అందించే స్థాయికి ఎదిగామని చెప్పారు. ఇప్పుడు డేటా ఆధారిత పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ముప్పయి ఏళ్ల క్రితం చేసిన ప్రయత్నంతో నేడు టెక్నాలజీలో ఏపీ కీలకంగా ముందుందని అన్నారు. ఒకప్పుడు ఇస్రో ఉపగ్రహ ప్రయోగాలను ఆశ్చర్యంగా చూశామని, ఇప్పుడు మన స్టార్టప్‌లు రూ. 30 కోట్లతో ఉపగ్రహాలను తయారు చేస్తున్నాయని చంద్రబాబు చెప్పారు. దీంతో .. ప్రపంచం మనవైపు గర్వంగా చూస్తోందని చెప్పారు.

వేగంగా భూ రికార్డుల డిజిటలైజేషన్

భూ రికార్డుల డిజిటలైజేషన్ కార్యక్రమం వేగవంతంగా చేపట్టాలని అధికారులకు చంద్రబాబు ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల్లో అత్యధికంగా.. 75 శాతం భూములకు చెందినవే ఉన్నాయని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థల్లో మేధోసంపత్తి ఉన్నవారు ఉన్నా ఇంకా పాత విధానంలోనే పాలన జరుగుతోందని, ఈ పంథాను అధికారులు మార్చుకోవాల్సి ఉందని సీఎం అన్నారు. ఈ రెండు రోజుల పాలనాధికారుల ఏఐ వర్క్‌షాప్ దేశానికి ఒక ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఇలాంటి వర్క్‌షాప్ పాలనకు అత్యంత ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

» సాయంత్రం 4 గంటలకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఖరారు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీ వెళ్తున్నారు. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని మోదీని స్వయంగా ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రధానితో అపాయింట్‌మెంట్ ఖరారైంది. మే 2న అమరావతిలో సుమారు రూ.లక్ష కోట్ల పనులకు ప్రధాని చేతుల మీదుగా శ్రీకారం చుట్టించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆయన అమరావతి పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది.

సంకల్పంతో సవాళ్లు దాటొచ్చు

» నారాయణ కుమార్తెల ఎదుగుదల చూసి ఆశ్చర్యపోయా

» శరణి రాసిన 'మైండ్‌సెట్ షిఫ్ట్' ఆవిష్కరణలో చంద్రబాబు

» మన మైండ్ మంచేదో చెబుతుంది: చిరంజీవి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, నారాయణ, చిరంజీవి, గంటా

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నమ్మకానికి సంకల్పం తోడైతే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చని, మనిషి దృఢసంకల్పం ఎంతలా పనిచేస్తుందనడానికి ఎన్టీఆర్ జీవితమే ఒక ఉదాహరణ అని సీఎం చంద్రబాబు అన్నారు. మంత్రి నారాయణ కుమార్తె శరణి రచించిన 'మైండ్‌సెట్ షిఫ్ట్' పుస్తకాన్ని గురువారం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఆవిష్కరించారు. తొలి కాపీని మెగాస్టార్ చిరంజీవికి అందజేశారు. అనంతరం శరణి అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు, చిరంజీవి సరదాగా సమాధానం చెప్పారు. నారాయణ కుమార్తెల ఎదుగుదలను చూసి ఆశ్చర్యపోయానని, వాళ్లను ఇప్పటిదాకా చిన్న పిల్లలుగానే చూశానని సీఎం అన్నారు. నారాయణ అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమన్నారు. చిరంజీవి ఒక సంకల్పం తీసుకుని అద్భుత నటుడయ్యారని, తన జీవితంలో పాజిటివ్ మైండ్‌సెట్ అభివృద్ధి చేసుకుని లక్ష్యాన్ని చేధించేవరకు నిరంతర కృషి చేశారని ప్రశంసించారు. తాను సీఎంగా ఉన్న సమయంలో చిరంజీవి కలిశారని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల కోసం బ్లడ్ బ్యాంక్ పెడతానంటే స్థలం కేటాయించానని గుర్తు చేశారు. శరణి అడిగిన ప్రశ్నకు చిరంజీవి సమాధానం చెబుతూ.. మన మైండ్ మనకు ఏది మంచిదో చెబుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మైండ్‌సెట్ ఎప్పుడూ నాయకత్వ లక్షణాలతో ఉంటుందన్నారు. మహా నాయకుడిగా ఎదిగి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఇలాంటి నాయకుల మైండ్‌సెట్ మనకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాప సూచకంగా నిమిషం మౌనం పాటించారు.

హెల్త్ వర్సిటీ వీసీగా చంద్రశేఖర్

» ఉత్తర్వులు జారీ చేసిన స్పెషల్ సీఎస్ కృష్ణబాబు

» ప్రభుత్వ వైద్య రంగంలో 38 ఏళ్ల పాటు సేవలు



అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా డాక్టర్ పి. చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘ అనుభవం కలిగిన గుండె వైద్య నిపుణుడిగా పూలల చంద్రశేఖర్‌కు గుర్తింపు ఉంది. 1960లో కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పాలకుర్తి గ్రామంలో జన్మించిన చంద్రశేఖర్ ప్రభుత్వ వైద్యరంగంలో 38ఏళ్ల పాటు సేవలు అందించారు. 1987లో చిత్తూరు జిల్లాలోని శ్రీరంగరాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా ప్రస్థానం ప్రారంభించారు. ఆ తర్వాత ఏడాది తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి ఏడేళ్లు పని చేశారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్, ప్రొఫెసర్‌గా కీలకమైన విధులు నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా, ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆయన 2023లో పదవీ విరమణ చేశారు. చివరి నాలుగేళ్లు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హోదాలో ఉన్న ఆయన కొవిడ్ సమయంలో ప్రభుత్వానికి కీలకమైన సలహాలు, సూచనలు అందించారు. డీఎంఈ డైరెక్టర్‌గా నెల రోజుల పాటు అదనపు బాధ్యతలు నిర్వహించారు. గుండె చికిత్స, వైద్య విద్యాబోధన, పరిపాలన రంగాల్లో చంద్రశేఖర్ విశేష అనుభవం గడించారు. గుండె, దాని సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించేందుకు పలు పుస్తకాలు, కరపత్రాలను ప్రచురించారు. గుండె నిపుణులతో కూడిన పలు జాతీయ సంస్థల్లో సభ్యుడిగా ఉన్నారు. లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ 2023లో ఆయనకు సర్టిఫికెట్ ఆఫ్ కమిట్మెంట్‌ను ప్రదానం చేసింది. చంద్రశేఖర్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అభినందించారు. వర్సిటీ సేవలను మరింత విస్తరించాలని సూచించారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు

అనుభవం, అర్హత ఉన్న చంద్రశేఖర్‌ను డీఎంఈ కానివ్వకుండా గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. రాష్ట్రంలోనే అత్యంత సీనియర్ వైద్యుడైనప్పటికీ డైరెక్టర్ హోదా రాకుండా అడ్డుపడింది. దీంతో ఆయన అడిషనల్ డైరెక్టర్ హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఆయనకు గుర్తింపు ఇచ్చి, హెల్త్ వర్సిటీ వీసీగా నియమించింది.

సెకీ-జగన్ డీల్‌పై న్యాయ విచారణ

» అదానీ ఒప్పందంతో జనంపై భారం.. బెజవాడ అఖిలపక్ష భేటీ డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో 2021లో అప్పటి జగన్ ప్రభుత్వం కుదుర్చుకున్న కరెంటు కొనుగోలు ఒప్పందంపై న్యాయవిచారణ జరపాలని పలువురు ప్రముఖులు డిమాండ్‌చేశారు. ఈ ఒప్పందంతో ప్రజలపై రూ.లక్షలాది కోట్ల భారంపడటమే కాకుండా, అమెరికా కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలయిందన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాలని విజయవాడలో గురువారం జరిగిన భేటీలో కోరారు. సెకీ ద్వారా అదానీతో జరిగిన ఒప్పందం కారణంగా రాష్ట్ర ప్రజలపై ఇరవై ఐదేళ్లపాటు మోయలేని భారం పడనుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్. బాబూరావు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్తు ఉత్పత్తి ధరలు తగ్గుతుండగా, సెకీతో గత ప్రభుత్వం యూనిట్‌కు రూ.2.49కు ఒప్పందం చేసుకోవడం ఏమిటని మండిపడ్డారు. ఈ ఒప్పందం వల్ల విద్యుత్తు రంగం సంక్షోభంలో పడిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ ఆవేదన వ్యక్తంచేశారు. "సెకీతో 7వేల మెగావాట్ల కరెంటు కొనుగోలు ఒప్పందాలను జగన్ చేసుకున్నారు. దీని వెనుక ముడుపుల వ్యవహారం నడిచింది. ఆధారాలు ఉన్నందున ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఏసీబీ విచారణకు ఆదేశించాలి. సుప్రీం కోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి తో విచారణ జరిపించాలి" అని పీవీ రమేశ్ డిమాండ్ చేశారు. సెకీ-అదానీ విద్యుత్తు ఒప్పందాల్లో రూ.1,750 కోట్ల ముడుపులు జగన్‌కు ముట్టాయంటూ అమెరికా ఫెడరల్ కోర్టులో చార్జిషీట్ దాఖలైందని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపించారు. జగన్ హయాం సోలార్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. సెంటర్ ఫర్ లిబర్టీ అనే సంస్థ కన్వీనర్ నల్లమోతు చక్రవర్తి, సీపీఐ నేత రావులపల్లి రవీంద్రనాథ్, కాంగ్రెస్ నేత కొలనుకొండ శివాజీ, విద్యుత్‌రంగ నిపుణులు పాల్గొన్నారు.

ఇక ‘స్థానిక ప్రభుత్వాలు’

ప్రతి పంచాయతీలో జాతీయ సమగ్రతా ప్రాంగణం: పవన్



అభివృద్ధి పనులకు సంబంధించిన స్టాళ్లను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు అన్ని రంగాల్లో స్వావలంబన సాధించి స్థానిక ప్రభుత్వాలుగా మారేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపిచ్చారు. దానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీలో జాతీయ సమగ్రతా ప్రాంగణాలు నెలకొల్పాలని, అక్కడే జాతీయ స్తూపం నిర్మించాలన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామ పంచాయతీలు బలంగా ఎదగాలని.. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమన్వయంతో ఐక్యంగా పనిచేయాలని.. అన్ని రంగాల్లో స్వయంప్రతిపత్తి సాధించాలని.. అభివృద్ధి, ఆకాంక్షలు కలగలిపి స్వర్ణ గ్రామాలుగా వెలగాలని ఆకాంక్షించారు. ‘కూటమి ప్రభుత్వంలో చాలా ఇష్టంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను చేపట్టాను. 2 నెలల పాటు సమగ్ర పరిశీలన చేసిన తర్వాత అధికారుల సమావేశంలో నేను చెప్పింది ఒక్కటే.. ఏ పనికి ఎంత కేటాయింపు జరిగిందో అదే పనికి నిధులు ఖర్చు చేయాలి. పారదర్శకంగా పనులు జరగాలని.. ఎలాంటి మళ్లింపులు, వృధా ఖర్చులు లేకుండా పల్లెల్లో సౌకర్యాలు, వసతులు సమకూరాలని చెప్పాను. ఆ ప్రకారమే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి’ అని తెలిపారు. సిబ్బంది బదిలీలు ఎన్నడూ జరగనంత పారదర్శకంగా జరిపామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సమూల మార్పులు తీసుకొచ్చామని, దీని ఫలితమే సమష్టి కృషితో పల్లెల్లో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ విషయంలో ఎంతో కృషి చేస్తున్నారంటూ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులు త్వరలోనే అందుతాయని భరోసా ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి ఇంకా ఏం చెప్పారంటే..

ప్రజలకు మేలు చేయాలని..

‘నాకు పాలనాపరమైన అనుభవం లేకున్నా, ప్రజలకు మేలు చేయాలనే త్రికరణ శుద్ధి ఉంది. రాజకీయాలకు అతీతంగా పంచాయతీలకు నిధులు అందిస్తున్నాం. గతంలో అవి కులాలు, రాజకీయాలు, వర్గపోరుతో సతమతమయ్యేవి. దీనిని క్రమంగా అధిగమిస్తున్నాం. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే సర్పంచ్‌ల ఆత్మగౌరవం నిలిపేలా జాతీయ పండుగలైన రిపబ్లిక్‌డే, ఆగస్టు 15కు ఖర్చు చేసేందుకు నిధులు పెంచాం. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు తగిన గౌరవం ఇస్తున్నాం. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్లక్ష్యం చేసింది. వాటి నిధులను ఇష్టానికి వాడేసింది. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు, వాటికి రావలసిన నిధులను నేరుగా వాటి ఖాతాల్లోనే వేశాం. రూ.1,121 కోట్ల ఆర్థిక సంఘం నిధులను అందించడం గొప్ప విషయం.

కూలీలనడం బాగోలేదు..

ఉపాధి హామీ పథకంలో పని చేసే వారిని కూలీలు అని పిలవడం మనసును కలిచివేస్తోంది. గ్రామాల అభివృద్ధి చోదకులుగా పనిచేస్తున్న వారిని అలా పిలువడం అంత బాగా లేదు. కూలీ అనే పదం బ్రిటిష్‌వారు భారతీయులతో వెట్టిచాకిరి చేయించుకునేందుకు ఉపయోగించిన పదం. దానిని ఇప్పుడు మనం ఉపయోగించడం సమంజసం కాదు. కూలీ అంటే చాకిరీ చేసేవారుగా అనిపిస్తోంది. ఇక నుంచి ఉపాధి శ్రామికులు లేదా నేస్తాలుగా పిలుద్దాం.

కలప పెంచుదాం.. దేశానికి సేవ చేద్దాం...

భారతదేశం ఏటా రూ.20 వేల కోట్ల కలపను దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఖర్చవుతోంది. దేశీయ అవసరాలకు ఈ కలపను దేశీయంగానే అందించే ఏర్పాటు చేస్తే ఇటు పంచాయతీలకు ఆర్థిక వృద్ధితోపాటు విదేశీ మారకద్రవ్యం ఖర్చు కాకుండా కాపాడి దేశసేవ చేసిన వాళ్లమవుతాం. పంచాయతీల్లో విలువైన ఖాళీ స్థలాల్లో కలప పెంచేందుకు ప్రోత్సహిస్తాం. దీనివల్ల పచ్చదనంతో పాటు ఆదాయం కూడా సమకూరుతుంది. పంచాయతీలకు గతంలో ఆదాయం ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చేవారు. దానిని తొలగించి జనాభా ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చే ఏర్పాట్లు చేశాం. ఇంటి పన్నుల వసూళ్లు పెరిగాయి. 9 నెలల్లో రూ.800 కోట్లు వసూలైనట్లు లెక్కలు చెబుతున్నాయి.

భూమి లేకుండా అభివృద్ధి ఎలా?

రాష్ట్రంలోని అన్ని పంచాయతీల ఆస్తులు, భవనాలు, అన్యాక్రాంతమైన భూములపై సమగ్ర ఆడిట్ జరగాలి. నేను ఇటీవల రైల్వేకోడూరు నియోజకవర్గం మైసూరావారిపల్లెకు వెళ్లినప్పుడు ఆ గ్రామంలో క్రీడా స్థలం ఏర్పాటుకు పంచాయతీ వద్ద భూమి లేదని చెప్పారు. నాకు ఆశ్చర్యం కలిగింది. తర్వాత నా సొంత నిధులతో ప్రైవేటు స్థలం కొనుగోలు చేసి అందించాం. పంచాయతీకి భూమి లేకుంటే అభివృద్ధిలో ఎలా ముందుకెళ్లగలం? గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలే కాదు.. జాతి సమగ్రతకు నిండు రూపాలు కావాలి. ప్రతి గ్రామంలో ఎవరెవరివో విగ్రహాలు పెడుతున్నారు. అలా కాకుండా ప్రతి పంచాయతీలోనూ ఓ జాతీయ సమగ్రతకు ప్రాంగణం, అందులో జాతీయ సమగ్రత స్తూపం ఉండాలి. ఇక్కడ దేశం కోసం, దేశ ఐక్యత కోసం పనిచేసిన వారి ప్రతిరూపాలు ఉండాలి. దీనిపై ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తే.. కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా. అవసరమైతే ప్రధాని మోదీతో చర్చిస్తా. సర్పంచ్‌లకు గౌరవ వేతనాలు పెంచాలని సంఘం నేత పాపారావు కోరారు. పరిశీలించి పరిష్కరిస్తాం. మా ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రూ.10669 కోట్ల పనులు జరిగాయి. 13,326 గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలను చక్కగా అమలు చేశాం. 4 వేల కి.మీ మేర సీసీరోడ్లు, 21,564 గోకులాలు, 12,950 నీటి తొట్టెలు, 20,286 పంట కుంటలను అతి తక్కువ కాలంలో పూర్తి చేయడం సమష్టి కృషికి నిదర్శనం. దీంతోపాటు అడవి తల్లి బాటలో భాగంగా రూ.1,005 కోట్లతో 1069 కి.మీ మేర రోడ్లను వేసి డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి ముందడుగు వేస్తున్నాం.

ఉగ్రదాడి అమరులకు నివాళులు...

కశ్మీర్‌లో పేలిన తూటా దేశాన్ని కన్నీరు పెట్టేలా చేసిందని, ప్రతి ఒక్కరూ ఆవేదన చెందారని పవన్ అన్నారు. కార్యక్రమంలో ముందుగా పహల్గాం ఉగ్ర దాడిలో అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన సుమారు 15 విభాగాల్లో వివిధ స్థాయుల్లో ఉత్తమ పనితీరు కనబరచిన 74 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను పవన్ కల్యాణ్ తిలకించారు. కార్యక్రమంలో శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్‌డీపీఆర్ కమిషనర్ ముత్యాలరాజు, గుంటూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, వినోద్ కుమార్, టీఎస్ చేతన్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్, ఈఎన్‌సీలు బాలూనాయక్, గాయత్రీదేవి, ఇతర ఉన్నతాధికారులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాపారావు పాల్గొన్నారు.



అండమాన్‌లో విజయ్‌పురా చైర్మన్‌గా ఎన్నికైన సాహుల్ హమీద్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

అండమాన్‌లో టీడీపీకి మరో విజయం

- శ్రీవిజయపురం మున్సిపల్ కౌన్సిల్ కైవసం
- చైర్మన్‌గా షాహుల్ హమీద్ ఎన్నిక.. సీఎం చంద్రబాబు హర్షం

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అండమాన్ నికోబార్ దీవుల్లో కూటమి ప్రభుత్వం మరో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. దక్షిణ అండమాన్‌లోని శ్రీవిజయపురం మున్సిపల్ కౌన్సిల్(ఎస్‌వీపీఎంసీ) చైర్‌పర్సన్‌గా టీడీపీకి చెందిన ఎస్.షాహుల్ హమీద్ ఎన్నికయ్యారు. ఆయన టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీచేశారు. గురువారం జరిగిన ఎన్నికలో మొత్తం 24 ఓట్లకు గాను 15 ఓట్లు సాధించి.. ప్రస్తుత చైర్‌పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి సుదీప్ రాయ్ శర్మను ఓడించారు. ఈ విజయంతో అండమాన్-నికోబార్ దీవుల్లో రెండో పట్టణాన్ని కూడా టీడీపీ గెలుచుకున్నట్లయింది. అంతకుముందు పోర్టు బ్లెయిర్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని టీడీపీకి చెందిన మహిళా కార్పొరేటర్ సెల్వి చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ ఇన్‌చార్జి వి.మాధవనాయుడు శ్రీవిజయపురంలోనే ఉండి ఎన్నికల సన్నాహాలను పర్యవేక్షించారు. ఈ విజయం.. టీడీపీ-బీజేపీ కూటమిపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని అండమాన్, నికోబార్ దీవుల టీడీపీ అధ్యక్షుడు ఎస్.మాణిక్యరావ్ యాదవ్ అన్నారు. హమీద్ ఎన్నికపై టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏదైనా ప్రజాసంక్షేమమే ఎజెండాగా టీడీపీ పనిచేస్తుందన్నారు. ఈ విజయాన్ని అందించిన అండమాన్ ప్రజలకు ఆయన ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

436 ఖనిజ లీజులు ఏపీఎండీసీకే

- మైనింగ్ హక్కులు కూడా అప్పగింత
- రూ.9వేల కోట్ల రుణం కోసం కీలక నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా తీసుకునే అప్పుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 436 మైనర్ మినరల్ క్వారీల లీజులను, ఖనిజాల హక్కులను పూర్తిగా ఏపీఎండీసీకి నామినేషన్ ప్రాతిపదికన అప్పగిస్తూ గురువారం గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు (జీఓ-69) జారీ చేశారు. ఈ హక్కులను గ్యారెంటీగా చూపించి ఏపీఎండీసీ రూ.9000 కోట్ల అప్పును బాండ్ల రూపంలో సేకరించేందుకు వెసులుబాటు లభించింది. ఆ రుణానికి గ్యారెంటీ ఇస్తూ ప్రభుత్వం గత నెలలోనే ఉత్తర్వులు(జీఓ-33) జారీ చేసింది. ఇప్పుడు.. తన పరిధిలోకి వచ్చిన 436 ఖనిజ లీజులు, మైనింగ్ హక్కులను ఏపీఎండీసీ తన ఆస్తులుగా చూపించి... అప్పు ఇచ్చే సంస్థకు గ్యారెంటీగా చూపించనుంది. “ఏపీఎండీసీ నమ్మకమైన డిబెంచర్ ట్రస్టీని నియమించుకొని, బాండ్లు జారీ చేయాల్సి వస్తే అందుకు ప్రతిగా ఆ ట్రస్టీకి 436 ఖనిజాల లీజు హక్కులు, మైనింగ్ హక్కులను బదిలీ చేయవచ్చు” అని ప్రభుత్వం జీఓలో పేర్కొంది. ఈ మేరకు జిల్లాల వారీగా మైనింగ్ అధికారులు లీజు ఒప్పందాలు చేసుకోవాలని సర్కారు ఆదేశించింది. “లిఖితపూర్వక లీజు ఒప్పందాలు ముగిసిన తర్వాత ఆ మైన్స్‌ల నిర్వహణ బాధ్యత ఎండీసీ చూసుకుంటుంది” అని తెలిపింది.

సత్యసాయిపై రూ.100 నాణెం: కేంద్రం గెజిట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: సత్యసాయి శతజయంతిని పురస్కరించుకుని వంద రూపాయల స్మారక నాణేన్ని విడుదల చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 22న గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది.

కృష్ణా జలాల వివాదంపై విచారణ 8కి వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పునః పంపిణీ కోసం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు అదనపు విధివిధానాలు జారీ చేస్తూ కేంద్రం విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ వ్యాజ్యం గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే దీనిని సుదీర్ఘంగా విచారించాల్సిన అవసరం ఉందని, మే 8న వాదనలు వింటామని ధర్మాసనం స్పష్టంచేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ చేపడితే తనకు తీరని నష్టం వాటిల్లుతుందని ఏపీ బుధవారం విచారణ సందర్భంగా ఆందోళన వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే.

‘మద్యం ఉత్పత్తి’లో నాకేంటి?

ఎక్సైజ్ శాఖలో ఓ అధికారి చేతివాటం

- ఈఎన్ఏ అలాట్‌మెంట్‌లో అడ్డంకులు
- కంపెనీల నుంచి ముడుపుల డిమాండ్
- ఫిర్యాదు చేసే యోచనలో కంపెనీలు
- అనుమతులు ఆపుతున్నారని ఆవేదన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మద్యం ఉత్పత్తి, అమ్మకాల్లో పారదర్శకత ఉండాలని ప్రభుత్వం చెబుతుంటే.. ‘ఉత్పత్తికి అనుమతిస్తే నాకేంటి’ అంటూ ఎక్సైజ్ శాఖలో ఓ అధికారి అడ్డంకులు సృష్టిస్తున్నారు. మద్యం ఉత్పత్తికి ముడిసరుకు అయిన ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్(ఈఎన్ఏ) సరఫరా అనుమతులు సకాలంలో ఇవ్వకుండా మద్యం కంపెనీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో మద్యం ఉత్పత్తి అంతరాయాల మయంగా మారుతోందని కంపెనీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో 20 డిస్టిలరీలు ఉండగా.. వాటిలో కొన్నింటిలో మాత్రమే ఈఎన్ఏ ఉత్పత్తి ఉంది. ఈఎన్ఏ ఉత్పత్తి లేని డిస్టిలరీల్లో మద్యం తయారు చేసుకునే కంపెనీలు.. ఫలానా డిస్టిలరీ నుంచి ఈఎన్ఏ తెచ్చుకుంటామని ఎక్సైజ్‌కు దరఖాస్తు చేసుకుంటాయి. లక్ష లీటర్ల వరకు అయితే మధ్య స్థాయి అధికారులు, లక్ష దాటితే ఉన్నతాధికారులు ఈఎన్ఏ అలాట్‌మెంట్ అనుమతులు జారీ చేయాలి. 4 లీటర్ల ఈఎన్ఏతో ఒక కేసు మద్యం ఉత్పత్తి అవుతుంది. అందువల్ల ఎక్కువ కంపెనీలు లక్ష లీటర్ల కంటే తక్కువే తీసుకుంటూ ఉంటాయి. కాగా ఎక్సైజ్ శాఖలోని ఓ మధ్య స్థాయి అధికారి అనుమతులు జారీ చేయకుండా ముడుపులు డిమాండ్ చేస్తున్నారని కంపెనీలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 30కి పైగా కంపెనీలు మద్యం ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రతి కంపెనీ నెలకు ఇంత ఇవ్వాలనే డిమాండ్ పెట్టి ఆ అధికారి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ఆ మేరకు ముడుపులు సమర్పించని కంపెనీల ఫైళ్లు ఆలస్యంగా పరిష్కరిస్తున్నారని అంటున్నాయి. దీనిపై త్వరలో ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయాలని కంపెనీల ప్రతినిధులు భావిస్తున్నారు.



సీఎస్ఎస్ఆర్ పోటీల్లో ఏపీఎస్డీఆర్ఎఫ్‌కు తృతీయ స్థానం

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జాతీయ స్థాయిలో జరిగిన ‘కుప్పకూలిన నిర్మాణ శోధన, రక్షణ’ (కొలాప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ-సీఎస్ఎస్ఆర్)పై ఫైనల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ విపత్తు స్పందన దళం (ఏపీఎస్డీఆర్ఎఫ్) ప్రతిభను ప్రదర్శించి, మూడో స్థానం సాధించింది. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన ఏపీఎస్డీఆర్ఎఫ్ టీమ్‌ను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఎస్డీఆర్ఎఫ్ విభాగాధిపతి రాజకుమారి గురువారం అభినందించారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి

బాబోయ్ ఎండలు..

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వాయవ్య గాలులతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం నెలకొంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 139 ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలపైనే నమోదయ్యాయి. నంద్యాల జిల్లా దొర్నిపాడులో 43.8, ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాలలో 43.7, కడప జిల్లా అట్లూరులో 43.6, విజయనగరంలో 42.8, కర్నూలు జిల్లా కామవరం, పల్నాడు జిల్లా నర్మలపాడులో 42.7, జంగమహేశ్వరపురంలో 42.5, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వక్ఫ్ ఆస్తుల రక్షణకు చర్యలు : మంత్రి ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠమైన కార్యాచరణ చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో వక్ఫ్ బోర్డు కార్యకలాపాలను ఆ శాఖ కార్యదర్శి శ్రీధర్‌తో కలిసి మంత్రి సమీక్షించారు. వక్ఫ్ చట్టానికి కొత్త సవరణల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, వక్ఫ్ ఆస్తుల రక్షణ అభివృద్ధి, లీజు ప్రక్రియ, అద్దెల పెంపు, తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై చర్చించారు.

జూన్ 1న పోలీసు ఫైనల్ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయబోతున్న 6,100 పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు జూన్ 1న తుది పరీక్ష నిర్వహించనున్నట్లు పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు(పీఆర్‌బీ) తెలిపింది. దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షల్లో అర్హత సాధించిన 38,910 మంది తుది పరీక్షకు ఎంపికైనట్లు బోర్డు పేర్కొంది. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతిల్లోని పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే రాత పరీక్షను జేఎన్‌టీయూ నిర్వహిస్తుందని పీఆర్‌బీ వివరించింది. అర్హత సాధించిన అభ్యర్థులు ఏపీ పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పీఆర్‌బీ ఛైర్మన్ మీనా ఒక ప్రకటనలో సూచించారు. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర పోలీసు శాఖలో 6,100పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం 2022 నవంబరు 28న పీఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల చేసింది. సివిల్ పోలీసు విభాగంలో 3,580(పురుష, మహిళా అభ్యర్థులు).. ఏపీ స్పెషల్ పోలీసు విభాగంలో 2,520(పురుష) పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రాథమిక రాత పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 4.90లక్షల మంది 2023 ఫిబ్రవరిలో పరీక్ష రాయగా 95వేల మంది మాత్రమే కనీస అర్హత మార్కులు సాధించారు. వారిని శారీరక, దేహదారుఢ్య పరీక్షలకు పిలవకుండా అప్పటి వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసింది. హోంగార్డుల కోటా విషయంలో కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో జగన్ ప్రభుత్వం ఆ నియామక ప్రక్రియను పూర్తిగా వదిలేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత అభ్యర్థులు కూటమి పెద్దలకు తమ ఇబ్బందులు చెప్పడంతో ప్రక్రియ ప్రారంభమైంది.

ఆన్‌లైన్‌లో ఉచిత డీఎస్సీ కోచింగ్

- ఇందుకు ‘ఆచార్య’ యాప్ రూపకల్పన
- ప్రారంభించిన బీసీ సంక్షేమ మంత్రి సవిత
- 24 గంటలూ ఓపెన్ చేసుకోవచ్చు యాప్‌లో మెటీరియల్, నిష్ణాతుల బోధనలు, పాత డీఎస్సీ ప్రశ్నపత్రాలు



డీఎస్సీ రాసే బీసీ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి సవిత

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులందరికీ ఆన్‌లైన్ ద్వారా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ‘ఆచార్య’ యాప్‌ను రూపొందించామని, దీని ద్వారా 24 గంటలపాటు ఉచిత కోచింగ్ ఉంటుందని వెల్లడించారు. గురువారం అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి సవిత ఆన్‌లైన్ ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను ప్రారంభించారు. డీఎస్సీ ద్వారా అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను బీసీ అభ్యర్థులే సాధించాలన్న లక్ష్యంతో బీసీ సంక్షేమశాఖ ద్వారా ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు. 26 జిల్లాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించామన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించామని, శిక్షణా కాలంలో నెలకు రూ.1,500 స్టైపండ్ మరో రూ.వెయ్యి పుస్తకాల కొనుగోలుకు అందజేశామని తెలిపారు. తాజాగా ఆఫ్‌లైన్‌గా కోచింగ్ పొందలేని గృహిణులు, సుదూర ప్రాంతవాసులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చిన్న ఉద్యోగాలు చేసేవారు, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారి కోసం ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఉచిత కోచింగ్ అందిస్తామని, ప్రస్తుతం 3,189 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

చాట్ బాక్స్ ద్వారా ప్రశ్నలు అడగొచ్చు

కాకినాడకు చెందిన శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఈ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆచార్య పేరుతో యాప్ రూపొందించారని పేర్కొన్నారు. ఇది 24 గంటలు పనిచేస్తుందని, అభ్యర్థులు రోజులో ఎన్నిసార్లు అయినా ఓపెన్ చేసేలా రూపొందించామన్నారు. ఇందులో నిష్ణాతులైన అధ్యాపకుల బోధనలు, అన్ని సబ్జెక్టులకు చెందిన మెటీరియల్, పాత డీఎస్సీ ప్రశ్నపత్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. యాప్‌లో చాట్ బాక్స్ రూపొందించామని, అందులో సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగితే.. సిబ్బంది తక్షణమే స్పందించి సమాధానాలు తెలుపుతారన్నారు. ఆఫ్‌లైన్‌లో డీఎస్సీ శిక్షణ పొందిన డీఎస్సీ అభ్యర్థులు కూడా ఆన్‌లైన్ శిక్షణకు అర్హులేనని మంత్రి తెలిపారు.

కాపు అభ్యర్థులకు ఉచిత కోచింగ్

డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్లు కాపు కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజికవర్గాల అభ్యర్థులు శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు https://mdfc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.

తెలంగాణలో ఆ 3 బ్యారేజీలూ ప్రమాదంలోనే!

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల యథాతథంగా పనికిరావు
- జాతీయ డ్యామ్ రక్షణ అథారిటీ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు పెను ప్రమాదంలో ఉన్నాయని జాతీయ ఆనకట్టల రక్షణ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) స్పష్టం చేసింది. ఈ బ్యారేజీలకు జరిగిన విస్తృత, పెను నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని...సమగ్ర పునర్‌నిర్మాణం, రీడిజైన్ చేయాలని పేర్కొంది. నిర్మాణ లోపాలు, డిజైన్ లోపాలు, నాణ్యత తనిఖీ లేకపోవడం, నీటి ఒత్తిడి ఎంత అన్నదానిపై తప్పుడు అంచనాలు... అన్నీ కలిసి సీకెంట్ పైల్స్ కూలిపోవడం, బ్యారేజ్ ఎగువ, దిగువల్లో రంధ్రాలు పడ్డాయని తేల్చింది. మూడు బ్యారేజీలకు విస్తృత, పెను నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టం ఇక్కడితోనే ఆగదని, నీటి ఒత్తిడి ఎక్కువైతే మొత్తం పూర్తి బ్యారేజీలకే ప్రమాదమని పేర్కొంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై ఎన్‌డీఎస్ఏను నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో కోరిన సంగతి తెలిసిందే. పలు పరీక్షలు చేసిన అనంతరం, దాదాపు 14 నెలల అధ్యయనం తర్వాత ఎన్‌డీఎస్ఏ తన నివేదికను గురువారం ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపించింది. అనేక కీలక సిఫార్సులు చేసింది. సమగ్ర పునర్ నిర్మాణ డిజైన్ చేయాలని, జియో ఫిజికల్ పరీక్షలు, జియో టెక్నికల్ పరీక్షలు చేసి, ఆధునిక హైడ్రాలిక్ నమూనా లు(నీటి ప్రవాహ ఒత్తిడికి సంబంధించిన నమూనాలు)ను ఉపయోగించి ఈ పునర్ నిర్మాణ రీడిజైన్ చేయాలని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు స్థిరత్వం, స్థితిస్థాపకతను నిర్ధారించేందుకు... అన్ని విభాగాల మధ్య సహకారం చాలా కీలకమని స్పష్టం చేసింది. నిర్మాణ సమయంలో నాణ్యతను తనిఖీ చేసే మంచి వ్యవస్థ లేదని, ప్రత్యేకించి కటాఫ్ గోడలు నీటి ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించలేదని తెలిపింది. ర్యాఫ్ట్‌కు, కటాఫ్ వాల్స్‌కు నేరుగా సంబంధం ఉందని చెప్పింది. బ్యారేజీలు దెబ్బతినడానికి ఈ రెండూ ప్రధాన కారణాలని తెలిపింది. బ్యారేజీపై అదే ఒత్తిడి పడితే మొత్తం బ్యారేజీ అంతా ప్రమాదంలో పడుతుందని వెల్లడించింది.

ట్రిపుల్ ఐటీల్లో దరఖాస్తులకు ఆహ్వానం

- నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 4,400 సీట్లు
- 27 నుంచి మే 20 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ

నూజివీడు టౌన్/వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో 4,400 సీట్లకు ఈ నెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మెరిట్ ప్రాతిపదికన ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సు కోసం ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలు పొందవచ్చు. రిజర్వేషన్ విధానాన్ని అనుసరించి మెరిట్, అర్హత పరీక్షలో ప్రతి సబ్జెక్టులో పొందిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయి. ఇందుకు సంబంధించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఇన్ లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తులను పంపాల్సి ఉంటుంది. జనరల్ అభ్యర్థులు రూ.300, రిజర్వు కేటగిరి అభ్యర్థులు రూ.200, ఇతర రాష్ట్రాల అభ్యర్థులు రూ.వెయ్యి దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రగులుతున్న ప్రతీకారం

పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండ దేశాన్ని కుదిపేస్తున్నది. ఆవేదనతోనూ, ఆగ్రహంతోనూ న్యూస్ చానెళ్ళలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. సోషల్ మీడియా ప్రతీకారేచ్ఛతో ఊగిపోతోంది. అనుచిత వ్యాఖ్యలు, ఉచితసలహాలు, ఫేక్ విడియోలతో సామాజికమాధ్యమాలు నిండిపోతున్నాయి. జరిగిన ఘోరానికి ప్రతిస్పందన ఏ విధంగా, ఏ స్థాయిలో ఉండాలన్నది పాలకులు నిర్ణయించాల్సిన అంశం. ప్రజాగ్రహం అర్థంచేసుకోదగినదే కానీ, వారి చర్యలూ చేష్టలూ ఒత్తిడిపెంచేందుకు దోహదం చేయకూడదు.

సౌదీ అరేబియాలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ, ఈ ఘోరం జరిగిన విషయం తెలియగానే పర్యటనను కుదించుకొని భారతదేశానికి చేరుకున్నారు. కార్యాలయానికో, నివాసానికో చేరేవరకూ ఆగకుండా విమానం నేలూనగానే విమానాశ్రయంలోనే ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తులతో సమావేశాన్ని నిర్వహించారు. గురువారం బిహార్‌లో ప్రసంగిస్తూ ఉగ్రవాదులను, వారిని వెనకేసుకొస్తున్నవారిని ఏ రీతిన శిక్షిస్తామో, ప్రపంచపు అంచులవరకూ ఎలా తరిమికొడతామో ప్రకటించారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగబోతున్న ఈ కీలకమైన రాష్ట్రాన్ని ప్రధాని తన హెచ్చరిక సందేశానికి వేదికగా ఎంచుకోవడమేమిటని కొందరి అభ్యంతరం. అయితే, హిందీలో ధాటీగా ప్రసంగిస్తున్న ప్రధాని మధ్యలో ఇంగ్లిష్‌లోకి మారి ఆ నాలుగుమాటలు చెప్పడం ప్రపంచానికంతటికీ తన సందేశం చేరాలన్న లక్ష్యంతోనే. రాబోయే రోజుల్లో ఏ చర్యలుంటాయో తెలియదుగానీ, ఇప్పటికే కొన్ని తక్షణ ప్రతీకార చర్యలైతే ప్రభుత్వం తీసుకుంది. సరిహద్దుల మూసివేత, దౌత్యసంబంధాల కుదింపు ఇత్యాదివాటికి తోడుగా, సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా ఉగ్రవాదానికి అండగా నిలుస్తున్న పాకిస్థాన్‌కు పెద్ద హెచ్చరికే చేసింది.

ఆరుదశాబ్దాలక్రితం ఆవిర్భవించిన ఈ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చాలా ఒప్పందాలకు స్ఫూర్తి. అయితే, ఈ మనం నిర్మించిన కిషన్‌గంగ, రాత్లె విద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ అభ్యంతరపెడుతున్న తరుణంలో, ఈ ఒప్పందాన్ని పునఃస్సమీక్షించుకుందామంటూ భారత్ ఇప్పటికే రెండుసార్లు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. కారణాలు ఏమైనప్పటికీ, మోదీ ప్రభుత్వం ఈ ఒప్పందానికి మొదటినుంచీ అనుకూలంగా లేని తరుణంలో, పహల్గాం ఘటన జరిగింది. ఇప్పుడు ఒప్పందాన్ని నిలుపుదల చేయడం ద్వారా తక్షణమే పాకిస్థాన్‌ను శిక్షించలేకపోవచ్చును గానీ, ఒక బలమైన హెచ్చరిక చేసినట్టయింది. ఇప్పటికైతే ఇండస్, ఝీలమ్, చీనాబ్ నదులమీద భారీ డ్యాములేమీ లేవు కనుక, దిగువకు పోయే నీటిని అడ్డుకోవడం సాధ్యం కాదు. కానీ, 80శాతం సింధుజలాలకు ఈ మూడునదులే కారణం కనుక, వాటిని నియంత్రించగలిగినపక్షంలో తాగు, సాగునీటికి, విద్యుదుత్పత్తికీ పాకిస్థాన్ కటకటలాడక తప్పదు. ఈ సంక్లిష్టమైన ప్రాంతంలో, భారీ ఆర్థిక కేటాయింపులతో, ఓ నాలుగేళ్ళపాటు శ్రమించి ప్రాజెక్టులు కట్టగలిగితే పాకిస్థాన్‌ను ఇబ్బందిపెట్టాలన్న లక్ష్యం నెరవేరుతుందని నిపుణుల అంచనా. ఇక, ఒప్పందం ప్రకారం మనం వినియోగించుకోగలిగే జలాలు కూడా పాకిస్థాన్‌కు పోతున్న నేపథ్యంలో వాటిని రావి, బియాస్ లేదా సట్లెజ్‌లోకి మళ్ళించేందుకు ఈ సందర్భంగా ప్రయత్నం చేయవచ్చు.


అఖిలపక్ష సమావేశంలో ఇంటలిజెన్స్ వైఫల్యం, కీలకమైన ప్రాంతాల్లో కెమెరాలు లేకపోవడం, సమాచారలోపం, వేలాదిమంది సైనికులు ఉన్నా యాభైమందిని కాపాడలేకపోవడం ఇత్యాదివి విపక్షాలు ప్రస్తావించినప్పటికీ, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వానికి అండగా నిలిచాయి. ఇక, పాకిస్థాన్ ప్రకటించిన ప్రతీకార చర్యల్లో సిమ్లా ఒప్పందం రద్దు ప్రధానమైనది. 1971నాటి భారీయుద్ధం అనంతరం మరుసటి ఏడాది జుల్ఫికర్ అలీ భుట్టో, ఇందిరాగాంధీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఇరుదేశాల సంబంధాలు అతుకుపడేందుకు ఉపకరించింది. ఉభయదేశాల మధ్య తలెత్తే ఘర్షణలు, సమస్యలు, వివాదాలు చర్చలద్వారా, పరిష్కారం కావాలని ఈ ఒప్పందం ఆకాంక్షిస్తోంది. కశ్మీర్ గురించి పాకిస్థాన్ మాట్లాడినప్పుడల్లా భారత్ ఈ ఒప్పందం వల్లనే గట్టిగా కొట్టిపారేయగలుగుతోంది. జమ్మూకశ్మీర్‌లో అధీనరేఖను గుర్తించడానికి కూడా ఇది ప్రాతిపాదిక. కొన్ని ఆదర్శాలు అటకెక్కిపోవడం, అడపాదడపా ఉల్లంఘనలను అటుంచితే, ఈ ఒప్పందం రద్దుకావడం కశ్మీర్ సహా చాలా అంశాలను సమస్యాత్మకంగా మార్చవచ్చు. పహల్గాం దారుణం ఇప్పటికే దిగజారిన భారత్-పాక్ సంబంధాలను ప్రమాదంలో పడవేసింది. రాబోయే రోజుల్లో దౌత్య, సైనికపరమైన సంక్షోభాలు అనేకం చూడవలసి రావచ్చు.

మరుగునపడ్డ మరో జలియన్‌వాలాబాగ్!

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 1919 ఏప్రిల్ 13న జరిగిన జలియన్‌వాలాబాగ్ దురంతానికి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇది మనందరికీ తెలిసిందే. కానీ చరిత్రకెక్కని ఇలాంటి ఓ ఉదంతమే మన కర్ణాటక-ఆంధ్ర సరిహద్దుల్లోనూ జరిగింది. అప్పటి అనంతపురం, కోలారు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన 'విదురాశ్వత్థం' అనే గ్రామ సమీపంలో 1938 ఏప్రిల్ 25న ఈ ఉదంతం జరిగింది.

1938 ఫిబ్రవరి 19–22 తేదీల్లో గుజరాత్ ప్రాంతం, సూరత్ జిల్లాలోని హరిపురాలో జాతీయ కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల తీర్మానాల కారణంగానే మైసూర్ ప్రదేశ్ కాంగ్రెస్ ఏర్పాటైంది. అప్పట్లో మైసూర్ స్టేట్‌గా పిలువబడే ఈ కన్నడ ప్రాంతం కృష్ణరాజ ఒడియార్-4 అనే సంస్థానాధీశుడి పాలనలో ఉండేది. వీరు బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా ఉండేవారు. 1938 ఏప్రిల్ రెండో వారంలో మాండ్యా జిల్లా శివపురలో మైసూరు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరిగాయి. 'ధ్వజ సత్యాగ్రహ' కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాల్లోనూ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని నేతలు నిర్ణయించారు. 1938, ఏప్రిల్ 9న సిద్ధలింగయ్య అనే నాయకుడు జాతీయ జెండాను ఎగురవేశారు. సిద్ధలింగయ్యతో పాటు పలు చోట్ల జెండా ఎగురవేసిన చాలామంది నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

హిందూపురం నుంచి బెంగళూరుకు వెళ్లే మార్గంలో ఈ విదురాశ్వత్థం ఉంది. ఇక్కడ కూడా జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రదేశ్ కాంగ్రెస్ నేతలు నిర్ణయించుకున్నారు. ఆనాటి కార్యక్రమానికి నాగయ్యరెడ్డి, తిమ్మారెడ్డి, టి.రామాచారి నాయకత్వం వహించారు. 'ధ్వజ సత్యాగ్రహ' కార్యక్రమాన్ని గురించి తెలుసుకుని కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని బ్రిటిష్ అధికారులు నిర్ణయించారు. 1938, ఏప్రిల్ 18 నుంచే ఈ ముందస్తు అరెస్టులు ప్రారంభమయ్యాయి. పోలీసుల చర్యలతో ఏప్రిల్ 22, 24 తేదీల్లో జెండాల ఎగురవేతను వాయిదా వేసినా, ఏప్రిల్ 25 నుంచి యథావిధిగా ఆ కార్యక్రమం కొనసాగింది. జెండాలను ఎగురవేసిన కల్లూరు సుబ్బారావు, నారాయణస్వామి, శ్రీనివాసరావు, సూరన్నలను పోలీసులు అరెస్టు చేశారు.



జలియన్‌వాలాబాగ్ దురంతానికి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇది అందరికీ తెలిసిందే. కానీ చరిత్రకెక్కని ఇలాంటి ఓ ఉదంతమే కర్ణాటక–ఆంధ్ర సరిహద్దుల్లోనూ జరిగింది. అప్పటి అనంతపురం, కోలారు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన 'విదురాశ్వత్థం' అనే గ్రామ సమీపంలో 1938 ఏప్రిల్ 25న ఈ ఉదంతం జరిగింది.

విదురాశ్వత్థం ఆలయ ఉత్సవాల్లో భాగంగా రథోత్సవంతో పాటు పశువుల సంత జరుగుతుండడంతో అప్పటికే వందలాదిగా జనాలు అక్కడ ఉన్నారు. కాంగ్రెస్ నాయకుల అరెస్టుతో జనం ఉద్వేగం చెంది, పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు రెచ్చిపోయారు. నాటి డిప్యూటీ డీఎస్పీ ఏ.ఎస్ ఖల్లి నేతృత్వంలో మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి ఐదున్నర గంటల వరకూ జనాలపై లాఠీచార్జి చేయడంతో పాటు, 96 రౌండ్లు కాల్పులు జరిపారు.


ఈ దురంతంలో సుమారు వందమంది చనిపోయి ఉంటారని అంచనా. కానీ కేవలం పదిమందిలోపే మరణించి ఉంటారని నాటి ఆ ప్రాంత సంస్థానాధీశుడు కృష్ణరాజ ఒడియార్ ప్రకటించారు. చనిపోయిన వారిలో ఇదుగురు భీమయ్య, చౌళూరు నరసప్ప, గజ్జన్నగారి నరసప్ప, హనుమంతప్ప, రాయకొండనహల్లి మల్లయ్య, నామా అశ్వత్థనారాయణ శెట్టి, నరసప్ప, మరులూరు గౌరమ్మ వంటి వారున్నారు. వారిలో గౌరమ్మ తొమ్మిది నెలల గర్భవతి! ఈ ప్రాంతానికి దగ్గర్లోని తెలుగు ప్రాంతమైన చౌళూరు నుంచి సూలగిత్తి సంజీవప్ప, సూలగిత్తి నరసప్ప, కారేడుపల్లి నాగమల్లారెడ్డి, కురుబ మల్లేశప్ప వంటి వారు ఈ కాల్పుల్లో నేలకొరిగారు. ఈ అమరవీరుల స్మారకంగా 1947 ఆగస్టు 15న చౌళూరు గ్రామ ప్రజలు స్మారక చిహ్నం నిర్మించుకున్నారు. నేటికీ ఈ స్మారక చిహ్నాలు చౌళూరు గ్రామంలో పదిలంగా ఉండటమే కాదు, స్ఫూర్తిని వెదజల్లుతున్నాయి. 2009లో ఆ అమరవీరుల వివరాలతో స్మారక మందిరమైన 'వీరసౌధ'ను గ్రామస్తులు నిర్మించుకున్నారు.

ఈ ఘటనలో ప్రాణాలర్పించిన వారి గురించి నాడు జాతీయ స్థాయిలో సంచలనమయ్యింది. ఈ ఘటనపై నివేదిక రూపొందించాలని సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆచార్య జే.బీ కృపలానీలను గాంధీజీ కోరారు. మైసూర్ సంస్థానానికి, సర్ మీర్జా ఇస్మాయిల్ దివాన్‌కు గాంధీజీ ఈ ఘటన గురించి ఉత్తరం రాశారు. తత్ఫలితంగా 1939 మేలో సర్దార్ పటేల్, సర్ మీర్జా ఇస్మాయిల్ మధ్య ఒక ఒడంబడిక జరిగింది. దాన్ని 'పటేల్‌- మీర్జా పాక్ట్' అంటారు. దీని ప్రకారం జెండా ఎగురవేయడంపై నిషేధాన్ని ఎత్తివేశారు. అలాగే వారి సంస్థానంలో కాంగ్రెస్‌ను రాజకీయ పార్టీగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిర్వహణలో సంస్కరణలను ప్రతిపాదిస్తూ ఏర్పాటు చేసిన కమిటీలో ఏడుగురు కాంగ్రెస్ పార్టీ సభ్యులు అంతర్భాగమయ్యారు. మహాత్మాగాంధీ 1939లో చిక్కబల్లాపూర్ సమీపంలోని నందికొండలలో విడిది చేసినప్పుడు ఈ విదురాశ్వత్థ ఘటన గురించి ప్రత్యేకంగా చర్చించారు. అలాగే 1939లో మైసూర్ ప్రదేశ్ కాంగ్రెస్ రెండో సమావేశం విదురాశ్వత్థంలోనే జరగడం విశేషం.

నిజానికి ఈ ఘటన గురించిన సమగ్ర సమాచారం అందుబాటులో లేదు. జనబాహుళ్యంలోకి రాకపోవడంతో ఇది మరుగున పడిపోయింది. కానీ స్థానికులు మాత్రం మృతి చెందినవారి జ్ఞాపకార్థం 1973 సంవత్సరంలో స్థానికంగా ఓ స్మారక స్థూపం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ దురంతానికి సంబంధించిన అంశాలు వెలుగులోకి రావడానికి గౌరీబిదనూరు నేషనల్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసిన బి. గంగాధరమూర్తి కృషి ఎంతో ఉంది. వీరే తొలిసారి ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి, 2011 డిసెంబర్‌లో 'కర్ణాటకద జలియన్ వాలాబాగ్ విదురాశ్వత్థ' పేరుతో ఓ పుస్తకాన్ని వెలువరించారు. ఈ రచన కన్నడ, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితమైంది.

• డా. నాగసూరి వేణుగోపాల్

నయాకశ్మీర్ పహల్గాంకు ఎలా చేరింది?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

జమ్మూకశ్మీర్‌లో సుదీర్ఘకాలంగా ఎడతెగని హింసాత్మక సంఘర్షణను వర్ణించే, వివరించే, వ్యాఖ్యానించే పదజాలంలో ఒక మాట మళ్లీ మళ్లీ ప్రస్తావితమవుతోంది. ఆ పునరావృత పదమే 'సాధారణ పరిస్థితి'. కశ్మీర్ లోయలో సాధారణ పరిస్థితి ఎలా పునరుద్ధరింపబడిందో రాజకీయవేత్తలు, పరిశీలకులు, పాత్రికేయులు విజయోత్సాహంతో తరచు మాట్లాడుతుండడం కద్దు. వాస్తవమేమిటి? మూడున్నర దశాబ్దాలుగా కశ్మీర్‌లో పరిస్థితులు సాధారణ స్థాయిలో ఉన్నాయని చెప్పేందుకు వీలులేని భిన్న రీతిలోనే ఉంటూ వస్తున్నాయి. ఇదొక కఠోర సత్యం. హింసారిరంసతో రక్త మోడుతున్న కశ్మీర్ లోయలో పరిస్థితులు చక్కపడతాయనే ఆశాకుసుమాలు వికసించిన ప్రతిసారీ ఉగ్రభూతాలు వాటిని ఛిద్రం చేసేస్తున్నాయి. ఉగ్రవాద కాఠిన్యానికి పహల్గాంలో నిన్నగాక మొన్న కనీసం 28 మంది పర్యాటకులు హతమారిపోవడం ఆ విషాద, వికృత సత్యాన్నే మరొకసారి గుర్తుచేస్తూ జాతిని కలచివేస్తోంది. ప్రాణాంతకమైన ఒక విపత్కర పరిస్థితిలో కశ్మీర్ చిక్కుకున్నది.

ఆగస్టు 2019లో జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370ని రద్దు చేసిన అనంతరం ఒక కొత్త కశ్మీర్ (నయా కశ్మీర్) విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన దార్శనికతను ఎలా ఆవిష్కరించారో గుర్తుచేసుకోండి. కశ్మీర్‌లో మామూలు పరిస్థితులను పునరుద్ధరించే దిశలో అదొక ప్రధాన ముందడుగు అని మోదీ పేర్కొన్నారు. త్వరలోనే పెట్టుబడుల వెల్లువను కశ్మీర్ చూడనున్నదని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. సత్వరమే మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరుస్తామని వాగ్దానం చేశారు. బాలీవుడ్ సినిమా మాంత్రికులు నీలాల నింగిని చుంబించే హిమవత్పర్వతాలు, కన్నుల పండువైన పచ్చిక మైదానాలకు తిరిగి వస్తారని నరేంద్ర మోదీ ఉత్సాహంగా చెప్పారు. ఇదొక 'కొత్త సాధారణ'మని, జమ్మూ కశ్మీర్ శీఘ్రగతిన 'న్యూ ఇండియా' ప్రధాన స్రవంతిలో కలిసిపోతుందని మోదీ నిశ్చిత స్వరంతో చెప్పారు.

ప్రధానమంత్రి హామీ ఇచ్చిన 'సాధారణ పరిస్థితి' పైకి కనిపించే దృశ్యం. కొత్త రహదారులు, హైవేలు, కొండలు తొలిచి నిర్మించిన సొరంగాలు పెనుమార్పులకు ప్రతీకలే, సందేహం లేదు. ఇప్పుడు శ్రీనగర్ నుంచి అనంతనాగ్ లేదా బారాముల్లాకు వాయువేగంతో వెళ్లవచ్చు. ఈ ప్రయాణ సౌఖ్యం కొద్ది సంవత్సరాల క్రితం అయితే కలలో కూడా ఊహించలేని విషయం మరి. అయితే 'సాధారణ పరిస్థితి' అనేది భౌతిక వసతులకు మాత్రమే పరిమితమైనది కాదు. అది, అంతిమంగా ప్రజల మనస్సును, హృదయాన్ని గెలుచుకోవడమే అని చెప్పి తీరాలి. అయితే ఇది జరగలేదు. కనుకనే కశ్మీరీలలో చాలా కాలంగా ఉన్న మనోక్లేశాలు, హృదయావేదనలు సమసిపోవడం లేదు. ఎలా సమసిపోతాయి?

భారత్‌లో ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న ఏకైక రాష్ట్రమైన జమ్మూ-కశ్మీర్‌ను రాత్రికి రాత్రి శాసన విహిత పర్మానాతో విభజించి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించి వేసినప్పుడు అక్కడ 'సాధారణ పరిస్థితి' ఎలా ఉంటుంది? ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను అదుపులోకి తీసుకుని గృహ నిర్బంధంలో ఉంచినప్పుడు అది 'సాధారణ'మెలా అవుతుంది? వేలాది కశ్మీరీలను క్రూర చట్టాల కింద అరెస్ట్ చేసి జైళ్లలో కుక్కివేసినప్పుడు కశ్మీర్‌లో 'సాధారణ పరిస్థితి' ఎలా మొలకలేస్తుంది? నెలల తరబడి పాఠశాలలను మూసివేసినప్పుడు, ఇంటర్నెట్ షట్‌డౌన్ నిత్య వ్యవహారమైనప్పుడు 'సాధారణ పరిస్థితి' ఎలా నెలకొంటుంది? కశ్మీర్ లోయలో అడుగడుగునా వేలాది సైనికులను మోహరించినప్పుడు భారత ప్రభుత్వ వాగ్దానాలను కశ్మీరీలు ఎలా విశ్వసిస్తారు? ఆ అందమైన లోయకు 'సాధారణ' జీవన సౌందర్యం మళ్లీ ఎలా సమకూరుతుంది? భయభీతులను వ్యాపింపచేసేందుకు, హింసాకాండను రగిలించేందుకు కశ్మీరీ యువకులకు ఆయుధాలు, శిక్షణ ఇవ్వడాన్ని పాకిస్థానీ దుష్ట రాజ్య వ్యవస్థ కొనసాగిస్తున్నప్పుడు 'సాధారణ పరిస్థితుల' దిశగా కశ్మీర్ ఎలా పురోగమిస్తుంది?

గత ఏడాది తొలుత లోక్‌సభకు, ఆ తరువాత విధానసభకు జరిగిన ఎన్నికలలో అంతకు ముందు ఎన్నడూ లేని రీతిలో అత్యధిక ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నారు. కశ్మీర్‌లో నెలకొన్న సాధారణ పరిస్థితులను ఈ పరిణామాలు ప్రతిబింబించడం లేదా అని హిమాలయ శిఖరాల నెక్కి కన్యాకుమారిలోని వారికి కూడా వినపడేలా ప్రశ్నించారు. ఏ కశ్మీరీ వేర్పాటువాద పార్టీ కూడా ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునివ్వలేదు. ఓటు వేయవద్దని ఓటర్లను ఒత్తిడి చేయలేదు. వేర్పాటువాద పార్టీల సమష్టి వేదిక అయిన హురియత్ కాన్ఫరెన్స్ సర్వశక్తిమంతమైన భారత రాజ్య యంత్రాంగం పుణ్యమా అని కకావికలైపోయింది. జమ్ము-కశ్మీర్‌కు ఒమర్ అబ్దుల్లా ప్రజాస్వామ్యబద్ధంగా 'ఎన్నికైన' ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పార్టీ పూర్తి మెజారిటీని సాధించుకున్నది. అయితే ముఖ్యమంత్రికి ఎలాంటి అధికారాలు, కనీసం కీలక అధికారులను నియమించేందుకు, బదిలీ చేసేందుకు సైతం అధికారాలు లేనప్పుడు అది 'సాధారణ' ప్రజాస్వామ్య పాలన ఎలా అవుతుంది? కశ్మీర్‌తో ఎటువంటి సంబంధమూ లేని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని లెఫ్టినెంట్ గవర్నర్‌కు శాంతిభద్రతల సంరక్షణతో సహా సమస్త అధికారాలను కట్టబెట్టడం 'సాధారణ పరిస్థితి' పునరుద్ధరణకు ఎలా దోహదం చేస్తుంది? ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన తమ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరుగుతుందనే ఆశాభావంతోనే జమ్ము-కశ్మీర్ ప్రజలు సంఖ్యానేకంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్నారు. కేంద్రం తన హామీని నెరవేర్చలేదు. కశ్మీరీల ఆశలు వమ్మయ్యాయి.

'సాధారణ పరిస్థితులు' నెలకొన్నాయనే విషయమై కేంద్ర ప్రభుత్వ కథనాలు, కోవిడ్ అనంతరం పర్యాటక రంగం పుంజుకోవడంలో భాగంగా కశ్మీర్ లోయకు పర్యాటకులు వెల్లువెత్తడాన్ని కూడా ప్రస్తావిస్తున్నాయి. శ్రీనగర్ ఉద్యానవనాలలో ట్యులిప్ పువ్వులు శోభాయమానంగా వికసిస్తున్నాయి. దాల్ సరస్సులో యాత్రికులు విహరిస్తున్నారు. పహల్గాంలో ట్రెక్కింగ్, గుల్మార్గ్‌లో స్కీయింగ్ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. పర్యాటక-స్నేహపూరిత గమ్యంగా జమ్ము కశ్మీర్‌ను ప్రమోట్ చేసేందుకు కేంద్రం మే 2023లో శ్రీనగర్‌లో ఒక జీ20 పర్యాటక సదస్సును నిర్వహించింది.

అయితే పర్యాటక రంగం పుంజుకోవడమే సాధారణ పరిస్థితి'కి ఎంతమాత్రం చిహ్నం కాదు. ప్రజలు భయరహితంగా సంచరించడం, ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా సమసిపోవడం, ఉగ్రవాదులు తమ ఇష్టానుసారం దాడి చేయలేని అశక్తతలో పడడమే సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు నిదర్శనమవుతుంది. ఉగ్రవాద దాడులలో చనిపోయిన పౌరుల సంఖ్య ఇటీవలి సంవత్సరాలలో బాగా తగ్గిపోయిందని కేంద్రం చెప్పడం సమర్థనీయమే. అయితే ఉగ్రవాద మిలిటెంట్లు, సాయుధ బలగాల మధ్య ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయన్న నిష్ఠుర సత్యాన్ని ఆ అంకెలు మరుగుపరుస్తున్నాయి.

'సాధారణ పరిస్థితులే' ఉంటే ఉగ్రవాదులు లక్షిత దాడులకు ఎలా పాల్పడుతున్నారు? అక్టోబర్‌లో శ్రీనగర్‌లో ఒక ప్రముఖ కెమిస్ట్, ఒక ఆహార విక్రేత, ఒక టాక్సీ డ్రైవర్‌ను ఒక గంట వ్యవధిలోనే ఉగ్రవాదులు కాల్చివేసిన వైనాన్ని గుర్తుచేసుకోండి. హతుడైన కెమిస్ట్ మఖన్ లాల్ బింద్రూ ఒక కశ్మీరీ పండిట్. 1990ల్లో లోయ నుంచి పండిట్‌లు పెద్ద సంఖ్యలో వేరే రాష్ట్రాలకు శరణార్థులుగా వెళ్లిపోయినప్పటికీ మఖన్‌లాల్ తన స్వస్థలంలోనే ఉండిపోయారు. కశ్మీరీ హిందూ కుటుంబాలు ఇప్పటికీ తమ పూర్వీకుల గృహాలకు తిరిగి రాలేకపోవడం 'సాధారణ' పరిస్థితులకు ఎలా అద్దం పడుతుంది? అమర్‌నాథ్ యాత్ర ఇప్పటికీ ఉగ్రవాద దాడుల భీతిలోనే జరుగుతుండడం సాధారణ పరిస్థితుల పునరుద్ధరణను ఎలా సూచిస్తుంది?

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఇస్లామిక్ ఉగ్రవాదులు తమ ప్రభావ ప్రాబల్యాలను కశ్మీర్ లోయలో మరింతగా విస్తరించుకుంటున్నప్పుడు అదెలా 'సాధారణ'మవుతుంది? లష్కరే మిలిటెంట్లకు పాకిస్థాన్ అన్ని విధాల ఆశ్రయమివ్వడం కొనసాగుతున్నప్పుడు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరుస్తూ కశ్మీర్‌ను పాక్ కంఠ రక్తనాళంగా అభివర్ణిస్తున్నప్పుడు లోయలో సాధారణ పరిస్థితులు నెలకొనడం ఎలా సాధ్యమవుతుంది? ఇటీవలి సంవత్సరాలలో పాకిస్థానీ 'విదేశీ' ఉగ్రవాదులు, స్థానిక కశ్మీరీలతో కలిసి హింసాత్మక దాడులకు పాల్పడడం ప్రబలిపోయింది. ఉపాధి, ఉద్యోగాలు లేని యువకులు ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొంటూ ఉపశమనం పొందడం ఎలా 'సాధారణ'మవుతుంది?

నిజమేమిటంటే సీమాంతర ఉగ్రవాదాన్ని తుదముట్టించడంలో వెనకటి ప్రభుత్వాలు విఫలమైనట్టే మోదీ సర్కార్ సైతం ఆ భయానక బెడదను నిర్మూలించలేకపోయింది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు, కశ్మీర్‌లో హింసాత్మక సంఘర్షణలకు పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతు కొనసాగుతుందని పఠాన్‌కోట్ నుంచి పహల్గాం దాకా సంభవించిన ఉగ్ర బీభత్సాలు రుజువు చేస్తున్నాయి. పాకిస్థాన్ రాజ్య వ్యవస్థ 'ఇస్లామీకరణ' మాత్రమే కాకుండా మన సమాజంలో తీవ్రమవుతున్న మతపరమైన విభజనలు కూడా ఆ హింసాత్మక విధ్వంసాన్ని పురిగొల్పుతున్నాయి. రాజకీయ పక్షాలు, వాటి మద్దతుదారులు విద్వేషం, మత సంకుచితత్వాన్ని నిత్య వాస్తవాలుగా చేస్తున్నప్పుడు కశ్మీర్‌లో పరిస్థితులు 'సాధారణస్థితి'లో ఎలా ఉంటాయి? హిందూ-ముస్లిం విబేధాలు మరింతగా పెరిగిపోయేందుకు దుష్ట పాకిస్థానీ సైనిక- రాజ్య వ్యవస్థ పహల్గాం ఉగ్రవాద ఘటనను ఉపయోగించుకుంటుంది. అటువంటి దుష్ట పన్నాగాలను మనం ముందస్తుగా ఎదుర్కోవాలి. పాకిస్థాన్ తన పైశాచిక చర్యలకు భారీ మూల్యం చెల్లించి తీరాలి. అవధులు లేని ఆగ్రహంలోను, అంతులేని ఆవేదనలోను మనం ఐక్యంగా ఉండాలి.

> సీమాంతర ఉగ్రవాదాన్ని తుదముట్టించడంలో వెనకటి ప్రభుత్వాలు విఫలమైనట్టే మోదీ సర్కార్ సైతం ఆ భయానక బెడదను నిర్మూలించలేకపోయింది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు, కశ్మీర్‌లో హింసాత్మక సంఘర్షణలకు పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతు కొనసాగుతుందని పఠాన్‌కోట్ నుంచి పహల్గాం దాకా సంభవించిన ఉగ్ర బీభత్సాలు రుజువు చేస్తున్నాయి. పాకిస్థాన్ రాజ్యవ్యవస్థ 'ఇస్లామీకరణ' మాత్రమే కాకుండా మన సమాజంలో తీవ్రమవుతున్న మతపరమైన విభజనలు కూడా ఆ హింసాత్మక విధ్వంసాన్ని పురిగొల్పుతున్నాయి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కలచివేసిన కశ్మీర్ మారణకాండ

ఇటీవల కాలంలో ప్రశాంతంగా ఉండి పర్యాటకులను ఆకర్షిస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తున్న కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు జరిపిన మారణకాండ మానవతావాదుల్ని కలచివేసింది. అమాయకులను చుట్టుముట్టి వారి మతాన్ని అడిగి మరీ ముస్లిమేతరులను దారుణంగా చంపడం ఎంత మాత్రం క్షమార్హం కాదు. ఈ ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాద సంస్థలు, వాటికి వెన్నుదన్నుగా ఉండి ప్రోత్సహిస్తున్న వ్యక్తులు, సంస్థలు ఏవైనా కావచ్చు, వాటిని తుదముట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమయంలో కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా దేశవ్యాప్తంగా ఉన్న భారతీయులందరూ ఇలాంటి దుశ్చర్యలను ఎదుర్కోవడంలో ఐక్యంగా ఏకతాటిపై ఉండాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ఇలాంటి ముష్కర చర్యలను ఆసరాగా తీసుకుని ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడానికి, అమాయకులను బలితీసుకోవడానికి, దేశంలో అశాంతి, అలజడులను రేకెత్తించి, దేశ సమగ్రతను విధ్వంసం చేయడానికి ప్రయత్నించే వారి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

– సయ్యద్ జుల్ఫికర్ అలీ
కలువాయి, నెల్లూరు జిల్లా

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

శత వసంతాల ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఆంధ్రుల ఆత్మాభిమాన పోరాటం నుంచి పుట్టుకొచ్చిన ఆంధ్ర విశ్వకళాపరిషత్ (ఆంధ్ర విశ్వవిద్యాలయం) నేడు ప్రపంచమంతా విస్తరించింది. దేశీయ విద్యార్థులే కాదు ఇప్పుడు ఖండాంతర విద్యార్థులు, పరిశోధకులతో కళకళలాడుతోంది. సుమారు పాతికవేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఈ వందేళ్లలో కొన్ని లక్షల మంది విద్యార్థులు డిగ్రీలు పొందారు. ఇప్పుడు వేలల్లో విదేశీ విద్యార్థులు వివిధ కోర్సుల్లో, పరిశోధనల్లో ప్రవేశిస్తున్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రపంచవ్యాప్తంగా దృష్టి సారించే విద్యను అందిస్తోంది ఈ విశ్వవిద్యాలయం. భాషలు, సామాజిక శాస్త్రాలు, సైన్సు, టెక్నాలజీ, న్యాయశాస్త్రం, ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర శాస్త్రాలకు నిలయంగా మారింది. ప్రపంచ స్థాయి నిపుణుల కర్మాగారమే ఏర్పాటు జరిగింది ఇక్కడ. కోట్లాది రూపాయల ఖర్చుతో అంచెలంచెలుగా సరికొత్త భవన సముదాయాల్ని నిర్మించుకుంది. దాతలిచ్చిన భూముల్ని అధికారులు భద్రంగా కాపాడుతున్నారు.

విద్యార్థులు, పరిశోధకుల నుంచి వివిధ శ్రేణుల ఆచార్యులు, అధికారులు, పూర్వ విద్యార్థుల వరకు గర్వించే సందర్భం నేటి శతాబ్ది ఉత్సవాలు. దీని వ్యవస్థాపనకు నాటి స్వాతంత్ర్య సమర యోధుల పోరాటం దాగి ఉంది. జాతీయ కాంగ్రెస్, ఆంధ్ర మహాసభ, జస్టిస్ పార్టీ, భాషాప్రాతిపదిక రాష్ట్రాల భావజాలం ప్రధాన భూమిక వహించాయి. బాపట్ల తొలి ఆంధ్రమహాసభలో భాషా ప్రాతిపదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌తో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపన తెరమీదకు వచ్చింది. దీనికి సంబంధించిన సమావేశంలో కొండా వెంకటప్పయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, పింగళి వెంకయ్య పాల్గొన్నారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో తమిళుల ఆధిపత్యంతో ఆంధ్రుల ప్రవేశాలకు అడ్డంకులు ఏర్పడేవి. 1917లో మద్రాస్ శాసనసభలో బి. వెంకటపతిరాజు, ఎమ్. నారాయణ ఆంధ్రుల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం కావాలని నినదించారు. ఇదే సమయంలో అన్నెపు పరశురామ్ పాత్రో తన సహకారాన్ని అందించారు. 1925 ఆగస్టు 20న ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. దీని ద్వారా 1926 ఏప్రిల్ 26న విజయవాడలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు జరిగింది. ఛాన్సలర్‌గా లార్డ్ గోస్చెన్, వైస్ ఛాన్సలర్‌గా సర్ కట్టమంచి రామలింగారెడ్డి నియమితులయ్యారు. ఈ క్రమంలో ఆంధ్రానాయకులు రాయలసీమవాదుల నుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి డా. సుబ్బరాయన్ మొదటిగా రాజమండ్రి సూచించినప్పటికీ, తర్వాత విశాఖకే ఆయన మద్దతును ప్రకటించారు. దీని పరిధి నుంచి రాయలసీమను మినహాయించడానికి మునిస్వామినాయుడు తీర్మానం చేయగా, శాసనసభ ఆమోదించింది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడే వరకు మద్రాస్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం కొనసాగింది. తర్వాత ఇది రాష్ట్ర విశ్వవిద్యాలయంగా మారింది. ఇందుకు పుచ్చలపల్లి సుందరయ్య కృషి ఎంతో ఉంది. మామిడిపూడి రంగయ్య తొలి ప్రిన్సిపాల్‌గా ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలు సంయుక్తంగా ఏర్పడ్డాయి. 1945లో ఏర్పడ్డ న్యాయ కళాశాల వెనుక ఆసక్తికర కథనం ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం అత్యవసర పరిస్థితుల్లో విశ్వవిద్యాలయాన్ని గుంటూరుకి మార్చారు. అదే సమయంలో ఈ కళాశాల మచిలీపట్నంలోని జానకిరామ్ నాయుడు భవనంలో మొదలైంది. కె.వి. గోపాలస్వామి తాత్కాలిక 'ప్రొఫెసర్-ఇన్-చార్జ్'గా పనిచేశారు. 1949 జూలైలో విశాఖపట్నంకు తిరిగి వచ్చింది. 1946లో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలికంగా కాకినాడలో నడిచింది. దీనినే కాకినాడలోనే శాశ్వతంగా ఉంచేశారు. అదే ఇప్పటి జెఎన్‌టియు(కె). తిరిగి 1955లో కొత్తగా ఏయూ ఇంజనీరింగ్ విభాగాన్ని విశాఖపట్నంలో ప్రారంభించారు. ఇదే తర్వాత కళాశాలగా మారింది. 1972లో స్కూల్ ఆఫ్ కరస్పాండెన్స్ కోర్సు మొదలయింది.

> సమాజంలోని అన్ని వర్గాలకు ప్రపంచవ్యాప్తంగా దృష్టిసారించే విద్యను అందిస్తోంది ఆంధ్ర విశ్వవిద్యాలయం. దీని వ్యవస్థాపనకు నాటి స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం దాగి ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి చేరడానికి వెనుక మేధో శిఖరాలు అయిన ఎందరో ఉపకులపతులు, దాతలు, పూర్వ విద్యార్థుల కృషి ఉంది.



ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి చేరడానికి వెనుక ఎందరో మేధో ఉపకులపతులు, దాతలు, పూర్వ విద్యార్థుల కృషి ఉంది. వీరిలో సి.ఆర్. రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ వివిఎస్ కృష్ణ, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య, డాక్టర్ ఎం.ఆర్. అప్పారావు, ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు, ప్రొఫెసర్ కె.వి. రమణ, డాక్టర్ ఎం. గోపాలకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ వైసి. సింహాద్రి, ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాలరెడ్డి మొదలయిన ఉపకులపతులు విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. నాడు సర్ సి.వి. రామన్, సర్ రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి గొప్ప శాస్త్ర, సాహితీవేత్తలను ఆంధ్ర విశ్వవిద్యాలయం చట్రంలోకి తీసుకువచ్చిన ఉపకులపతులు సి.ఆర్.రెడ్డి, ఎస్.రాధాకృష్ణన్‌లే. వీరే వర్శిటీకి బలమైన పునాదులు వేశారు. 1931లో పద్మభూషణ్

అంతర్జాతీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తులతో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశిష్ట పూర్వవిద్యార్థుల చరిత్ర కలిగి ఉంది. భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి. బాలయోగి, కేంద్ర మాజీ మంత్రులు ఎం. పళ్ళంరాజు, కె. ఎర్రన్నాయుడు, భారత రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు విజేత ప్రొఫెసర్ బి.ఆర్. రావు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. రామస్వామి, జస్టిస్ జె.చలమేశ్వర్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రోహిణి, ఛాన్సలర్లు, వైస్-ఛాన్సలర్లు వంటి వారెందరో ఇక్కడ విద్యను అభ్యసించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం చిహ్నాన్ని డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి తయారు చేయించారు. కౌత రామమోహన శాస్త్రి రూపొందించిన ఈ చిహ్నంలో 'తేజస్వినావధీతమస్తు' అనే ఉపనిషత్తు ఆదర్శం ఉంది. ఉదయించే సూర్యుడు, ఆర్యుల స్వస్తిక్, నాగుల చరిత మొదలయినవి వాటి ప్రత్యేకతలను చాటుతున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రదానం చేసే 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేటుకు మరింత ప్రత్యేకత ఉంది. దేశంలో వివిధ రంగాల్లో, కళల్లో, శాస్త్రాల్లో కృషి చేసిన వ్యక్తులను సత్కరిస్తుంది. దీనిని 1927లో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు తొలిసారిగా ప్రదానం చేశారు. తర్వాత ఈ గౌరవ డాక్టరేట్‌లు పొందినవారిలో అల్లాడి కుప్పుస్వామి అయ్యర్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, 1938లో కాశీనాథుని నాగేశ్వరరావు, గిడుగు రామ్మూర్తి పంతులు వంటి ప్రముఖులతో పాటు 2009లో ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం కూడా ఉన్నారు. ప్రపంచం ఏ మూల నుంచి చూసినా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒక సుందర స్వప్నమే. విద్యార్థి, పరిశోధకుడు, శాస్త్రవేత్త ఎవరినైనా ఆంధ్ర విశ్వవిద్యాలయం తన విశాల దృశ్యంతో ఆకర్షిస్తుంది. తన వందేళ్ళ అంతరంగాన్ని ఆవిష్కరించనుంది.

■ డాక్టర్ జీకేడీ ప్రసాదరావు
ఆంధ్ర విశ్వవిద్యాలయం

(ఏప్రిల్ 26: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం)



ప్రధాని సభకు 1.20 లక్షల మంది!

మే 2న రాజధాని పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి రాక
- ప్రధాని మోదీ రోడ్డు షోకు హాజరుకానున్న 30 వేల మంది
- సభ ప్రాంగణంలోని గ్యాలరీలకు తరలిరానున్న మరో 90 వేల మంది

2400 బస్సుల్లో ఏడు రూట్లలో సభ వద్దకు చేరనున్న ప్రజలు

విజయవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి 1.20 లక్షల మంది రానున్నట్లు సమాచారం. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వీరు తరలివస్తున్నట్లు తెలిసింది. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 30 వేల మంది చొప్పున, కృష్ణా, బాపట్ల, ఏలూరు జిల్లాల నుంచి 10 వేల మంది చొప్పున వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన సభా ప్రాంగణం 28 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ప్రధాన వేదికలు పోను గ్యాలరీలను 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సభలో సీటింగ్ 50 వేల వరకు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే వారు, వెళ్లే వారు ఉంటారు కాబట్టి మొత్తంగా 1.20 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. వీరిలో 30 వేల మంది ప్రధాని రోడ్డు షోకు వెళ్తారని మిగతా 6లో..

పెద్ద ఎత్తున బస్ సర్వీసులు

రాజధాని సభకు వచ్చే వారికి ప్రభుత్వం 2,400 బస్సులను ఏర్పాటు చేయనుంది. గుంటూరు నుంచి 600 బస్సులు, ఎన్టీఆర్ జిల్లా నుంచి 600 బస్సులు, పల్నాడు జిల్లా నుంచి 600 బస్సులు, కృష్ణాజిల్లా నుంచి 200 బస్సులు, బాపట్ల జిల్లా నుంచి 200 బస్సులు, ఏలూరు జిల్లా నుంచి 200 బస్సుల్లో ప్రజలు సభా ప్రాంగణానికి తరలిరానున్నారు.

పీఎం రోడ్డు షోకు భారీగా ఏర్పాట్లు

ప్రధాని నరేంద్ర మోదీ దిగే హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు 15 నిమిషాల పాటు జరిగే రోడ్డు షోకు మొత్తం 30 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 5 వేలు, కృష్ణాజిల్లా నుంచి 10 వేలు, బాపట్ల జిల్లా నుంచి 10 వేలు, ఏలూరు జిల్లా నుంచి 5 వేల మంది తరలివస్తారని ఆయా జిల్లా యంత్రాంగాలు అంచనా వేస్తున్నాయి.

బెజవాడలో.. ఉగ్ర కదలికలు!

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగిన వారు విజయవాడలో ఉంటున్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు తెలుస్తోంది. ప్రస్తుతం పది మంది అనుమానితులను నిఘా వర్గాలు గుర్తించినట్టు సమాచారం. వారి కార్యకలాపాలపై నిరంతర నిఘాను కొనసాగిస్తున్నట్టు తెలిసింది.

సిమితో సంబంధాలపై కేంద్ర నిఘా వర్గాల సమాచారంతో పరిశీలన

10 మంది అనుమానితుల గుర్తింపు.. వారి కదలికలపై నిఘా

- విజయవాడలో నలుగురు.. శివారు ప్రాంతాల్లో మరో ఆరుగురు
- ఏసీ మెకానిక్‌లు, మసీదుల దగ్గర భిక్షాటన, బడ్డీకొట్లలో పనులు
- ఒకప్పుడు నక్సల్స్, తర్వాత మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా బెజవాడ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నారన్న అనుమానంతో బెజవాడలో నిఘా వర్గాలు జల్లెడ పట్టి కేంద్ర నిఘా సంస్థలకు నివేదిక ఇవ్వటం సంచలనం సృష్టిస్తోంది. సరిగ్గా రెండు నెలల కిందటే ఢిల్లీలోని నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారం విజయవాడ పోలీసులను అప్రమత్తం చేసింది. సిమి సంస్థతో సంబంధాలు కలిగిన వారు విజయవాడలో షెల్టర్ ఏర్పాటు చేసుకుని ఉంటున్నారని కేంద్ర నిఘా వర్గాలు సమాచారాన్ని అందించినట్టు తెలిసింది. సిమీ సంస్థతో సంబంధాలు కలిగిన వారుగా అనుమానిస్తున్న వారి కదలికలపై స్థానిక నిఘా వర్గాలు దృష్టి సారించాయి. దాదాపుగా నెల రోజుల పరిశీలన అనంతరం విజయవాడ నగరంలో నలుగురు, నగర శివారు ప్రాంతాలలో మరో ఆరుగురిని అనుమానితులుగా గుర్తించినట్టు తెలుస్తోంది. ఈ పది మందికి సంబంధించిన సమాచారాన్ని విజయవాడ నిఘా వర్గాలు కేంద్ర నిఘా సంస్థలకు అందించాయి. నెల రోజుల కిందటే ఈ సమాచారాన్ని ఇచ్చాయి. ఈ ప్రక్రియ అంతా కూడా అత్యంత రహస్యంగా జరగటం విశేషం. అయితే గుర్తించిన అనుమానితులను సిమీ ఉగ్రవాదులేనని ఇతిమిద్ధంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతానికి వీరంతా అనుమానితులుగానే ఉన్నారు. వీరి కదలికలపై అయితే నిరంతరాయంగా నిఘా కొనసాగుతోంది.

కొనసాగుతున్న ఇస్లామిక్ ధార్మిక సంస్థల కార్యకలాపాలు

విజయవాడ నగరంలో ఇస్లామిక్ ధార్మిక సంస్థల కార్యకలాపాలు నాటి నుంచి నేటి వరకు కొనసాగుతున్నాయి. అవన్నీ కూడా పూర్తిగా ధార్మిక, సేవా కార్యక్రమాలకే తప్ప ఉగ్రవాద కార్యకలాపాలను ప్రేరేపించినట్టు కానీ, నిర్వహిస్తున్నట్టు కానీ ఏనాడు జరగలేదు. అంజుమన్ ఏ ఇస్లామియా, జమాత్ ఏ ఇస్లామియా వంటి సంస్థలు విజయవాడ నగరంలో సేవా, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా

కేంద్ర నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో స్థానిక నిఘా వర్గాల పరిశీలనలో నగరంలోని పంజా సెంటర్, లబ్బీపేట, అశోక్‌నగర్‌లలో అనుమానాస్పద వ్యక్తులు ఉన్నట్టు తెలుస్తోంది. గొల్లపూడిలో కూడా కొందరు అనుమానిత వ్యక్తులు ఉన్నారని సమాచారం. విజయవాడ నగరంలో నలుగురు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించారు. మిగిలిన ఆరుగురిలో గొల్లపూడిలో ఇద్దరు, పేరు బయటకు రాని శివారు ప్రాంతాలలో మరో నలుగురు ఉంటున్నారని తెలుస్తోంది. అనుమానితుల గురించిన సమాచారం కూడా ఆసక్తిని కలిగిస్తోంది. ఒక్కొక్కరూ ఒక్కో వృత్తి చేస్తున్నారు. ఒకరిద్దరు మసీదుల దగ్గర భిక్షాటన చేస్తుండగా.. ఇద్దరు ఏసీ మెకానిక్‌లుగా పనిచేస్తున్నారని తెలుస్తోంది. మసీదుల దగ్గర బడ్డీకొట్లలో కూడా ఉంటున్నారని సమాచారం. వీరి కదలికలపై ఇప్పటికీ నిఘా కొనసాగుతూనే ఉంది. స్థానిక నిఘా వర్గాలు ఇప్పటికీ వీరి కదలికలపై నిఘా వేశాయి. విజయవాడ నగరం షెల్టర్ జోన్‌గా ఉందన్నది కేంద్ర నిఘా సంస్థలు అభిప్రాయపడుతున్నట్టు తెలుస్తోంది. అనుమానితులుగా గుర్తించిన పది మందిపైనా గత నెల రోజులుగా నిఘా కొనసాగుతూనే ఉంది.

ఒకప్పుడు మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా..

విజయవాడ నగరం పూర్వం నుంచి నక్సల్స్ ఆ తర్వాత మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉందనేది నిఘా వర్గాల సమాచారం. పూర్వం నుంచి చూస్తే నాటి పాతతరం నాయకుల నుంచి నేటి తరం నాయకుల వరకు కూడా విజయవాడతో రాకపోకలు ఉన్నా కూడా హింసాత్మక ఘటనలు మాత్రం మొదటి నుంచి ఇక్కడ జరగలేదు. విజయవాడతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఒకప్పటి పీపుల్స్ వార్ గ్రూప్ నేత కొండపల్లి సీతారామయ్య కదలికలు ఉన్నాయి. ఆయనకు ప్రతి గ్రామంలోనూ సానుభూతిపరులు ఉండేవారు. అనేక గ్రామాలలో ఆయన పర్యటించారు. విజయవాడ నగరంలో చెప్పుకోదగ్గ సంఘటనలు చూస్తే 2006లో నక్సల్స్‌కు అత్యాధునిక రాకెట్ లాంచర్స్ వంటి ఆయుధాలు సమకూర్చుకునే శక్తి వచ్చిందన్నది వెలుగు చూసింది. విజయవాడకు ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వెహికల్‌లో పెద్ద ఎత్తున రాకెట్ లాంచర్ల విడిభాగాలు వచ్చాయి. విడి భాగాలు రవాణా కావటంతో ఆ సంస్థకు అనుమానం రాలేదు. వచ్చిన సరుకును తీసుకువెళ్లే విషయంలో జాప్యం జరిగింది. ఆర్డర్ ఎవరు తీసుకుంటారన్నది తెలియకపోవటంతో అలాగే ఉంచేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు పోలీసులకు సమాచారం రావటం, పరిశీలిస్తే వందలాది సంఖ్యలో రాకెట్ లాంచర్ల విడిభాగాలను గుర్తించారు. ఇది అప్పట్లో పెనుసంచలనం మిగతా 6లో..

దయనీయం

జిల్లాలో ధాన్యం దిగుబడి 1.60 లక్షల టన్నులు

- 50 వేల టన్నుల కొనుగోలుకే అధికారుల అనుమతి
- మిగిలిన ధాన్యం ఏం చేయాలో దిక్కుతోచనిస్థితి
- ఇదే అదనుగా తక్కువ ధరకు తన్నుకుపోతున్న మిల్లర్లు, దళారులు

ధాన్యం కొనుగోళ్లలో పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారింది. దిగుబడుల ఆధారంగా కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఆ శాఖ అనాలోచిత నిర్ణయాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. జిల్లాలో 1.60 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు రాగా, కేవలం యాభై వేల టన్నుల కొనుగోలుకు అనుమతినివ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పండిన పంట నిల్వ చేసుకొనే అవకాశం లేక అన్నదాతలు ధాన్యాన్ని అతి తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పెట్టుబడులు కూడా రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. దయనీయమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.





కొనుగోళ్లు నిలిచిపోవడంతో పొలాలలోనే నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు (ఇన్‌సెట్‌లో) కల్లాలలో ధాన్యం ఆరబోస్తున్న అన్నదాతలు

(ఆంధ్రజ్యోతి, నందిగామ): ఖరీఫ్ సాగు సమయంలో భారీ వర్షాలు, వరదలతో ఎన్టీఆర్ జిల్లా మొత్తం వరి పంట దెబ్బతింది. పెట్టుబడులు కూడా తుడిచిపెట్టుకుపోయాయి. తిండి గింజల కోసం తిరిగి సాగు చేపట్టిన రైతులు భారీ పెట్టుబడులు పెట్టి అరకొర పంటను తెచ్చుకోగలిగారు. తీవ్ర నష్టాల పాలైనా సాగుపై ఆశ చావక అన్నదాతలు 50,464 ఎకరాల్లో రబీ సాగు చేపట్టారు. ఖరీఫ్‌లో దెబ్బతిన్న రైతులకు రబీ ధాన్యపు రాసులందించింది. దిగుబడులు భారీగా వచ్చాయి. కొన్ని చోట్ల ఎకరాలకు యాభై నుంచి అరవై బస్తాల వరకూ గణనీయమైన దిగుబడి వచ్చింది. నేడు జిల్లాలో రైతుల వద్ద 1.60 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరిస్తున్నారు. భారీ దిగుబడులు సాధించిన అన్నదాతకు ప్రభుత్వం కూడా అండగా ఉండేందుకు ముందుకు వచ్చింది. క్వింటా ధాన్యం రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటలలో సొమ్ము చెల్లించే విధంగా ఏర్పాటు చేసింది. దీంతో మిగతా 6లో..

దోపిడీ చేస్తున్న దళారులు, మిల్లర్లు

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అవినీతిని ఆసరా చేసుకొని దళారులు, రైస్ మిల్లుల యజమానులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2,320 మద్దత ధర ప్రకటించింది. కొనుగోళ్లు జరపకపోవడంలో నిర్లక్ష్యం వల్ల దళారులకు అవకాశం వచ్చింది. కల్లాల్లో ఉన్న పంట ఇంటికి తెచ్చి దాచుకొనే అవకాశం లేక అన్నదాతలు పడుతున్న ఇబ్బందులను, వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వర్షాలు పడే సూచనలు ఉండడంతో నిస్సహాయతతో ఉన్న అన్నదాతను దోచుకొనేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. క్వింటాకు కేవలం రూ.1200 నుంచి రూ.1500 వరకూ చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వ్యాపారులు అవినీతి అధికారుల సాయంతో మిల్లులకు అమ్మి మద్దతు ధర పొందుతున్నారు. మరో వైపు ఆర్థికంగా బలపడి ఉన్న కొందరు మిల్లర్లు నేరుగా రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు ధాన్యం కొంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతుల వద్ద కొనుగోలు చేసినట్లు చూపిస్తూ వారి సొంత మనుషుల ఖాతాలకు సొమ్ము జమ చేయిస్తూ లబ్ధి పొందుతున్నారు. ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన 35 వేల టన్నుల ధాన్యంలో సగానికి పైగా అలానే కొనుగోలు చేసినట్లు సమాచారం.

ఉగ్రదాడిపై కొవ్వొత్తుల నిరసన



8లో

జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ విజయవాడలోని సిద్దార్థ కాలేజీ సర్కిల్ మదర్ థెరిసా విగ్రహం వద్ద గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్ దేశ దిష్టిబొమ్మను దహనం చేశారు. మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ మాట్లాడుతూ పాకిస్తాన్ రచించిన విద్వేషపూరిత వ్యూహంలో అమాయకులైన భారత ముస్లింలు పావులుగా మారొద్దని హితవు పలికారు.

అధికారులపై క్రమశిక్షణ చర్యలు!

రోడ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంపై ప్రభుత్వ ఆదేశం

- జగ్గయ్యపేట ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో రూ.కోటితో రోడ్ల నిర్మాణం
- రోడ్లు నాణ్యతగా లేవని కాలనీ వాసుల ఫిర్యాదు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలో ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పురపాలక సంఘం పూర్వ ఏఈ డి.హనుమంతురావు, పర్యవేక్షణ అధికారులు డీఈ వీవీ కోటేశ్వర రావు, ఈఈ భూషణంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీసీఏ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలో నివేదిక ఇచ్చేందుకు సీఆర్డీఏ సీఈ శ్రీనివాసులను నియమించి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయలు వెచ్చించి ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో 2023లో అంతర్గత సిమెంట్ రోడ్లు వేశారు. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేసింది. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని కాలనీవాసులు ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణ జరిగింది. రోడ్ల నిర్మాణంలో కనీస ప్రమాణాలు పాటించలేదని తేల్చింది. ఇందుకు బాధ్యులైన ఏఈ హనుమంతురావు, డీఈ వీవీ కోటేశ్వరరావు, విజయవాడ ఈఈ భూషణంపై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఆ నివేదికను తొక్కిపెట్టి ఆ అధికారులను జగ్గయ్య పేటలో కొనసాగించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో ఇది మళ్లీ వెలుగులోకి వచ్చింది. కౌన్సిల్ వైసీపీ నుంచి తెలుగు దేశం వశం కావటం, అధికారులను బదిలీ చేశారు. ఇప్పుడు క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేసింది.

టూరిజం ప్యాకేజీలపై అవగాహన కల్పించాలి

- కరపత్రాలను ఆకర్షణీయంగా రూపొందించండి
- గైడ్ల నియామకం, శిక్షణపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- కలెక్టర్ లక్ష్మీశ

8లో

యూనియన్ ప్రతిష్టను దెబ్బతీస్తారా!

- వ్యక్తిగత ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం
- కృష్ణా మిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

6లో

నిర్లక్ష్యమేల..

వాడీవేడిగా జిల్లా సమీక్ష సమావేశం

- సాగునీటి కాలువలపై ఎస్ఈని నిలదీసిన మంత్రి రవీంద్ర
- అధికారుల తీరు మారడంలేదన్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశం వాడీవేడిగా సాగింది. సాగు నీటి కాలువలను నిర్లక్ష్యం చేస్తున్న నీటిపారుదలశాఖ అధికారులపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన సమావేశాలు తన నియోజకవర్గంలో జరుగుతున్నా తనకు సమాచారం ఇవ్వడంలేదని అధికారుల తీరుపై ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అసహనం వ్యక్తం చేశారు. బుడమేరులో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆధారాలు చూపినా అడ్డుకోవడం లేదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ సమస్యలు సభ దృష్టికి తెచ్చారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. వివిధ శాఖలపై లోతుగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఉపయోగపడే పనులకు సంబంధించి పూర్తిస్థాయిలో నివేదికలు అందిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతానని చెప్పారు. అభివృద్ధి పనుల్లో, తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ నేతృత్వంలో జిల్లా మరింతగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. నీటి పారుదలశాఖపై జరిగిన సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర నీటి పారుదలశాఖ ఎస్ఈపై ప్రశ్నల వర్షం కురిపించారు. కాలువల పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పర్యటించకుండా విజయవాడకే పరిమితమైతే ఎలాగని ప్రశ్నించారు. బందరు కాలువకు కంకిపాడు వద్ద లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాడపాలెం, బంటుమిల్లి తదితర ప్రాంతాల్లో పంట కాలువలు, డ్రెయినేజీలను పరిశీలించారా.. ఎన్ని ప్రాంతాల్లో పర్యటించారు.. ఏం గమనించారో చెప్పాలని మంత్రి నిలదీశారు. కాలువల నిర్వహణ పనులు చేసే కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు చేసేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని అధికారులు పనితీరు మార్చుకోవాలని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మే 2వతేదీన ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన సమావేశాలను గన్నవరంలో నిర్వహిస్తున్న అధికారులు స్థానిక శాసన సభ్యుడినైన తనకు కనీస సమాచారం ఇవ్వడంలేదన్నారు. నందివాడ మండలం చేదుర్తిపాడు సమీపంలో బుడమేరులో పూడికతీత పేరుతో గట్టును కూడా తవ్వేస్తున్నారని ఫిర్యాదు చేస్తే అధికారులు ఏకంగా అనుమతులే ఇచ్చారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు.

బీసెంట్ రోడ్డులో అనధికార వ్యాపారులను గుర్తించండి

8లో

కూచిపూడి ఎంపీప పరీక్షలు ప్రారంభం

6లో

అమ్మో 350..!



- డొక్కు బస్సులతో ప్రయాణికులకు తప్పనితిప్పలు
- ఈ నెంబరు బస్ పైకి హైటెక్.. లోపలంతా డొల్ల
- ప్రజాదరణ కోల్పోతున్న ఆర్టీసీ బస్సులు

8లో



ధర్నాచౌక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ప్రొవైడర్ల ఆందోళన

సమస్యలు పరిష్కరించండి

» నేషనల్ హెల్త్ మిషన్ కమ్యూనిటీ ఆఫీసర్ల ధర్నా

ధర్నాచౌక్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారానికి నేషనల్ హెల్త్ మిషన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం చేపట్టిన ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ప్రొవైడర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎంసీఏ రాష్ట్ర కార్యదర్శి సందీప్‌కుమార్ మాట్లాడుతూ, వైద్య, ఆరోగ్యశాఖలోని ఎన్‌హెచ్ఎం కింద సీహెచ్‌వోలుగా విధులు నిర్వర్తిస్తున్న వారు గత రెండేళ్ల నుంచి జీతభత్యాల అంశంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్లు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీనెల వేతనాలతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతీ ఏడాది 5 శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించి, క్రమబద్ధీకరించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, స్టేట్ కో-ఆర్డినేటర్ వినోద్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

డీఎస్సీలో వెయిటేజి మార్కులు కలపాలి

» వయో పరిమితి 47 ఏళ్లకు పెంచాలి : ఏఐవైఎఫ్

ధర్నాచౌక్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఈవెంట్స్‌కు వెయిటేజ్ మార్కులు కలపాలని, డీఎస్సీ అభ్యర్థులకు వయో పరిమితి 47 ఏళ్లకు పెంచాలని ఏఐవైఎఫ్ నేతలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి దేవేంద్ర మాట్లాడారు. డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు, ఈవెంట్స్‌కు 30 శాతం వెయిటేజ్ మార్కులు కలపాలన్నారు. స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయ పోస్టుల్లో క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. నిరుద్యోగ పోరాట జేఏసీ కన్వీనర్ లంకా గోవిందరాజులు, నరసింహులు, వెంకటేశ్వర్లు, మధు, చెల్లయ్య, వెంకట్, సుధాకర్, గంట మమత తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ నుంచి అవార్డు అందుకుంటున్న స్వరూపరాణి

గొల్లపూడి పంచాయతీకి జాతీయ పురస్కారం

» ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు

గొల్లపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పంచాయతీకి జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఆత్మనిర్భార్ పంచాయతీ ప్రత్యేక అవార్డు కేటగిరిలో 2025కు గొల్లపూడి పంచాయతీకి అవార్డు లభించింది. ప్రజల్లో చైతన్యం నింపి సొంత నిధులతో పంచాయతీని అభివృద్ధి చేసినందుకు ఈ అవార్డు లభించింది. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్‌లోని మధుబానిలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా గొల్లపూడి పంచాయతీ కార్యదర్శి ఎం.స్వరూపరాణి, పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ సుధాకర్‌లు అవార్డు అందుకున్నారు.

ఎఫ్‌ఏకు అవార్డు



పవన్ కల్యాణ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎఫ్ఏ పద్మ

జి.కొండూరు : జి.కొండూరు మండలం కందులపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) కంచర్ల పద్మకు అవార్డు దక్కింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని ఎఫ్ఏ కన్వెన్షన్ హాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా పద్మ అవార్డు అందుకుంది. ఈమేరకు పద్మను కందులపాడు గ్రామ సర్పంచ్ నెల్లూరు శ్రీదేవి, టీడీపీ నాయకులు నెల్లూరు లీలా శ్రీనివాసరావులు ప్రత్యేకంగా అభినందించారు.



ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థిని

కూచిపూడి ఎంపీఏ పరీక్షలు ప్రారంభం

కూచిపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఎంపీఏ ద్వితీయ సంవత్సరం నాట్య (ప్రాక్టికల్) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కళాపములు, యక్షగానం అంశాలపై పరీక్షలు జరగ్గా, పరీక్షల నిర్వాహకులుగా నాట్యాచార్యులు హరిరామమూర్తి, పసుమర్తి రత్తయ్య శర్మ, చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ వ్యవహరించారు. నట్టువాంగం యేశ్వరపు శ్రీనివాసులు, గాత్రం వెంకట దుర్గా భవాని, మృదంగం హరనాథ శాస్త్రి సహకరించారు.

దేశ అభివృద్ధి, ప్రజల ఐక్యత చూసి ఓర్వలేకే..

ఉగ్ర దాడులు!

నిరసనగా కృష్ణా మిల్క్ ప్రాజెక్టు ఆవరణలో మానవహారం



ఉగ్రదాడులను ఖండిస్తూ నిరసన తెలుపుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చలసాని ఆంజనేయులు, తదితరులు

» మృతుల కుటుంబాలకు ప్రజలందరూ అండగా ఉంటారు : ఎంపీ కేశినేని చిన్ని

» ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం : యూనియన్ చైర్మన్ చలసాని

చిట్టినగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ ప్రజల ఐక్యత, దేశాభివృద్ధి చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడ్డారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ) చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ విల్క్‌ఫ్యాక్టరీలో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మానవహారం నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలి.. దోషులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ ఆధ్వర్యంలోనే దాడి జరిగిందని భారతదేశం గట్టిగా విశ్వసిస్తున్నదన్నారు. ఉగ్రదాడిలో అమాయకులు చనిపోవడం దేశ ప్రజలందరినీ కలచివేసిందన్నారు. కులమతాలకు అతీతంగా దేశ ప్రజలతో పాటు కాశ్మీర్ ప్రాంత ప్రజలు కూడా శాంతినే కోరుకుంటూ దాడిని ఖండించారన్నారు. ఇటువంటి దాడులు చేసి దేశప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరన్నారు. సైనిక దుస్తుల్లో వచ్చి దాడులకు పాల్పడిన దోషులను త్వరలోనే పట్టుకుని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు దేశ ప్రజలందరూ అండగా ఉంటారన్నారు. దాడుల్లో గాయపడిన వారికి సానుభూతి, మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. వారిపవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కృష్ణాజిల్లా మిల్క్‌యూనియన్ (విజయ) చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించేలా దాడికి తెగబడిన ఉగ్రవాదుల పట్ల కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. భారతదేశంలో శాంతికి విఘాతం కలిగించాలని చూస్తున్న పాకిస్తాన్ దుశ్చర్యలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఉగ్రదాడుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మృతుల కుటుంబాలకు యూనియన్ తరపున ఒక్కో కుటుంబానికి రూ. లక్షన్నర చొప్పున అందజేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఫతావుల్లా, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు ఆషా, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సొలంకిరాజు, పశ్చిమనియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత, తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, బీసీ సెల్ అధ్యక్షుడు నమ్మిభాను ప్రకాష్, రాష్ట్ర నాయకులు గుర్రం కొండ, క్లస్టర్ ఇన్చార్జ్‌లు యేదుపాటిరామయ్య, యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయివెంకటరమణ, చలసాని చక్రపాణి, అర్జా వెంకట నగేష్, అంజిరెడ్డి, పి.కొండలరావు, రామచంద్రరావు, నెక్కలపు వాణిశ్రీ, నాని, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ ప్రతిష్టను దెబ్బతీస్తారా!

» వ్యక్తిగత ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం » కృష్ణా మిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు

చిట్టినగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ ప్రతిష్టను దెబ్బతీసేలా సోషల్ మీడియా వేదికగా, వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఇటీవల సోషల్ మీడియాతోపాటు ఓ పత్రికలో ప్రచురించిన కథనాలు పూర్తిగా అవాస్తవాలని పాలకవర్గ సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. గురువారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది పాడి రైతుల సంస్థ 'కృష్ణా మిల్క్ యూనియన్' అన్నారు. ఇటీవల కొందరు తమ సొంత ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలను చేస్తూ కుట్ర పన్నుతున్నారన్నారు. ఆరోపణల్లో నిజాలు ఉంటే పాలక వర్గం ఎదుట ముఖాముఖి తెలియజేయాలన్నారు. ఆరోపణలు చేసిన వారిని పాలకవర్గంతోపాటు లక్షలాది మంది పాడి రైతులు సంఘటితంగా ఎదుర్కొంటారన్నారు. పాలకవర్గసభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు మాట్లాడుతూ, వాస్తవాలు లేకుండా అసత్య ప్రచారాలు చేస్తూ కొందరు వ్యక్తులు ఆరోపణలు చేస్తూ యూనియన్ ప్రతిష్టను దిగజారుస్తున్నారన్నారు. ఇటువంటివి పునరావృత్తం కాకుండా చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు. వేమూరి సాయి వెంకటరమణ మాట్లాడుతూ, వాట్సాప్, సోషల్ మీడియాలో చైర్మన్, పాలకవర్గంపై చేస్తున్న ఆరోపణలు సత్యదూరమన్నారు. ఓ వ్యక్తి యూనియన్‌కు చెల్లించాల్సిన కోట్లాది రూపాయలు కట్టకుండా ఉండేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నాడని తెలిసిందన్నారు. అలాగే ఆ వ్యక్తి కోర్టుకి వెళ్లిన కోర్టు డబ్బులు కట్టాలని చెప్పడంతో ఏం చేయలేక ఇటువంటి అసత్య ప్రచారాలు, పాలకవర్గంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. అతను ఎన్ని కుయుక్తులు పన్నినా వదిలిపెట్టేది లేదని, డబ్బులు కట్టిస్తామన్నారు. సోషల్, మీడియాతోపాటు ఓ పత్రిక ఎటువంటి ఆధారాలు లేకుండా కథనాలు ప్రచురించడం బాధాకరమన్నారు. పాలకవర్గ సభ్యురాలు నెక్కలపు వాణిశ్రీ మాట్లాడుతూ, పాలకవర్గం నిరంతరం పాడి రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, టెండర్ ఇతరత్ర పనులు అన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయన్నారు. చైర్మన్‌తోపాటు పాలకవర్గంపై అసత్యప్రచారాలను పాడిరైతులు, పాలకవర్గం ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎండి కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గ సభ్యులు అర్జా నగేష్, నాని, కొండలరావు, రామచంద్రరావు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలిపోయిన మొక్కజొన్న కంకులను చూపుస్తున్న రైతులు, టీడీపీ నేతలు

మొక్కజొన్న పంట బుగ్గిపాలు

» 20 ఎకరాల్లో కాలిపోయిన పంట

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంవల్ల గురువారం మరోసారి షార్ట్ సర్క్యూట్‌తో కొటికలపూడి గ్రామంలో మరోచోట 20 ఎకరాల్లో మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. బుధవారం జరిగిన ప్రమాదంలో 25 ఎకరాలు అగ్గికి బుగ్గయ్యి రైతులు లబోదిబోమంటున్నా మా తప్పు కాదని విద్యుత్‌శాఖ అధికారులు బుకాయించారని, అయితే గురువారం మరోమారు జరగడంతో ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగానే విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి చేతికి వచ్చిన పంటలు కాలిపోయాయని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇబ్రహీంపట్నం ట్రాన్స్‌కో ఏఈ వెంకన్న వివరణ ఇస్తూ ఘటన జరిగిన ప్రదేశంలో ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు బాగానే ఉన్నాయని, అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. పంటను రక్షించేందుకు దాసరి చిన్న దుర్గారావు, దాసరి పెద్ద దుర్గారావులకు మంటలార్పే ప్రయత్నంలో గాయాలయ్యాయి. బాధిత రైతులకు టీడీపీ మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ), టీడీపీ నేత రెంటపల్లి వెంకటేశ్వరరావులు సంఘీభావం తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి విషయాన్ని రైతులు తీసుకెళ్లగా న్యాయం చేయిస్తామని చెప్పారన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

» కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి



మచిలీపట్నం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని కోర్టుల్లో మే10న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి జి.గోపి అన్నారు. జిల్లాకోర్టు న్యాయసేవాధికార సదన్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా లోక్‌అదాలత్ కార్యక్రమంలో అధికంగా కేసులు పరిష్కారమయ్యేలా, జిల్లా ప్రథమస్థానంలో నిలిచేలా అన్ని విభాగాల అధికారులు సహకరించాలని ఆయన కోరారు. పోలీస్‌స్టేషన్ల వారీగా సర్కిల్ కమిటీలను ఏర్పాటుచేసి అధికసంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, న్యాయమూర్తులు పాండురంగారెడ్డి, సుజాత, ఏఎస్పీ వీవీ నాయుడు, కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దయనీయం

(5వ పేజీ తరువాయి)

అన్నదాతలలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కానీ ఆ సంతోషం ఎక్కువ సేపు నిలబడలేదు. పౌరసరఫరాల శాఖ అనాలోచిత నిర్ణయాల వల్ల ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. పండిన పంటను నిల్వ చేసుకొనే అవకాశం లేక పోవడంతో పాటు సాగుకు చేసిన అప్పులు వడ్డీలు పెరుగుతుండడంతో అన్నదాతలు కలత చెందుతున్నారు.

హామీలేనా లేక ఆచరణ ఉందా మంత్రి గారూ..

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామంటూ పలు మార్లు ప్రకటించిన మంత్రి నాదెండ్ల మనోహర్ క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాల్సి ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో 1.60 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు ఉండగా, కేవలం పది వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చిన పౌర సరఫరాల శాఖ తన అవగాహనా రాహిత్యాన్ని చాటుకుంది. జిల్లాలో మొత్తం 27 మిల్లులు ఉన్నాయి. ప్రభుత్వం కేవలం పదివేల టన్నుల కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇవ్వడంతో గిట్టుబాటు కాదని భావించిన పది మిల్లుల యాజమాన్యాలు కొనుగోళ్లకు నిరాకరించాయి. మిగిలిన మిల్లర్లు కూడా కొద్ది మొత్తం ధాన్యం కొనుగోళ్ల కోసం కార్మికులను సిద్ధం చేసుకోలేమని చెప్పడంతో అతి కష్టం మీద 50వేల టన్నుల కొనుగోళ్లకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో కొనుగోలుకు సిద్ధమైన మిల్లుల యజమానులు ఆ మేర ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకున్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభమైనా పలు సమస్యలు వెంటాడుతూ వచ్చాయి. యాభై వేల టన్నుల ధాన్యం కొనుగోళ్లకు కనీసం 12 లక్షల బ్యాగ్‌లు కావల్సి ఉంది. ముందస్తు ప్రణాళిక లేక పోవడంతో అధికారులు సకాలంలో బ్యాగ్‌లు అందించలేకపోయారు. ఖరీఫ్ కొనుగోళ్ల సమయంలో సరుకు రవాణా చేసిన ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లకు సకాలంలో సొమ్ము చెల్లింపులు జరగలేదు. దీంతో రబీ సరుకు రవాణాకు వేగంగా లారీలు పంపకుండా జాప్యం వహించారు. దీంతో కొనుగోళ్లు మందగించాయి. ఫలితంగా ఇప్పటి వరకూ కేవలం 35వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలిగారు. మూడింట ఒక వంతు పంట కొనుగోలుకే ఆపసోపాలు పడుతున్న నేపథ్యంలో మంత్రి ప్రకటనలపై అన్నదాతలకు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పావలా వంతు కొనుగోలు చేయలేని పౌరసరఫరాల శాఖ ప్రతి గింజా కొనగలదా.. ఇచ్చిన హామీలను మంత్రి నిలబెట్టుకోగలరా అన్న చర్చ సాగుతుంది. తక్షణమే మంత్రి నాదెండ్ల ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించి తమకు సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బ్యాంక్ గ్యారెంటీల సమస్య

ధాన్యం కొనుగోలు చేసే మిల్లుల యజమానులు ప్రభుత్వానికి బ్యాంక్ గ్యారెంటీ(బీజీలు) ఇవ్వాల్సి ఉంది. ఒక్కొక్క మిల్లరు రూ.2 కోట్లకు బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చారు. వారు ఇచ్చిన బీజీలకు రెట్టింపు సరుకు కొనుగోలు చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన సరుకుకు ఆ మొత్తం బీజీ సరిపోయింది. ఇంకా ధాన్యం కొనాలంటే బ్యాంక్ గ్యారెంటీ పెంచాల్సి ఉంది. కానీ బ్యాంక్ గ్యారెంటీ పెంచేందుకు మిల్లర్లు సిద్ధంగా లేక పోవడంతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. మిల్లర్ల ఇచ్చిన రెండు కోట్ల బీజీలకు గాను ప్రభుత్వం మరో రెండు కోట్లు వెసులుబాటు ఇచ్చింది. కానీ ఐదు రెట్లు వెసులుబాటు ఇస్తేనే పూర్తి ధాన్యం కొనగలమని మిల్లర్లు భీష్మించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బ్యాంక్ గ్యారెంటీల సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

సాంకేతికతను మారణహోమానికి వినియోగించడం శోచనీయం

» మంత్రి పార్థసారథి

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : 'నిత్యం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి, అభివృద్ధికి ప్రపంచమంతా వినియోగిస్తోంది. కానీ ఉగ్రవాద సంస్థలు, కొన్ని దేశాల మద్దతుతో విధ్వంసకర మారణ హోమాన్ని సృష్టించడానికి వినియోగించడం శోచనీయం' అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'అల్‌పైయిన్ క్వెస్ట్ అనే యాప్‌ను పాకిస్తాన్ భద్రతా దళాలు రూపొందించాయి. దానిని ఉపయోగించడంలో ఉగ్రమూకలకు శిక్షణ ఇచ్చాయి. ఆ యాప్‌ను ఉపయోగించి కశ్మీర్‌లో అలజడి సృష్టించడానికి ప్రయత్నించడం దారుణం. అక్కడ మళ్లీ పర్యాటకం అభివృద్ధి చెందుతోంది. పరిస్థితి మారి శాంతియుత వాతావరణం నెలకొంటోంది. దీనిని భగ్నం చేయడానికి అలజడి సృష్టించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రదాడిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం. రాజకీయాలకు అతీతంగా ప్రధానికి, కేంద్రం తీసుకొనే చర్యలకు మద్దతు ఇవ్వాలి. సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉంటామని చెప్పారు. అన్ని మతాలను సమానంగా గౌరవించాలనేది రాష్ట్ర ప్రభుత్వ విధానం. అందరి హక్కులను కాపాడడానికే మా ప్రభుత్వం పని చేస్తుంది. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని మంత్రి కోరారు.

ప్రధాని సభకు 1.20 లక్షల మంది!

(5వ పేజీ తరువాయి)

సమాచారం. మే 2వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

ఆరు రూట్లలో సభ వద్దకు..

గుంటూరు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నెంబర్-4లో 200 బస్సుల ద్వారా మంగళగిరి, డాన్ బాస్కో, ఎర్రబాలెం, ఈ8, ఈ9 రోడ్ల మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు చేరుకుంటారు. రూట్ నెంబర్-5లో 200 బస్సుల ద్వారా ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు తరలివస్తారు. రూట్ నెంబర్-6లో మరో 200 బస్సులలో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నెంబర్ - 1 ద్వారా 600 బస్సులలో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం సర్వీసు రోడ్డు, మందడం, ఎన్ 7 రోడ్డు, ఈ 8 జంక్షన్, ఈ 8, ఎన్ 8 రోడ్ల మీదుగా పార్కింగ్-6 ప్లేస్‌కు తరలివస్తారు. పల్నాడు జిల్లా నుంచి 30 వేల మంది రూట్ నెంబర్-6 ద్వారా 400 బస్సులలో తాడికొండ, పెదపరిమి, తుళ్లూరు, ఈ 6 రోడ్డు మీదుగా పార్కింగ్-1 ప్లేస్‌కు వస్తారు. మరో 200 బస్సులలో రూట్ నెంబర్-7 ద్వారా అమరావతి, బోరుపాలెం, రాయపూడి, హైకోర్టు రోడ్డు మీదుగా ఈ 6, ఎన్ - 10 రోడ్డు మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు తరలివస్తారు. కృష్ణాజిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నెంబర్-3, 4 ద్వారా 200 బస్సులలో కనకదుర్గా వారధి, ఓటీజీ, స్క్రూ బ్రిడ్జి, నులకపేట, డాన్ బాస్కో, యర్రబాలెం, ఈ 8, ఎన్ 9 జంక్షన్ల మీదుగా పార్కింగ్ - 7 ప్లేస్‌కు వెళతారు. బాపట్ల జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నెంబర్ - 5 ద్వారా ఎన్‌హెచ్ - 16, వెస్ట్ బైపాస్, నిడమర్రు, కురగల్లు, ఎన్-9 రోడ్డు జంక్షన్ మీదుగా పార్కింగ్ - 1 ప్లేస్‌కు వస్తారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మంది రూట్ నెంబర్ - 1 ద్వారా 200 బస్సులలో గొల్లపూడి, వెస్ట్ బైపాస్, వెంకటపాలెం, సర్వీసు రోడ్డు, మందడం, ఎన్-7 రోడ్డు, ఈ - 8 రోడ్డు మీదుగా పార్కింగ్ - 6 ప్లేస్‌కు వెళతారు.

గ్యాలరీలకు జనం ఇలా..

ఆరు రూట్లలో పార్కింగ్ ప్లేసులకు చేరుకున్న వారంతా కూడా తమకు నిర్దేశించిన విధంగా కొందరు రోడ్డు షోలో పాల్గొనటానికి, మరికొందరు గ్యాలరీలలో కూర్చోవటానికి వెళ్తారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది పూర్తిగా గ్యాలరీలలోనే కూర్చుంటారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే 30 వేల మందిలో 5 వేల మంది రోడ్డుషో, 25 వేల మంది గ్యాలరీలకు వెళ్తారు. పల్నాడు జిల్లా నుంచి వచ్చే 30 వేల మంది కూడా గ్యాలరీలలోనే కూర్చుంటారు. కృష్ణా, బాపట్ల జిల్లాల నుంచి వచ్చే 20 వేల మంది కేవలం రోడ్డు షోకు మాత్రమే వెళతారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే 10 వేల మందిలో 5 వేల మంది రోడ్డు షోకు, మరో ఐదు వేల మంది గ్యాలరీలలోకి వెళ్తారని సమాచారం.

ప్రకాశం బ్యారేజీ మీదుగా వీఐపీ రూట్

సభా ప్రాంగణానికి వెళ్లేందుకు వీఐపీ రూట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వీఐపీ రూట్ విజయవాడలో ప్రకాశం బ్యారేజీ, కరకట్ట, వెంకటపాలెం, సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ఈ - 3, ఎన్ 9 జంక్షన్ నుంచి ఎడమవైపుగా ఈ-6, ఎన్ 9 జంక్షన్‌ను టచ్ చేస్తూ సచివాలయం పక్క నుంచి నేరుగా పీ-9 పార్కింగ్ ప్లేస్‌కు వాహనాలు వెళతాయి. ఒకవేళ అవాంతరాలు ఏమైనా ఏర్పడితే వీఐపీ ఆల్టర్‌నేటివ్ రూట్‌ను కూడా నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి జంక్షన్, ఉండవల్లి రోడ్డు మీదుగా వెంకటపాలెం వెళ్లేలా ప్లాన్ చేశారు.

బెజవాడలో.. ఉగ్ర కదలికలు!

(5వ పేజీ తరువాయి)

సృష్టించింది. దీంతో విజయవాడను తరచూ నక్సల్స్ (అప్పట్లో) షెల్టర్ జోన్‌గా ఉపయోగించుకుంటున్నారన్న అనుమానాలను పోలీసులు సైతం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పలు సంఘటనలు కూడా జరిగాయి. రాకెట్ లాంచర్ల వ్యవహారంలో పాత్ర ఉందన్న కారణంతో సీపీఐ మావోయిస్టు మద్దతుదారు అయిన కోట ఆనంద్ అలియాస్ కిషోర్‌ను అరెస్టు చేయటం సంచలనం సృష్టించింది. రాకెట్ లాంచర్లు అమర్చటంలో స్పెషలిస్ట్ అయిన టెక్ మధుకు కోట ఆనంద్ స్నేహితుడన్న అనుమానంతో అరెస్టు చేశారు. విజయవాడతో తొలుత నక్సల్స్, పీపుల్స్‌వార్ గ్రూప్ ఆ తర్వాత మావోయిస్టుల కదలికలనేవి ముడిపడి ఉన్నాయి. మావోయిస్టులకు ఏ విధంగా షెల్టర్‌జోన్‌గా ఉందో అదే తరహాలో ఉగ్రవాద సంస్థల సభ్యులకు కూడా షెల్టర్ జోన్‌గా ఉంటుందన్న అనుమానాలు ఎప్పటి నుంచో ఉన్నాయి.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ: మంత్రి డోలా

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500కు 345 మార్కులు సాధించిన పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన దివ్యాంగ విద్యార్థిని ఆకుల లావణ్యను రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అభినందించారు. ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని లావణ్య నిరూపించిందని గురువారం ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. లావణ్య జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉచితంగా ల్యాప్ ట్యాప్‌లు ఇస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు పింఛన్ నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నామన్నారు. దివ్యాంగుల కోసం విశాఖలో రూ.200 కోట్లతో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు.

ఫార్మశీ భవనాలను త్వరగా పూర్తి చేయాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఫార్మశీ కళాశాల భవనాలను త్వరితగతిన నిర్మించాలని కృష్ణా వర్సిటీ వీసీ కూన రాంజీ అన్నారు. రూ. 10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మశీ కళాశాల భవనాలను కూన రాంజీ గురువారం పరిశీలించారు. ఇంజనీరింగ్ సిబ్బంది, ఫార్మశీ కళాశాల అధ్యాపకులతో భవన నిర్మాణాల విషయమై చర్చించారు. ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

బీజేపీలో చేరికలు



పటమట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అధ్యక్షతన తూర్పు క్రియాశీలక నాయకుడు డాక్టర్ కాకాని తరుణ్ నాయకత్వంలో 5వ డివిజన్‌కు చెందిన పురుషోత్తం తన అనుచరులతో కలిసి గురువారం బీజేపీ తీర్థం తీసుకున్నారు. వారికి శ్రీరామ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నగర అభివృద్ధికి చంద్రబాబు కృషి

ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె వెల్లడి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

బెంజిసర్కిల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు నియోజకవర్గం 9వ డివిజన్ జ్యోతి కన్వెన్షన్ దగ్గర ప్రగతి నగర్ ఒకటో లైన్ ప్రాంతంలో వారు పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌వీఎస్ కల్యాణ మండపం దగ్గర డ్రెయినేజీ పనులకు, పటమటలంక కట్ట మీద వాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ 9వ డివిజన్‌లో రూ. కోటి 70లక్షలతో డ్రెయినేజీ, రోడ్లు, వాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ గత పది నెలల కాలంలో తూర్పులోని ఒక్కొక్క డివిజన్‌లో సుమారు రూ. 2కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ క్రాంతిశ్రీ, రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చలసాని రమణ, సూరపనేని సురేష్, యలమంచిలి దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానుషం

ఆమ్‌ఆద్మీ నేత నేతి మహేశ్వరరావు

బెంజిసర్కిల్: పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని ఆమ్‌ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పర్యాటక రంగంవైపు కశ్మీర్ యువత చూస్తున్న తరుణంలో పాకిస్తాన్ తీవ్రవాదులు పర్యాటకులపై దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. ఇప్పుడిప్పుడే కశ్మీర్ ప్రజలు అభివృద్ధి వైపు వస్తున్న ఈ పరిస్థితుల్లో తీవ్రవాదుల దాడిని మతం కోణంలో చూపించాలన్న విధానం మంచిది కాదన్నారు. భారత్ బలం భిన్నత్వంలో ఏకత్వమని, అది సాధించాలంటే కలిసికట్టుగా అందరూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

పాలిసెట్ పరీక్షకు హాల్ టికెట్లు విడుదల

భారతీనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహిస్తున్న ఏపీ పాలిసెట్ 2025 (ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కామన్‌ఎంట్రన్స్ టెస్ట్)కు హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను పాలిసెట్.ఏపి.నిక్.ఇన్ అనే అధికార వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.



ఎన్టీఆర్ సర్కిల్‌లో తూర్పు టీడీపీ ఆధ్వర్యంలో..



బెంజిసర్కిల్‌లో అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో ..



న్యాయవాదుల కొవ్వొత్తుల ర్యాలీ

పరమత సహనంతో దేశాన్ని కాపాడుకుందాం

ఎన్టీఆర్ సర్కిల్‌లో జరిగిన కాగడాల ప్రదర్శనలో జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడులు హేయమైన చర్య అని జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన యాత్రికుల ఆత్మకు శాంతి కలగాలని గురువారం సాయంత్రం పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో తూర్పు టీడీపీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భద్రత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. పరమత సహనంతో దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జనసేన నేత అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ పాకిస్తాన్ దాడులు సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి గాంధీ, పొట్లూరి సాయిబాబు, నర్రా కిషోర్, షేక్ ఆశ, సాయిన బుజ్జి, తలసాని రమణ, ముని తదితరులు పాల్గొన్నారు.

జనసేన శాంతియుత నిరసన

బెంజిసర్కిల్: కశ్మీర్ మృతులకు సంతాపంగా జనసేన ఆధ్వర్యంలో గురువారం బెంజిసర్కిల్‌లో శాంతియుత నిరసన జరిగింది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, నేతలు శాంతినిరసన కార్యక్రమంలో పాల్గొని ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఈ దుర్ఘటనను పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అందరూ ఖండించాలని కోరారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత నిరసనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పోతిరెడ్డి అనిత, ఉమ్మడిశెట్టి బహదూర్, బాండ్రెడ్డి రవి, హరిప్రసాద్, కోటి, శివరామకృష్ణ, అబ్దుల్ నజీబ్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కొవ్వొత్తుల ర్యాలీ

విజయవాడ లీగల్: ఉగ్రదాడిని నిరసిస్తూ బెజవాడ బార్ న్యాయవాదులు గురువారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ అన్ని మతాల వారు కొలువై వున్న ప్రాంతం భారతదేశమని, ఏ మతమో తెలుసుకొని మరీ అమాయకులైన పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపడాన్ని తీవ్రంగా ఖండించారు. తీవ్రవాదులను పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌కు సరైన బుద్ధిచెప్పాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గంధం శ్రీనివాసరావు, కండెల వరప్రసాద్, పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



పెట్రోల్ బంకులో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

లబ్బీపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ ఫైర్ అధికారులు నగరంలో పలు షాపింగ్ మాల్స్ రెస్టారెంట్స్, పెట్రోల్ బంక్‌లలో గురువారం తనిఖీలు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, మంటలను ఎలా అదుపుచేయాలి, ఎటువంటి పరికరాలు, విధానాలు అమలు చేయాలి, ఫైర్‌స్ప్రింకర్లు, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది తదితర అంశాలను మాల్స్‌లోని సిబ్బందికి వివరించడంతో పాటు డెమో చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పారిశుధ్య నిర్వహణపై ఎటువంటి లోపాలు ఉండరాదని మున్సిపల్ కమిషనర్ ధానచంద్ర అన్నారు. నగరపర్యటనలో భాగంగా గురువారం వైవీ హాస్పటల్ రోడ్, ఎంజీ రోడ్, ఎయిర్‌పోర్ట్ కారిడార్, రామవరప్పాడు రింగ్ ప్రాంతాలలో పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఎస్ఈ ప్రాజెక్ట్స్ పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఈఈ సామ్రాజ్యం, డిప్యూటీ హార్టికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10.30 వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ పోలీస్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. కళానగర్, పూర్ణచంద్రనగర్, ఎలిసమ్మ హోటల్ ప్రాంతం, సత్యనారాయణ నగర్, పోలీస్ కాలనీ, హెడ్ పోస్టాఫీసు, ఎస్‌బీఐ బాలాజీ నగర్, ఉదగిరి గంగయ్య వీధి, కోర వారి రోడ్డు, కొత్త ఆంజనేయ స్వామి గుడి, జీఎల్ రావు ప్లాట్స్, మహితా పబ్లిక్ స్కూల్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఇన్‌లైన్ హాకీ అండర్-19కు నలంద విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్

గవర్నర్‌పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం మొహాలీలో జరిగిన జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్రం నుంచి ఇండియన్ టీమ్‌కు ఎంపికైన నలంద విద్యానికేతన్ విద్యార్థి కామినేని కార్తీక్‌ను గురువారం ప్రిన్సిపాల్ మాదల పద్మజ అభినందించారు. ఇండియన్ రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన దక్షిణ కొరియా దేశంలో జూలైలో జరిగే ఇన్‌లైన్ హాకీ అండర్-19 బృందంలో నలంద విద్యార్థి కార్తీక్ చోటు దక్కించుకున్నారు. సెకండ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ ఇన్‌లైన్ హాకీ సబ్ జూనియర్స్ అండర్-14 విభాగంలో, అండర్-17 విభాగంలో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. మొహాలీ నుంచి తిరిగివచ్చిన విద్యార్థులను, కోచ్ పి. ఆనంద్‌ను ప్రిన్సిపాల్ సత్కరించారు. పోటీల్లో పాల్గొన్న నలంద విద్యార్థులందరూ మెడల్స్ సాధించడం గర్వంగా ఉందన్నారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి మూడేళ్ల జైలు

విజయవాడ లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) :బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో మూడేళ్ల జైలుశిక్ష, రూ20 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కృష్ణలంక స్టేషన్ పరిధిలో ఒక స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న బాలిక ప్రతి రోజు స్కూల్‌కు తమ్ముడితో కలిసి వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుంది. 2019 జూలై 5న పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన పాటల డేవిడ్ కుమార్ (37) బాలికను ఆమె స్నేహితుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు, వెంటనే బాలిక ఈ విషయాన్ని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పగా వారు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోలీసులు పోక్సో తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ వి.కృష్ణవేణి 23 మంది సాక్షులను విచారించారు. కేసు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పరిశ్రమలు స్థాపించే స్థాయికి మహిళలు ఎదగాలి

ఏపీఎంఎస్ఎంఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్ బాబు



మాట్లాడుతున్న సుదర్శన్ బాబు

గుణదల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో మహిళా పారిశ్రామికవేత్తలకే ప్రాధాన్యత పెరగనుందని ఏపీఎంఎస్ఎంఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్ బాబు తెలిపారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద ఎలీప్ ఇండియా వారి ఫుడ్ ప్రాసెసింగ్ ఈడీపీ మీద శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు మంచి రాణింపు ఉందని తెలిపారు. అందులోనూ మహిళా ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహకాలు ఉన్నాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి మహిళ ఒక పరిశ్రమ స్థాపించే స్థాయికి ఎదగాలని కోరారు. ప్రభుత్వ పరంగా ఉన్న అన్ని రకాల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. శిక్షణ తరగతులకు 23మంది మహిళా ఔత్సాహికులు హాజరయ్యారు. ఎలీప్ రీజినల్ అధికారి సునీత, మేనేజర్ బాల పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ పంపిణీ

ఆటోనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సియ ఫెలోషిప్ ప్రాంగణంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు గురువారం సజ్జా జ్యోతి సర్టిఫికేట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ సజ్జా రత్నకుమార్ మాట్లాడుతూ జూన్ మూడో వారం నుంచి 17వ బ్యాచ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ అశాస్త్రీయం

జేఏసీ ఛైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్

భారతీనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆంధ్రరాష్ట్రంలో జరిగిన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ అశాస్త్రీయంగా ఉందని అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో చేసిన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకిస్తూ అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్ ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని కేంద్ర ప్రధాన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఛైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ అశాస్త్రీయంగా ఉందని అన్నారు. ఈ వర్గీకరణ కేవలం రాజకీయ లబ్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు వాడుకున్నారని అన్నారు. ఈ వర్గీకరణ ద్వారా ఎస్సీలు అందరు కూడా నష్టపోతున్నారని, ముఖ్యంగా మాలలకు అన్యాయం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మాల సంఘాల జేఏసీ వైస్‌ఛైర్మన్ గుర్రం రామారావు, మాజీ డీఎస్పీ రవి కుమార్, గుంటూరు నగర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, బోరగా రత్నం, విప్పర్ల విజయభాస్కర్, కనకవల్లి వినయ కుమార్, డాక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



చెన్నైలోని పెరియార్ సైన్స్ సెంటర్‌లో విద్యార్థులు

సెన్స్‌యాత్రకు విద్యార్థులు


లబ్బీపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన 101మంది విద్యార్థులు, వారికి 10మంది గైడ్ టీచర్లతో చెన్నైకు సెన్స్‌యాత్రకు బుధవారం రాత్రి వెళ్లారు. ఈ యాత్రను డీఈవో యువి.సుబ్బారావు ప్రారంభించారు. యాత్రకు వెళ్లిన విద్యార్థుల బృందం గురువారం చెన్నైలోని పెరియార్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను, బీఎం బిర్లా ప్లానిటోరియం, ఎవల్యూషన్ పార్క్‌లను సందర్శించారు. అదేవిధంగా స్నేక్ పార్క్, మెరీనా బీచ్ లను సందర్శించారు, ఈ యాత్రలో జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పై మూత ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భారతీనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్ నోహోటెల్ సర్వీస్ రోడ్డు త్రివేణి మార్బుల్స్ సమీపంలో డ్రెయినేజీపై వీఎంసీ సిబ్బంది సిమెంట్ దిమ్మను ఏర్పాటు చేశారు. డ్రెయినేజీపై రక్షణగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు డ్రెయిన్లో పడిపోయి ప్రమాదకరంగా మారిందని ఇటీవల డ్రెయినేజీపై రక్షణ ఏదీ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈఈ సామ్రాజ్యం, వీఎంసీ సిబ్బందితో కలిసి గురువారం డ్రెయినేజీపై దిమ్మను ఏర్పాటు చేశారు.











అమ్మో 350..!

- ఈ నెంబరు బస్ పైకి హైటెక్.. లోపలంతా డొల్ల
- ఆగుతూ.. ఊగుతూ.. మోగుతున్నాయ్..!
- డొక్కు బస్సుల కేరాఫ్‌గా ఇబ్రహీంపట్నం డిపో
- ప్రజాదరణ కోల్పోతున్న ఆర్టీసీ బస్సులు

డొక్కు బస్సులతో ప్రయాణికులకు తప్పనితిప్పలు

'ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి.. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోండి' ఈ నినాదం ఇబ్రహీంపట్నం డిపోలో తిరిగే బస్సులకు వర్తించదు. ఎందుకంటే కాలం చెల్లిన బస్సులను తిప్పుతూ రోజు రోజుకు ప్రతిష్ఠ దిగజార్చుకుంటోంది. సమస్యల సుడిగుండం నుంచి డిపో ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదు. గత ఏడాది వచ్చిన వర్షాలకు డిపో పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. అందులోని బస్సులు 50 వరకు పూర్తిగా నీటిలో మునిగి ఇంజన్లలో నీరు చేరడంతో చాలా బస్సులు దెబ్బతిన్నాయి. చేసేది లేక వాటినే తిప్పుతున్నారు. పైగా డిపోలో తిరిగే బస్సుల జీవిత కాలం పూర్తయింది. వాటిస్థానంలో కొత్త బస్సులు రావాల్సి ఉన్నా రాలేదు. దీంతో కాలం చెల్లిన వాటినే తిప్పుతూ ప్రయాణికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇబ్రహీంపట్నం డిపోలో తిప్పుతున్న బస్సులపై ప్రత్యేక కథనం

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం:

కాలం చెల్లిపోయి డొక్కు డొక్కు అయిన బస్సులకు కేరాఫ్ అడ్రస్‌గా ఇబ్రహీంపట్నం మారిపోయింది. అందుకు ఈ డిపోలో తిప్పుతున్న కాలం చెల్లిన బస్సులే ప్రత్యక్ష నిదర్శనం. ముఖ్యంగా విజయవాడ - మైలవరం మధ్య తిప్పే 350 నంబరు బస్సులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ ఉంది. ఈ మధ్యకాలంలో వామ్మో 350వ నెంబరు బస్సులా అని ప్రయాణికులు భయపడే పరిస్థితి నెలకొంది. ఎందుకంటే బస్సులు లేక వేరే డిపోల్లో కాలం చెల్లిన హైటెక్ బస్సులను ఇక్కడకు పంపితే వాటిని 350 సర్వీసులుగా తిప్పుతున్నారు. పేరుకే అవి హైటెక్ బస్సులు లోపలంతా డొక్కు డొక్కు. సిటింగ్ వరకు పర్వాలేదు. నిలబడేందుకు మాత్రం నానాపాట్లు పడాలి. పైగా పట్టుకునేందుకు రాడ్లుండవు. నిలబడ్డ ప్రయాణికులు సీట్లను లేదా లగేజ్‌లు పెట్టుకునే టాప్‌ను పట్టుకొని ప్రమాదకర స్థితిలో నిలబడాల్సి వస్తోంది. దీంతో వాటిలో ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు ఇష్టపడటం లేదు.

వేలసంఖ్యలో ప్రయాణికులు

మైలవరం - విజయవాడ మధ్య ఇబ్రహీంపట్నం డిపో నుంచి తిప్పే ఒక్క 350 సర్వీసుల్లోనే రోజుకు వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సర్వీసు నుంచి పెద్ద ఎత్తున ఆదాయం వస్తోంది. అలాంటి సర్వీసులకు డొక్కు బస్సులు, కాలం చెల్లిన బస్సులు తిప్పడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఒకప్పుడు 350 బస్సులంటే ఎంతో క్రేజ్. ఇప్పుడు మాత్రం తిరువూరు ఆర్డినరీ నయం చార్జీ తక్కువ. పైగా 350 నంబరు బస్ కంటే ముందెళతుందని ప్రయాణికులు ఇతర బస్సులకు మొగ్గు చూపుతున్నారు.

ఆగిపోతున్నాయి.. ఊగిపోతున్నాయి..

350వ నెంబర్ బస్సుల్లో ఒకటో అరో తప్ప చాలా బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. పైగా ఒకటే కర్ణ కఠోరంగా మోగిపోతున్నాయి. దీంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సుల కింద జాయింట్ రాడ్ల నుంచి భరించలేని మోత వస్తోందని, బస్సు స్పీడ్ బ్రేకర్ల వద్ద దడేల్‌మని పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. పైగా డ్రైవర్లు కూడా ఇదేం కర్మరా బాబు అనుకుంటూ బస్సులు నడేపేస్తున్నారు.


బస్సులో పట్టుకునేందుకు రాడ్స్ లేకపోడంతో సీట్లు పట్టుకొని నిల్చొని ప్రయాణికులు


మైలవరం రూట్‌లో కొండపల్లి హెచ్‌పీ కంపెనీ వద్ద ఆగిన 350 బస్

బస్సు ఎక్కాలంటేనే భయం

బట్టపర్తి రవీంద్ర, జి.కొండూరు



మా రూట్‌లో 350 నంబరు బస్ ఎక్కాలంటే భయం. ఎక్కడాగిపోతుందో తెలియదు. పైగా భరించలేని శబ్దం. ఎప్పుడు దిగిపోదామా అనిపిస్తుంటుంది. కొత్త బస్సులు ఎప్పుడు వస్తాయో చూడాలి.

హైటెక్ బస్సులు అనవసరం

తిరుపతిరావు, గడ్డమణుగు



ఈ రూట్‌లో సిటీ బస్సులు తిప్పితే మంచిది. హైటెక్ బస్సులు సిటీ సర్వీసుగా 350కి తిప్పుతున్నారు. అందులో నిలబడాలంటే ఇబ్బందిగా ఉంది. పట్టుకునేందుకు ఏం లేకపోవడంతో సడన్ బ్రేక్ వేసినప్పుడు పిల్లలు, పెద్దలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మంచి బస్సులు నడపాలి.

ఆగిపోవడంతో అవస్థలు

పోతురాజు ఏసుదాసు, కొండపల్లి



బస్సులు ఎక్కడ పడితే అక్కడే ఆగిపోతున్నాయి. అర్జెంట్‌గా ఆఫీసుకు, లేదా ఇతర పనులకు వెళ్లేవారు ఈ బస్సులతో అనేక అవస్థలు పడుతున్నారు. మరో బస్సు వచ్చే వరకు అక్కడే ఉండి ఎక్కాల్సి వస్తుంది. అందులో ఖాళీ ఉండదు. ఇలా ఎక్కడ పడితే అక్కడ బస్సులు ఆగిపోవడం ఇబ్బందిగా ఉంది.


గన్నవరం విమానాశ్రయంలో చిరంజీవిని గజమాలతో సత్కరిస్తున్న జనసేన నేత చలమలశెట్టి రమేష్‌బాబు

ప్రముఖ సినీనటుడు చిరంజీవికి ఘనస్వాగతం

గన్నవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు చిరంజీవికి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే మంత్రి నారాయణ కుమార్తె శరణి రచించిన మైండ్‌సెట్ షిఫ్ట్ పుస్తకావిష్కరణలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి గురువారం చేరారు. జనసేన నేత చలమలశెట్టి రమేష్‌బాబు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.

జూన్ నుంచి ఎరువుల

డీలర్లకు కొత్త లైసెన్స్ విధానం

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల క్రయ విక్రయాల లైసెన్స్‌ల విధానంలో మార్పులు చేసినట్టు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. 2021 నుంచి అమలులో ఉన్న ఈ-ఆఫీస్ విధానం వచ్చే నెలతో రద్దు కానున్నట్టు చెప్పారు. వచ్చే జూన్ నుంచి ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఓఎల్ఎంఎస్) ప్రారంభమౌతుందన్నారు. ప్రస్తుత లైసెన్స్‌ల వివరాలను ఈ నెలాఖరులోపు కొత్త విధానంలో నమోదు చేయాలని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు.

జూనియర్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీల కొనసాగింపు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న 957 మందిని కొనసాగించేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 28 వరకు వారు కొనసాగుతారని తెలిపారు. మొత్తం ఏడాదిలో ఒక నెల 8 రోజులు బ్రేక్ ఉంటుందన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాల ప్రోత్సాహానికి కమిటీలు

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల్ని సమర్థంగా అమలు చేయడానికి, రాష్ట్రంలో 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో రాష్ట్ర స్థాయిలో సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు సవరించిన మార్గదర్శకాలతో ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నాబార్డు అధికారులు సభ్య కార్యదర్శులుగా ఉండే రాష్ట్ర కమిటీకి వ్యవసాయశాఖ డైరెక్టర్, జిల్లా కమిటీకి జిల్లా వ్యవసాయ అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో సమానంగా చూడాలని తెలిపింది. ఎఫ్‌పీవోలకు ఎరువుల సరఫరా, ఎఫ్‌పీవోల ఉత్పత్తులకు మార్కెటింగ్, విలువ జోడింపునకు మౌలిక సదుపాయలు కల్పించనున్నట్టు పేర్కొంది.

12 మద్యం షాపులకు రీనోటిఫికేషన్

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గతేడాది అమల్లోకి వచ్చిన మద్యం పాలసీలో మిగిలిపోయిన 12 మద్యం షాపుల వేలానికి ఎక్సైజ్ శాఖ గురువారం రీనోటిఫికేషన్ జారీ చేసింది. మే 3 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. మే 5న లాటరీ ద్వారా షాపులను కేటాయించనున్నట్లు తెలిపింది. గతంలో ప్రకటించిన మద్యం పాలసీ నిబంధనలే ఈ షాపులకూ వర్తిస్తాయి. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 30న నిర్వహించనున్న పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్టు సాంకేతిక విద్యా శాఖ, శిక్షణ బోర్డు గురువారం తెలిపింది. విద్యార్థులు ఏపీ పాలీసెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొంది. హాల్ టికెట్లు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్టు లేదా ఇతర ఆఫ్‌లైన్ మార్గాల్లో పంపబోమని స్పష్టం చేసింది. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాముకు పటిష్ఠ భద్రత: కలెక్టర్

కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును గురువారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందిస్తామన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, వై.రామయ్య (టీడీపీ), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి ఉన్నారు.

రగ్బీ క్రీడాకారులకు ప్రోత్సాహం

- కృష్ణాజిల్లా నూతన చైర్మన్ బాలకృష్ణమూర్తి

గన్నవరం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రగ్బీక్రీడపై ఆసక్తిగల క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అవసరమైన సహాయసహకారాలను అందజేస్తానని కృష్ణాజిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన మడుపల్లి బాలకృష్ణమూర్తి అన్నారు. గన్నవరంలో గురువారం నిర్వహించిన అభినందన సభలో ఆయన్ను పీడీలు ఘనంగా సత్కరించారు. రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తదనంతరం జరిగిన సభలో రగ్బీ క్రీడను బీ కేటగిరి నుంచి ఏ కేటగిరి మార్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, అందుకు కృషి చేసిన రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు టీజీ భరత్, రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైస్ చైర్మన్ జొన్నలగడ్డ సుధాకర్, కార్యవర్గ సభ్యుడు వేమూరి వేణు, కమిటీ సభ్యులు, వ్యాయామోపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

బీసెంట్ రోడ్‌లో అనధికార వ్యాపారులను గుర్తించండి

- లైసెన్స్ లేకుండా ఎంతమంది అమ్మకాలు జరుపుతున్నారు?
- అనుమతిచ్చిన ప్రాంతాలను వ్యక్తిగతంగా పరిశీలించండి
- పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయండి
- వీఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం
- విచారణ జూలై 16కి వాయిదా

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బీసెంట్ రోడ్డుతో పాటు నగరంలోని ఇతర రోడ్లలో వ్యాపారం చేసుకొనేందుకు ఎంతమంది వీధి వ్యాపారులకు అనుమతిచ్చారు? ఎంతమంది అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారో గుర్తించాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. వీధి వ్యాపారులు అమ్మకాలు జరుపుకొనేందుకు అనుమతిచ్చిన ప్రాంతాలను వ్యక్తిగతంగా పరిశీలించాలని కమిషనర్‌కు ఆదేశించింది. ప్రతీ జోన్‌లో ఎంతమందికి వీధివ్యాపారులకు లైసెన్స్‌లు జారీ చేశారు? రోజులో ఎన్ని గంటలు, ఏ సమయంలో వారు అమ్మకాలు జరిపేందుకు అనుమతిచ్చారు? తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషనర్‌ను ఆదేశించింది. ఈ అఫిడవిట్‌లో కార్యాచరణ ప్రణాళికను సైతం పొందుపర్చాలని ఆయనకు స్పష్టం చేసింది. విచారణను జులై 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. బీసెంట్ రోడ్డు మధ్యలో, ఇరువైపుల ఆక్రమించి చట్టవిరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులు, హాకర్లపై చర్యలు తీసుకొనేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించాలని కోరుతూ బీసెంట్ రోడ్ బిల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వెంకట విజయప్రసాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. వీధి వ్యాపారుల జీవనోపాధి రక్షణ, విక్రయాల నియంత్రణ చట్టంలోని చట్టనిబంధనలు అమలు చేసేలా కార్పొరేషన్ అధికారులను ఆదేశించాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది డి.హర్షవర్ధన్ వాదనలు వినిపించారు. వీధి వ్యాపారులు బీసెంట్ రోడ్డు మొత్తాన్ని ఆక్రమించారన్నారు. ఆ ప్రాంతంలో నివాసముండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ద్విచక్రవాహనాలు, పోలీసు వాహనాలు వెళ్లేందుకు కూడా కష్టంగా మారిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనం వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బీసెంట్ రోడ్డులో వీధి వ్యాపారుల ఆక్రమణలపై తీసిన ఫొటోలను కోర్టు ముందుంచారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ తరఫు న్యాయవాది ఏఎస్‌సీ బోస్ వాదనలు వినిపిస్తూ నగరంలో పలుజోన్లు ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు కార్పొరేషన్ లైసెన్స్‌లు ఇచ్చిందన్నారు. గ్రీన్‌జోన్‌లో ఎవరైనా అమ్మకాలు జరుపుకోవచ్చని, అంబర్ జోన్‌లో లైసెన్స్ పొందినవారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. రెడ్ జోన్‌లో వీధి వ్యాపారులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. బీసెంట్ రోడ్డులో మొత్తం 150 మంది వీధి వ్యాపారులకు లైసెన్స్‌లు ఇచ్చామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వీధి వ్యాపారులు అమ్మకాలు జరుపుకొనేందుకు అనుమతిచ్చిన ప్రాంతాలను వ్యక్తిగతంగా పరిశీలించాని కమిషనర్‌ను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.


జి.కొండూరు వద్ద జాతీయ రహదారిపై తెల్లవారు జామున లారీలు ఆపి డ్రైవర్లను రీఫ్రెష్ చేసేందుకు నీళ్ల బాటిల్ అందజేస్తున్న కానిస్టేబుల్

స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో..!

- ప్రమాదాలను తగ్గించేందుకు ఈ విధానం ఎంతో మేలు
- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు

గుణదల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వాటి ఆపాలంటే స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో విధానం పాటిస్తే సరిపోతుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. రాత్రివేళల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అందులోనూ తెల్లవారుజామున మరింత ఎక్కువగా జరుగుతున్నాయని సీపీ తెలిపారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ఎన్టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. తెల్లవారు జామున జాతీయ రహదారులపై భారీ వాహనాలను ఆపి డ్రైవర్లకు రిఫ్రెష్ అవ్వడానికి నీరందించి ముఖం కడిగించడంతో నిద్రమత్తు పోతుందన్నారు. తెల్లవారు జామున నిద్రమత్తులో ఉండి చాలామంది డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. తెల్లవారు జామున 3 నుంచి 5 గంటల సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అందుకే జాతీయ రహదారులపై ప్రయోగాత్మకంగా గురువారం నుంచి ఈ విధానాన్ని ప్రారంభించినట్టు ఆయన తెలిపారు.

టూరిజం ప్యాకేజీలపై

అవగాహన కల్పించాలి

- కరపత్రాలను ఆకర్షణీయంగా రూపొందించండి
- గైడ్ల నియామకం, శిక్షణపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- కలెక్టర్ లక్ష్మీశ


అధికారులతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేక్రమంలో పర్యాటకులకు మధురానుభూతి మిగిల్చేలా రూపొందించిన ప్రత్యేక ప్యాకేజీలపై పర్యాటకులకు అవగాహన కల్పించాలని, ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆకర్షణీయంగా రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో లక్ష్మీశ, టూరిజం ప్యాకేజీపై పర్యాటక, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) అధికారులతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు, మూడు, నాలుగు రోజుల పర్యాటక ప్యాకేజీల వివరాలతో రూపొందించిన కరపత్రాలను పరిశీలించారు. ప్యాకేజీల కింద సందర్శనకు వీలయ్యే ప్రాంతాలు, ప్యాకేజీల ధరలు పర్యాటలకు కల్పించే సౌకర్యాలతో రూపొందించిన కరపత్రాల్లో చేయాల్సిన మార్పుచేర్పులపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్లు, ట్రావెల్ తదితర విభాగాల అసోసియేషన్లతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాలతో పలు దఫాల్లో సమావేశాలు నిర్వహించి రూపొందించిన పర్యాటక ప్యాకేజీలపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రచార సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రదేశాల విశిష్టతను పర్యాటకులకు వివరించేందుకు వీలుగా గైడ్లను గుర్తించాలని, వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లా పర్యాటక అధికారి ఏ శిల్ప, ఏపీటీడీసీ-సీఆర్‌వో సుహాసిని పాల్గొన్నారు.



విద్యార్థులకు కలెక్టర్ సత్కారం

కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షల్లో జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలోని విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలో సత్కరించారు. వీరిలో మైలవరం జడ్పీ స్కూల్‌కు చెందిన పసుపులేటి నందిని (593), విజయవాడలోని ఎస్‌టీబీ హైస్కూల్‌కు చెందిన జీ సాయిచరణ్ (593), ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కే ప్రణీత్‌కుమార్ (592), నవోదయ హైస్కూల్‌కు చెందిన కొల్లి స్వాతి (598) ఉన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.

అన్న చేతిలో తమ్ముడు హతం

వత్సవాయి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తమ్ముడిపై అన్న దాడి చేయడంతో తమ్ముడు మృతి చెందిన ఘటన కాకరవాయి గ్రామంలో జరిగింది. బెజ్జం ముక్కంటి - భాగ్యమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. పెద్ద కుమారుడు శ్రీనివాసరావు గతంలోనే చనిపోయాడు. రెండో కుమారుడు కొండ, చివరి కుమారుడు అర్జునుడు. వీరు పక్కపక్క పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. వీరిమధ్య తరచూ వివాదాలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా కొండ, అర్జున్ మధ్య వివాదం చోటు చేసుకోవడంతో తమ్ముడు అర్జున్‌పై అన్న కొండ క్రికెట్ స్టంప్‌తో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అర్జున్ (28)ను బంధువులు జగ్గయ్యపేటకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలిస్తుంగా మార్గమధ్యలో మృతి చెందాడు. అర్జున్ సోదరి కె.రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వత్సవాయి పోలీసులు తెలిపారు.

యాంటీ నార్కోటిక్, ఈగల్ టీం

బృందాల విస్తృత తనిఖీలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షణ చర్యల్లో భాగంగా విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఏసీపీలు ఎస్.కిరణ్‌కుమార్, కె.లతాకుమారి పర్యవేక్షణలో యాంటీ నార్కోటిక్, ఈగల్ టీమ్స్ బుధవారం రాత్రి నగరంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 45 మంది అనుమానిత వ్యక్తులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఓపెన్ ప్రదేశాల్లో మద్యం సేవించిన 40 మందిని అదుపులోకి తీసుకొని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు. లేడీస్ హాస్టల్స్ సమీపంలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా మద్యం, గంజాయి ఇతర వస్తువుల రవాణాను నియంత్రించడమే తనిఖీల ముఖ్యోద్దేశమన్నారు.

పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలి

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్
- విజయవాడ నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన, పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం

విజయవాడ/మొగల్రాజపురం, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): భారతదేశంపై ఏదో ఒక విధంగా దాడులు చేస్తూ అమాయకుల ప్రాణాలు తీస్తున్న ముష్కరులకు, వారికి అండగా ఉంటున్న పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పి పహల్గావ్ మృతులకు న్యాయం చేయాలని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ కోరారు. పహల్గావ్‌లో జరిగిన మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కోసం, ముష్కరుల దాడికి నిరసనగా మైనార్టీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం మొగల్రాజపురం మదర్ థెరిసా జంక్షన్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన, పాకిస్తాన్ దిష్టిబొమ్మ దగ్ధం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దాయాది దేశమైన పాకిస్తాన్ రచించిన విద్వేషపూరిత వ్యూహంలో అమాయకులైన భారత ముస్లింలు పావులుగా మారొద్దని కోరారు. మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎండీ ఫారూక్ షుబ్లీ మాట్లాడుతూ అత్యంత దారుణమైన పహల్గావ్ సంఘటనను కులమతాలకు అతీతంగా ముక్తకంఠంగా ఖండిస్తున్నామన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రమూకలపై భారత ప్రభుత్వం ప్రతీకార చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈఘటనలో కాల్చింది ఒక ముస్లిం, కాపాడేందుకు ప్రయత్నించి ప్రాణాలర్పించింది కూడా ఒక ముస్లిమేనని అన్నారు. అనంతరం పాకిస్తాన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించిన అనంతరం పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నేతలు మౌలానా హుస్సేన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎండీ సలీంపాషా, మొయిన్ పాల్గొన్నారు.


పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మంత్రి ఫరూక్, షుబ్లీ, తదితరులు

విద్యార్థి వీసాల రద్దుకు బ్రేకులు!

- 133 మంది సెవిస్ రికార్డుల పునరుద్ధరణకు కోర్టు ఆదేశం
- వీరిలో ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే
- హెచ్-1బీ వీసాకు చిరునామా, బయోమెట్రిక్ తప్పనిసరి
- రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ కోరుతున్న యూఎస్ అధికారులు



వాషింగ్టన్/ న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అమెరికాలో స్టూడెంట్ వీసాలు రద్దయి ఇబ్బందులు పడుతున్న విదేశీ విద్యార్థులకు న్యాయస్థానం ఊరట కల్పించింది. మొత్తం 133 మంది విద్యార్థుల సెవిస్ (స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) రికార్డులను తాత్కాలికంగా పునరుద్ధరించాలని జార్జియాలోని ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ట్రంప్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. వీరిలో ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే ఉన్నారు. అమెరికా విదేశాంగ శాఖ, ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) అధికారులు తమ వీసాతో పాటు సెవిస్ రికార్డులు రద్దు చేయడంపై వీరు కోర్టులో దావా వేశారు. చట్టాలను ఉల్లంఘించిన ఘటనలతో వీరికి సంబంధం ఉందని ప్రభుత్వ సంస్థలు చెబుతున్నప్పటికీ వీరిలో చాలమందికి ఎలాంటి నేర చరిత్ర లేదు. తీవ్ర నేరాలు చేయకపోయినా విదేశీ విద్యార్థుల వీసాలు. సెవిస్ రికార్డులను రద్దు చేయడం అన్యాయమని, ఈ నిర్ణయంతో వారంతా చట్టపరమైన హోదాను కోల్పోయారని ఇమిగ్రేషన్ న్యాయవాదులు వాదించారు. కాగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో 'క్యాచ్ అండ్ రివోక్' కార్యక్రమం కింద చర్యలకు ఆదేశించిన తర్వాత విద్యార్థి వీసాలు రద్దు చేయడం మొదలైంది. దీనిలో భాగంగా స్టూడెంట్ వీసాదారులపై ఏఐ సాయంతో నిఘా పెట్టడంత పాటు వారి సోషల్ మీడియా ఖాతాలను అధికారులు జల్లెడ పడుతున్నారు. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దు చేసినట్లు రూబియో గతంలో ప్రకటించారు.

4,736 మంది సెవిస్ రికార్డులు రద్దు

అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్(ఏఐఎల్ఏ) నివేదిక ప్రకారం.. 2025 జనవరి 20 నుంచి మొత్తం 4,736 మంది సెవిస్ రికార్డులను ఐసీఈ రద్దు చేసింది. ఇందులో 327 మందికి సంబంధించిన సమగ్ర నివేదికలు తమకు అందాయని, వారిలో దాదాపు 50శాతం మంది భారత్‌కు చెందిన విద్యార్థులేనని ఏఐఎల్ఏ ప్రకటించింది. బాధితుల్లో చైనా, నేపాల్, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ విద్యార్థులు కూడా ఉన్నారని పేర్కొంది. కాగా, అమెరికాలో ఉన్న భారతీయ విద్యార్థుల్లో చాలామంది ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)లో ఉన్నారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. స్టెమ్ గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండే అవకాశం ఉంది. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ పని అనుభవం వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలతో ఓపీటీ హోదాను కోల్పోవడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ట్రాఫిక్ నిబంధనలు, వర్సిటీ నిబంధనల ఉల్లంఘనల వంటి చిన్న చిన్న కారణాలతో చాలామంది విద్యార్థుల వీసాలు రద్దు చేస్తున్నారని ఏఐఎల్ఏ నివేదిక వెల్లడించింది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదవడంతో అతడి వీసా రద్దు చేశారని తెలిపింది. మొత్తం 327 మంది విద్యార్థుల్లో ఇద్దరికి మాత్రమే రాజకీయ కార్యకలాపాలతో సంబంధం ఉన్నట్లు ప్రస్తావించారని పేర్కొంది. ప్రభుత్వ చర్యలను ఇమిగ్రేషన్ న్యాయవాదులు ఖండిస్తున్నారు. బాధిత విద్యార్థులకు అమెరికా విదేశాంగ శాఖ, ఐసీఈ జారీ చేసిన లేఖల్లో వీసా రద్దుకు సంబంధించి నిర్దిష్ట నియమ నిబంధనలేమీ లేవని స్పష్టం చేస్తున్నారు. అమెరికాలో నిరసనలు తెలపడం చట్టవిరుద్ధం ఏమీ కాదని, అస్పష్టమైన ఆరోపణల కారణంగా విద్యార్థులు సర్వం కోల్పోవాల్సి వస్తుందని ఓ న్యాయవాది ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్-1బీ వీసాల్లో కొత్త చిక్కులు

అమెరికాలో హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు కొత్త చిక్కులు మొదలయ్యాయి. వీసా ముంజూరు కోసం అభ్యర్థుల ఇంటి చిరునామా, బయోమెట్రిక్ డేటాను అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) అధికారులు కోరుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. హెచ్-1బీ వీసా కేసుల్లో ఇమిగ్రేషన్ అధికారులు రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ)ను కోరుతున్నారు. దీనిలో భాగంగా దరఖాస్తుదారులు వారి ఇంటి చిరునామా, బయోమెట్రిక్ డేటాతో పాటు వ్యక్తిగత సమాచారం కూడా సమర్పించాల్సి ఉంటుంది. అయితే దీని వెనుక యూఎస్‌సీఐఎస్ ఉద్దేశం ఏమిటనే సందేహాలను ఇమిగ్రేషన్ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్-160 ఫాం సమర్పిస్తేనే వీసా ఇంటర్వ్యూ

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసేవారు ఇకపై ఇంటర్వ్యూ స్లాట్ బుక్ చేసుకోవడానికి ముందే డీఎస్-160 ఫాంను సమర్పించాలి. ఈ మేరకు ఆన్‌లైన్ ఫాం, షెడ్యూల్ ప్రక్రియలో అమెరికా విదేశాంగ శాఖ మార్పులు చేసింది. పలు దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో ఈ నిబంధన అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 1 తర్వాత వీసా ఇంటర్వ్యూకు హాజరయ్యే వారందరికీ ఇది వర్తిస్తుంది. దీని ప్రకారం దరఖాస్తుదారులు ధ్రువీకరించిన డీఎస్-160 ఫాం గానీ 'ఏఏ'తో ప్రారంభమయ్యే బార్ కోడ్ నంబరును గానీ ఇంటర్వ్యూకు తీసుకురావాల్సి ఉంటుంది. అమెరికాలోకి తాత్కాలిక ప్రవేశానికి వీసా కోసం దరఖాస్తు చేసుకొనే వారందరూ డీఎస్-160 ఆన్‌లైన్ నాన్-ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తు పూర్తి చేయాల్సి ఉంటుంది. కొత్త నిబంధన ప్రకారం అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేయడానికి ముందే ఈ ఫాంను నింపి, సబ్మిట్ చేయాలి. దీనిద్వారా దరఖాస్తుదారులకు సంబంధించిన కచ్చితమైన, సమగ్ర సమాచారం కాన్సులర్ అధికారులకు అందుబాటులో ఉంటుందని విదేశాంగ శాఖ పేర్కొంది. బీ1/బీ2, హెచ్-1బీ, ఎఫ్-1, జే-1 తదితర వీసా కేటగిరీలకు కొత్త డీఎస్-160 ఫాం నిబంధనలు వర్తిస్తాయి.

హిండెన్‌బర్గ్‌తో రాహుల్‌కు సంబంధాలు?

- అదానీ-మోదీలే లక్ష్యంగా సహకారం
- మొస్సాద్ ఆపరేషన్‌లో బహిర్గతమైందన్న స్పుత్నిక్ ఇండియా..
- ఆ నివేదికను ఉటంకిస్తూ 'మనీకంట్రోల్' కథనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అదానీ గ్రూప్‌పై గతంలో సంచలన ఆరోపణలు చేసిన అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌తో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సంబంధాలపై ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ఆధారాలు సేకరించిందని స్పుత్నిక్ ఇండియా పేర్కొంది. రాహుల్ సన్నిహితుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ శ్యామ్ పిట్రోడా హోం సర్వర్లను లక్ష్యంగా చేసుకొని మొస్సాద్ ఓ రహస్య ఆపరేషన్ నిర్వహించినట్లు తన నివేదికలో వెల్లడించింది. అదానీ, ప్రధాని మోదీలను అణగదొక్కాలనే లక్ష్యంతో రాహుల్ హిండెన్‌బర్గ్‌తో సంబంధాలు పెట్టుకున్నట్లు బహిర్గతమైనట్లు వివరించింది. వ్యాపార వార్తలను అందించే ప్రముఖ వెబ్‌సైట్ 'మనీకంట్రోల్' తన కథనంలో ఈ విషయాల్ని వెల్లడించింది. అలాగే వీటిని తాము ధ్రువీకరించట్లేదని కూడా స్పష్టం చేసింది. కాగా, అదానీ గ్రూప్ తన షేర్ల ధరలను కృత్రిమంగా పెంచిందని, అకౌంటింగ్ మోసాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదిక సంచలనం రేపిన సంగతి తెలిసిందే.

చిత్రజ్యోతి
SINCE 1965

కొత్త దర్శకుడితో గోపీచంద్



గోపీచంద్ హీరోగా సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఇటీవలే ఓ సినిమా ప్రారంభమైన విషయం తెలిసిందే. తాజాగా గోపీచంద్ హీరోగా నటించబోతున్న మరో చిత్రం గురువారం లాంఛనంగా ప్రారంభమైంది. సాయి కుమార్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. మలయాళ నటి మీనాక్షి దినేశ్ హీరోయిన్. థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

కొత్తవారికి అవకాశం కల్పించాలనే..



'కొత్తవాళ్లకు ఒక వేదికను ఏర్పాటు చేయాలనేది నా కల. అది ఎప్పటి నుంచో ఉంది. అందుకే సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టాను. నాకు సంపాదన మీద దృష్టి లేదు' అని అన్నారు దర్శకుడు నక్కిన త్రినాధరావు. ఆయన నిర్మాణంలో వస్తున్న తొలి చిత్రం 'చౌర్యపాఠం'. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లు. నిఖిల్ గొల్లమాని తెరకెక్కించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా త్రినాధరావు మీడియాతో మాట్లాడుతూ 'ఓ చిలిపి దొంగతనం కేసు గురించి విన్నప్పుడు ఆసక్తిగా అనిపించింది. ఈ కథతో సినిమా చేయమని కార్తిక్‌ని అడిగితే సరే అన్నాడు. అలా ఈ కథ పట్టాలెక్కింది. అయితే ఆ కేసును స్ఫూర్తిగా తీసుకొని పూర్తి సినిమాటిక్‌గా తెరకెక్కించాం. మా ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తున్న తొలి చిత్రం గనుక నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడలేదు. ఈ చిత్రంలో ప్రతి ఒక్కరు అద్భుతంగా నటించారు. మూవీలో క్యారెక్టర్స్ తప్ప ఆర్టిస్టులు కనిపించరు. అంత సహజంగా పాత్రల్లో ఒదిగిపోయారు. ఇందులోని అన్ని పాటలు హిట్ అయ్యాయి' అని తెలిపారు.

కొరగజ్జ దేవత కథ



కర్నాటక, కేరళలోని కరావళి ప్రాంతాల్లో, ముంబైలోని కొన్ని ప్రదేశాల్లో పూజలు అందుకొనే ప్రధాన దేవత కొరగజ్జ కథ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'కొరగజ్జ'. సుధీర్ అత్తవర్ దర్శకుడు. నాటి ఆచారాలు, సంప్రదాయాలను అర్థం చేసుకుని, కొంత పరిశోధన చేసి ఈ చిత్రానికి పాటలు స్వరపరిచారు సంగీత దర్శకుడు గోపీసుందర్. సినిమాలో ఆరు పాటలు ఉంటాయనీ, వాటిని వివిధ శైలి, భాషల్లో స్వరపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ పాటలకు దర్శకుడు సుధీర్ అత్తవర్ సాహిత్యాన్ని అందించారు.

ఇన్ ప్రోగ్రెస్

హారర్.. థ్రిల్లర్



'శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట', 'నివాసి' చిత్రాల తర్వాత గాయత్రి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'కాళంకి భైరవడు'. హారర్, థ్రిల్లర్ జోనర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో రాజశేఖర్ వర్మ, పూజా కిరణ్ జంటగా నటిస్తున్నారు. హరిహరన్ దర్శకుడు. దాదాపు షూటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకొంటున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ హీరో డాక్టర్ రాజశేఖర్ లాంచ్ చేశారు. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు కె.ఎన్.రావు, శ్రీనివాసరావు ఆర్ చెప్పారు.

భారతీయత నా రక్తంలోనే ఉంది

\- ఇమాన్వీ



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో 'ఫౌజీ' హీరోయిన్ ఇమాన్వీ ఇస్మాయిల్ కుటుంబం పాకిస్థాన్‌కు చెందినదని, ఆమె తండ్రి గతంలో పాకిస్థాన్ సైన్యంలో పనిచేశారని, ఇమాన్వీని 'ఫౌజీ' నుంచి తొలగించాలంటూ నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇమాన్వీ స్పందించారు. తాను పాకిస్థాన్ అమ్మాయిని కాదంటూ సుదీర్ఘ వివరణను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'నా పైనా, నా కుటుంబ నేపథ్యంపైనా జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండించాలనుకుంటున్నాను. మా కుటుంబంలో ఏ ఒక్కరికీ పాకిస్థాన్ సైన్యంతో ఎలాంటి సంబంధం లేదు. మీడియా నిజానిజాలు తెలుసుకోకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం నన్ను నిరుత్సాహానికి గురిచేసింది. నేను ఇండియన్ అమెరికన్‌ని అని గర్వంగా చెబుతున్నా. హిందీ, తెలుగు, గుజరాతి, ఆంగ్ల భాషలు మాట్లాడగలను. లాస్ ఏంజెల్స్‌లో జన్మించాను. మా తల్లిదండ్రులు అమెరికాకు వలస వచ్చారు. అక్కడే యూనివర్సిటీ విద్యను పూర్తి చేశాను. నటిగా, కొరియోగ్రాఫర్‌గా, డ్యాన్సర్‌గా రాణిస్తున్నాను. ఈ రంగంలో చాలా కాలం పనిచేసిన తర్వాత భారత చిత్ర పరిశ్రమలో అవకాశాలు రావడం గర్వంగా భావిస్తున్నాను. సినిమా నా వ్యక్తిత్వంపై గొప్ప ప్రభావం చూపించింది. భారతీయత, భారత సంస్కృతి నా రక్తంలోనే ఉంది. సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించండి' అని ఇమాన్వీ పేర్కొన్నారు.

'అబిర్ గులాల్' పై నిషేధం?



పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్, వాణీకపూర్ జంటగా నటించిన బాలీవుడ్ చిత్రం 'అబిర్ గులాల్'ని భారత్‌లో విడుదల కాకుండా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నిషేధించినట్లు సమాచారం. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మే 9న సినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించగానే నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఈ చిత్రాన్ని బ్యాన్ చేయాలంటూ డిమాండ్ చేశారు. దాడి జరిగిన రోజునే ప్రమోషన్‌ను ప్రారంభించడంపై వాణీకపూర్‌పై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, ఈ సినిమాలోని పాటలను యూట్యూబ్(ఇండియా) నుంచి తొలగించారు.

శివలింగ మర్మం!



శివుడి సాకార ఆరాధనను లింగ రూపంలో నిర్వహించడం అనాది సంప్రదాయం. కొన్ని వేల ఏళ్ల నుంచి శివలింగాన్ని ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే వారికి మార్గదర్శిగా భావించి అనేక ఆధ్యాత్మిక ప్రక్రియలను, ధ్యాన పద్ధతులను మన పూర్వీకులు అభివృద్ధి చేశారు. వీటిని పరిశీలిస్తే శివలింగం ఆకారం వెనుక ఒక మార్మికత దాగి ఉందనే విషయం మనకు అర్థమవుతుంది.

శివలింగ సమీపంలో 'ఓం నమఃశివాయ" అనే మూల మంత్రాన్ని జపం చేస్తుంటే ఒక శక్తివలయం ఏర్పడుతుందని, తద్వారా ధ్యానం చేసే వ్యక్తి దృష్టి కోణంలో మార్పు వస్తుందని 'శివపురాణం' లాంటి ప్రాచీన గ్రంథాలు వెల్లడిస్తున్నాయి. జ్యోతిర్లింగ దేవాలయాలలో ఉండే శివలింగాలకు అనేక ప్రత్యేకతలుంటాయి. ఇక్కడ బలమైన శక్తి వలయాలు ఏర్పడతాయని, వీటి వల్ల మానవులకు మేలు జరుగుతుందని పూర్వ గ్రంథకర్తలు పేర్కొన్నారు. ఇక మనకు రాగి శివలింగాలు కంబోడియా, థాయ్‌లాండ్, వియత్నాంలలో ఎక్కువ కనిపిస్తాయి. రాగి ద్వారా శక్తి ప్రసారం జరుగుతుందని మనకు తెలుసు. ఈ రాగి లింగాలను నీటిలో పెట్టినప్పుడు వాటి నుంచి కొంత శక్తి ప్రసారమవుతుంది. 'కుబ్జిక తంత్ర', 'రుద్ర యమల తంత్ర' గ్రంథాలలో ఈ రాగి లింగాల విశిష్టత గురించి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో స్ఫటిక లింగాలు కూడా మనం చూస్తాం. అలాగే

- చిదంబరంలో ఉన్న నటరాజ స్వామి దేవాలయానికి అనేక ప్రత్యేకతలున్నాయి. దీని నిర్మాణ శైలి శివతత్త్వాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది.

- హిందూ సంప్రదాయంలో శ్రీ యంత్రానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. దీనిని శివలింగంతో కలిపి కానీ, శివలింగ సమీపంలో కానీ ప్రతిష్ఠించినప్పుడు - ఆ ప్రాంతంలో శక్తి ప్రతిష్టంభన జరుగుతుందని.. దానిని మానవ అభ్యున్నతికి ఉపయోగించుకోవచ్చని భావిస్తారు. శ్రీశైల క్షేత్రంలో ఈ తరహా ప్రతిష్ఠలను మనం గమనించవచ్చు.

కొన్ని తంత్ర శాస్త్రాలలో పాదరసంతో చేసిన శివలింగాల ప్రస్తావన కూడా ఉంది. ఈ శివలింగాలన్నీ ఈ విశ్వంలో నిబిడీకృతమై ఉన్న శక్తిని ఒక ధారలా చేసి... వాటిని ఈ భౌతిక ప్రపంచంలోని వ్యక్తులతో అనుసంధానించడానికి సహకరిస్తాయని శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

ఋషులతో...

మన పూర్వ గ్రంథాలు, శాసనాలు.. ఇతర ఆధారాల ద్వారా చూసినప్పుడు- కొందరు ఋషులకు శివలింగాలతో ప్రత్యేక సంబంధం ఉన్నట్టు తెలుస్తుంది. ఉదాహరణకు అగస్త్య మహామునికి శివలింగాలకు ప్రత్యేకమైన సంబంధం ఉంది. ప్రస్తుత దక్షిణ భారత దేశం నుంచి అగస్త్యుడు కొన్ని ప్రత్యేకమైన శివలింగాలను తీసుకొని దక్షిణాసియాకు వెళ్లాడనేది కూడా పూర్వ రచనల ద్వారా తెలుస్తుంది. ఈ ఒక్క ఆధారమే కాకుండా... ప్రస్తుతం వియత్నాం, కంబోడియా, థాయ్‌లాండ్‌లలోని అనేక శాసనాలలో అగస్త్య మహాముని ప్రస్తావన ఉంది. అగస్త్యుడు దక్షిణ భారత దేశం నుంచి తీసుకువెళ్లాడని చెబుతున్న కొన్ని శివలింగాలను మనం వియత్నాంలోని మ్యూజియంలలో కూడా చూడవచ్చు. ఇదే విధంగా 'మహాభారతం'లో - మార్కండేయ మహర్షి శివలింగం దగ్గర ధ్యానం చేస్తుంటే మహాప్రళయం వస్తుందనే సంకేతాలు వచ్చాయని ఉంది.



లిడియా లక్ష్మి
బ్రహ్మసూత్ర లింగ పరిశోధకురాలు

పర్వదినం



వసంత ఋతువులో చైత్ర, వైశాఖ మాసాలు అక్షయుడైన మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనవి. లక్ష్మీసమేతుడైన విష్ణువును ఈ మాసాలలో... ప్రధానంగా వైశాఖ శుద్ధ తదియనాడు భక్తి శ్రద్ధలతో పూజించడం శ్రేయోదాయకమని, ఆ రోజు చేసే వ్రతమైనా, జపమైనా, దానాలైనా అక్షయమైన ఫలితాలను ఇస్తాయని 'భవిష్యోత్తర పురాణం' చెబుతోంది. ఆ పవిత్రమైన రోజునే 'అక్షయ తృతీయ'గా నిర్వహించుకోవడం సంప్రదాయంగా స్థిరపడింది.

అలా ఆచరిస్తే
ఫలాలు అక్షయం

'అక్షయం' అంటే 'నాశనం లేనిది', 'తరుగు లేనిది' అని అర్థం. అక్షయ తృతీయ... త్రేతాయుగాదిగా, పరశురామ జయంతిగా, బలరామ జయంతిగా ప్రసిద్ధి చెందింది.ఎన్నో పురాణ గాథలు ఈ పవిత్ర దినంతో ముడిపడి ఉన్నాయి.భాగవత పురాణంలో హిరణ్యాక్ష, హిరణ్య కశిపుల గాథ విశేషమైనది. ఆ సోదరులు ఇరువురు విష్ణు ద్వేషులు. వారిని సంహరించడానికి వరాహ, నారసింహ అవతారాలను శ్రీహరి దాల్చవలసి వచ్చింది. వరాహావతారంలో హిరణాక్షుడిని శ్రీహరి వధించాడు. హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదుడు తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే నారాయణ భక్తుడు. లోకకంటకుడై, కుమారుణ్ణి సైతం ఎన్నో కష్టాలకు గురిచేసి, చంపాలని ప్రయత్నించిన హిరణ్యకశిపుణ్ణి నృసింహావతారంలో శ్రీహరి సంహరించాడు. ఉగ్రరూపుడైన నరహరి... ప్రహ్లాదుడి కోరికమేరకు శాంతించాడు. వరాన్ని కోరుకోమన్నాడు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులను వధించిన వరాహ, నారసింహ రూపాలలో... లక్ష్మీదేవితో కలిసి దర్శనం ఇవ్వాల్సిందిగా ప్రహ్లాదుడు ఆయనను వేడుకున్నాడు. అప్పుడు ఆ రెండు రూపాలను జోడించి, సతీ సమేతుడై... శ్రీ వరాహ లక్ష్మీ నారసింహుడిగా... శాంత వదనంతో ప్రహ్లాదుడి ముందు శ్రీహరి సాక్షాత్కరించాడు. సింహాచలంలో వెలిశాడు. ఆ రోజు అక్షయ తృతీయ.

సింహగిరిపై చందనోత్సవం

ప్రహ్లాదుడి అనంతరం స్వామి విగ్రహానికి పూజాదికాలు లేక మరుగునపడింది. దానిపై పుట్ట పెరిగింది. కొంతకాలం తరువాత... షట్చక్రవర్తులలో



ఒకరైన పురూరవుడు... ఊర్వశితో కలిసి విహరిస్తూ, సింహగిరిపై విశ్రమించాడు. అతనికి స్వామి కలలో కనిపించి... తన విగ్రహాన్ని వెలికి తీసి, ఆలయం నిర్మించాలని ఆదేశించాడు. మరుసటిరోజు ఉదయం పూరురవుడు ఆ ప్రాంతంలోని పుట్టను తొలగించి, స్వామిని బయటకు తీసి, క్షీరంతో అభిషేకించి, పూజలు చేశాడు. ఆ రోజు వైశాఖ శుద్ధ తదియ. భక్తులకు ఏడాదిలో ఒక రోజు తన నిజ రూపాన్ని దర్శనం చేసుకొనే వీలు కల్పించాలని, విగిలిన రోజుల్లో... తన విగ్రహం దొరికిన పుట్ట బరువుకు సమానమైన చందనాన్ని తన విగ్రహానికి పూయాలని పురూరవుడికి స్వామి ఆదేశాన్ని ఇచ్చాడు. సింహగిరీశుడు ఆవిర్భవించిన ఆ రోజున సింహాచలంలో చందనోత్సవం జరుగుతుంది. ఆ రోజున స్వామి నిజరూపంలో కనిపిస్తారు. ఆ తరువాత... చందనాన్ని వైశాఖ శుద్ధ తదియ, వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో... నాలుగు విడతలుగా పూస్తారు. ఏడాది పొడవునా సింహగిరీశుడు లింగాకారంలో భక్తులకు దర్శనమిస్తారు.

ఇదే రోజున పూరీలో జగన్నాథ, సుభద్ర, బలభద్రుల ఆలయ సంప్రోక్షణ, ఆ తరువాత చందనోత్సవం జరుగుతాయి. ఆషాఢ శుద్ధ విదియనాడు నిర్వహించే రథోత్సవం నిమిత్తం... ఆ ముగ్గురు మూర్తులకు మూడు రథాలు నిర్మించడానికి అంకురార్పణ చేస్తారు. కాగా, శ్రీకృష్ణుడి ఆదేశం మేరకు సూర్యుణ్ణి ధర్మరాజు ప్రార్థించి అక్షయపాత్రను పొందడం, అర్జునుడు అక్షయ తూణీరాలను పొందడం, విశ్వామిత్రుడి ద్వారా సకల విద్యలతో పాటు అక్షయ తూణీరాలను అందుకోవడం లాంటి కథలు కూడా అక్షయ తృతీయతో ముడిపడి వినిపిస్తూ ఉంటాయి.

ఎన్నెన్నో విశ్వాసాలు...

అక్షయ తృతీయను అత్యంత శుభప్రదమైన రోజుగా పూర్వులు పేర్కొన్నారు. ఈ రోజు చేసే భక్తి శ్రద్ధలతో ఆచరించే ఏ పుణ్యకార్యమైన అనంతమైన పుణ్యఫలాలను ఇస్తుందన్న కారణంగానే పూర్వ ఋషులు ఈ పేరు పెట్టారని పెద్దలు చెబుతారు. కొత్త కార్యక్రమాలను ప్రారంభించడానికి అత్యంత పవిత్రమైనది భావిస్తారు. గృహిణులు వీసమెత్తు బంగారాన్నైనా కొని, లక్ష్మీదేవి ముందు ఉంచి పూజిస్తే... వారి సంపద అక్షయం అవుతుందనే నమ్మకం ఉత్తర భారతదేశంలో ఉంది. అది ఇపుడు దేశమంతటా వ్యాపించింది. ఈ రోజు లక్ష్మీ నారాయణులను, గౌరీ శంకరులను అర్చిస్తే త్వరగా వివాహం అవుతుందనే విశ్వాసం కూడా ఉంది. అలాగే అక్షయ తృతీయ రోజున సంపద్గౌరీ వ్రతాన్ని ఆచరిస్తే... సౌభాగ్యం, సంపదలు లభిస్తాయనేది పురాణ వచనం. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులను ఈ రోజున ప్రారంభిస్తారు. దీనివల్ల ఫలసాయం సమృద్ధిగా లభిస్తుందనే నమ్మకం ఉంది.

• ఆయపిళ్ళ రాజపాప



చింతన

ఆ తత్త్వం ఊహాతీతం

శివతత్త్వం నిగూఢమైనది, ఊహాతీతమైనది. దాన్ని పూర్తిగా, లోతుగా అర్థం చేసుకోవడం సులభం కాదు. బ్రహ్మదేవుడు సృష్టిస్తాడు, విష్ణువు నడిపిస్తాడు. శివుడు లయం చేసుకుంటాడు. 'లయం చేసుకోవడం' అంటే ముక్తిని ప్రసాదించడం. ఆ ముక్తి కోసమే మునులు నిరంతరం తపస్సు చేస్తారు. ఆదిదేవుడు చాలా అమాయకుడు. భక్తులు అడిగినవన్నీ... అర్హత కూడా చూడకుండా ఇచ్చేస్తూ ఉంటాడు. దాన్ని సజ్జనులు ముక్తిని పొందడానికి ఉపయోగించుకుంటారు. దుర్మార్గులు దాన్ని స్వలాభం కోసం వాడుకొని... వికృత చేష్టలు, చెడ్డ పనులు చేస్తూ, విలాసాలలో గడిపేస్తారు. శంకరుడు త్యాగశీలి. అందుకే క్షీరసాగర మథనంలో పుట్టిన హాలాహలాన్ని స్వీకరించి, తన గళంలో బంధించాడు. మహావిష్ణువేమో అతిలోక సౌందర్యవతి, సంపద స్వరూపమైన లక్ష్మీదేవిని స్వీకరించాడు.

నిరాడంబరుడు...

లోకాలను ఏలే విశ్వనాథుడికి తలపై కిరీటం కూడా ఉండదు. ఒంటికి బూడిద రాసుకొని, పులిచర్మాన్ని వస్త్రంగా ధరించి, ఎద్దును వాహనంగా చేసుకొని, కొండల మీద నిత్యం ధ్యానం చేస్తూ ఉంటాడు. ఆయనకు సర్పాలే ఆభరణాలు. జటాజూటమే అలంకారం. ఇలాంటి వేషధారణతోనే పార్వతీదేవిని పెళ్లి చేసుకోవడానికి వెళ్లాడు. అందరూ ఆశ్చర్యపోయారు. "ఈ అర్ధనగ్న పురుషుడా... లోకోత్తర సౌందర్యవతి అయిన పార్వతీదేవికి కాబోయే భర్త" అని. చివరకు పార్వతీదేవి కూడా కాస్త చిరాకుపడింది. అప్పుడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు ఆ పరమేశ్వరుడి పాదాలకు నమస్కరించి, పవిత్ర జలాలతో కాళ్ళు కడిగి, భక్తిపూర్వకంగా పెళ్లి పీటలపైకి నడిపించాడు. మహా జ్ఞాని అయిన విష్ణువుకు తెలుసు... ముల్లోకాలూ పరమేశ్వరుడి పాదధూళికి సరిపోవని. శివుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... మన ఆత్మ పరిశుద్ధంగా ఉండాలి. ద్వేషం, కోపం ఉన్నచోట ఆయన ఉండలేడు. దయ, క్షమాగుణం ఉన్న చోటే ఈశ్వరుడు ఉంటాడు. ఈ గుణాలు లేకుండా... 'నేను ప్రతిరోజూ పంచాక్షరీ పారాయణం చేస్తాను, పక్కింట్లో కోసిన పూలతో



పూజ చేస్తాను, బిందెల కొద్దీ నీళ్ళతో అభిషేకం చేస్తాను' అంటే కుదరదు. అది శుద్ధ దండుగ. ఈశ్వరుడు ఎంత అభిషేక ప్రియుడైనా... ఆయనకు కమండలంలో కాసిన్ని నీళ్ళు చాలు. ఇక పూలంటే అర్థం 'నీ హృదయం అనే పుష్పం' అని. అంతేతప్ప - దొరుకుతున్నాయి కదా అని ఓ బండెడు పూలు, పత్రాలు తెచ్చి స్వామి ఆలయాన్ని నింపెయ్యకూడదు.

> **లోకాలను ఏలే విశ్వనాథుడికి తలపై కిరీటం కూడా ఉండదు. ఒంటికి బూడిద రాసుకొని, పులిచర్మాన్ని వస్త్రంగా ధరించి, ఎద్దును వాహనంగా చేసుకొని, కొండల మీద నిత్యం ధ్యానం చేస్తూ ఉంటాడు. ఆయనకు సర్పాలే ఆభరణాలు.**

అర్ధనారీశ్వర పరమార్థం

ఇక, అర్ధనారీశ్వర తత్త్వంలోని పరమార్థం ఏమిటంటే... అది భార్యాభర్తల మధ్య ఉండవలసిన ప్రేమానురాగాలకు ప్రతీక. ఏ కాపురంలో భార్యాభర్తల మధ్య సాన్నిహిత్యం, ప్రేమానురాగాలు ఉంటాయో... అక్కడ పరమేశ్వరుడు ఏదో ఒక రూపంలో ఉంటాడు. పార్వతికి శివుడు తన ఎడమవైపే ఎందుకు స్థానం ఇచ్చాడు? మన శరీర భాగాలలో అత్యంత విలువైనది గుండె (హృదయం) అని మనకు తెలుసు. అందుకే పార్వతిని తన హృదయంలో దాచుకున్నాడు. అంతేకాదు, హృదయ స్థానం మాతృమూర్తికి ప్రతీక. అందుకే తల్లిని గౌరవించే ఎవరికైనా ఈశ్వర కృప మెండుగా ఉంటుంది.

• డాక్టర్ కసుమర్తి నాగేశ్వరరావు

తెలుసుకుందాం

ఉడుతా భక్తి...

'ఉడుతా భక్తిగా ఏదో మాకు ఉన్నంతలో మేము ఇచ్చాం. మా శక్తి మేరకు మేము చేశాం' అనే మాట మనం తరచుగా వింటూ ఉంటాం. ఉడుతా భక్తిగా అంటే... అల్పంగానో, స్వల్పంగానో, నామమాత్రంగానో చేయడం అని కాదు. 'ఎంత చేశాం, ఎంత ఇచ్చాం' అని కూడా కాదు. "త్రికరణ శుద్ధిగా చేసిన పనులను దేవుడు మెచ్చును, లోకం మెచ్చును" అంటాడు అన్నమయ్య. "పుష్పం పత్రం ఫలం తోయం... నిర్మల బుద్ధితో, నిష్కామ భావంతో సమర్పించే పత్రంకానీ, ఫలంకానీ, జలంకానీ నేను ప్రీతితో స్వీకరిస్తాను" అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అంతకన్నా ఇంకేం కావాలి?

సాయం చిన్నదే కానీ...

ఉడుతాభక్తికి సంబంధించి మనం తెలుసుకోవాల్సిన ఒక కథ ఉంది. వానర వీరులందరూ నూరు యోజనాల విస్తీర్ణం ఉన్న మహా సముద్రాన్ని దాటి, లంకకు వెళ్ళడానికి వారధి నిర్మిస్తున్నారు. వాళ్ళు పెద్ద పెద్ద బండరాళ్ళను దొర్లించుకొని పోతున్నారు. ఇదంతా ఒక ఉడుత మూలన ఉండి గమనిస్తోంది. 'ఈ వానర వీరులందరూ సీతారాముల సమాగమం కోసం ఇంత కష్టపడుతున్నారే! మరి నేనేమిటి, ఎలాంటి సాయం చెయ్యకుండా ఊరకే ఇలా ఉండిపోయాను?' అనుకుంది. ఒడ్డుకు కొట్టుకు వస్తున్న సముద్రపు అలల్లో తడిసింది. తడి శరీరంతో ఇసుకలో పొర్లింది. ఒంటికి అంటిన ఇసుకను నిర్మాణంలో ఉన్న వారధి మీద విదిలిస్తోంది. అలా నీటిలో తడవడం, ఇసుకలో పొర్లడం, వారధిపై విదిలించడం.. అలుపూ సొలుపూ లేకుండా నిర్విరామంగా చేస్తోంది. రాయికీ రాయికీ మధ్య ఇసుక ఉంటే.. అవి గట్టిగా అతుక్కుంటాయని దాని ఆలోచన. నిజమే కదా! కానీ దాని శ్రమను ఎవరూ గుర్తించలేదు. అసలు దాని ఉనికినే ఎవరూ పట్టించుకోలేదు. ఎవరి పనిలో వారు తలమునకలై ఉన్నారు. అయినా ఉడుత కూడా తన కష్టాన్ని ఎవరో గుర్తించాలనీ, తనను కీర్తించాలనీ అనుకోలేదు. తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలనుకుంది. శక్తివంచన లేకుండా పని చేస్తోంది. వారధి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న శ్రీరాముడు... ఆ ఉడుత శ్రమను, తాపత్రయాన్ని గుర్తించాడు. దాన్ని దగ్గరకు తీసుకున్నాడు. దాని శరీరాన్ని ఆప్యాయంగా నిమిరాడు. అది సంతోషం పట్టలేక... కృతజ్ఞతగా స్వామి చుట్టూ ముమ్మారు తిరిగింది. దాని జన్మ చరితార్థమయింది. ఉడుత ఒంటిమీద కనిపించే మూడు చారలు... రాముడి చేతి వేళ్ళ అనవాళ్ళని చెబుతారు.

అహంకారం విడిచిపెట్టాలి...

ఉడుతా భక్తి అంటే ఏది చేసినా ఆత్మార్పణ బుద్ధితో చేయడం, నిస్వార్థంగా చేయడం, దీక్షగా చేయడం. దేవుడు మెచ్చేది మన భక్తిని, ఆయన పట్ల మనకున్న విశ్వాసాన్నే కానీ... మనం సమర్పించే కానుకలను కాదు. దేవునికైనా, మరెవరికైనా మనం చేసే సేవను కానీ, కైంకర్యాన్ని కానీ, ఉపకారాన్ని కానీ... మన బతుకుకు సార్థకత కల్పించుకోవడం కోసం చేస్తున్న కృషిగానే భావించాలి. భక్త కవి కంచర్ల గోపన్న 'దాశరథీ శతకం'లో ఒక చోట "ఓ దశరథరామా! నాకు ఏ వరాలూ వద్దు. నీవు ఇచ్చిన ఈ అవయవాలతో నీకు సేవ చేసే భాగ్యాన్ని నాకు ప్రసాదించు. నా చేతులు నీకు నమస్కరించాలి. నా కన్నులు నిన్నే చూస్తూ ఉండాలి. నా నాలుక నీ నామస్మరణే చేయాలి. నా చెవులు నీ సత్కథలనే వినాలి. నా నాసిక నీ మెడలోని పూలదండల సువాసనకు ఆశపడాలి. అప్పుడే నువ్వు ఇచ్చిన ఈ ఇంద్రియాలకు సార్థకత. అలా చేస్తేనే పంచేంద్రియాలు మోక్ష సాధనాలు అవుతాయి. లేకపోతే నిరర్థకాలు అవుతాయి" అంటాడు. ఇంద్రియాలను గెలవడం తేలికైన పని కాదు. కొండలను, బండలను సముద్రంలో తేలేలా చేయాలన్నా, విషయాసక్తి నుంచి ఇంద్రియాలను మరల్చాలన్నా... జగదేక శరణ్యమూర్తి రామచంద్ర ప్రభువు దయ ఉండాలి. అన్నిటికన్నాముందు... ఉడుతలోని ప్రేమపూర్వక త్యాగభావాన్ని మనం అలవరచుకొని, నిష్ఠతో కర్మలను ఆచరించాలి. ఉడుతా భక్తి అంటే అది. మనకు ఉన్నవి కొద్దిపాటి శక్తి సామర్థ్యాలే కావచ్చు. వాటిని సంపూర్ణంగా భగవదర్పణ చేయడమే ఉడుతాభక్తి. శ్రమను గౌరవించండి. శ్రమించి పనిచేసేవారిని ఆదరించండి. సంస్థల నిర్వాహకులు, అధికారులు, అమాత్యులు... ఇలా అందరూ తామే అందరికన్నా అధికులం అనే అహంకారాన్ని వదిలి పెట్టి, చిన్నవారిని చేరదీసి ప్రోత్సహిస్తే... వారు కూడా అద్భుతాలు సృష్టిస్తారు. ఈ ఉడుత కథ వాల్మీకి రామాయణంలో లేదు. ఎవరు రాశారో, ఎక్కడినుంచి గ్రహించారో, ఎవరు ప్రాచుర్యంలోకి తెచ్చారో తెలీదు. అయితేనేం, మంచి కథ.



• ప్రయాగ రామకృష్ణ

సందేశం

కృతజ్ఞతే ఆరాధనకు ఆత్మ

కృతజ్ఞత మనం చేసే ఆరాధనలన్నిటికీ ఆత్మలాంటిది. ఎవరైనా మనకు మేలు చేస్తే, దాన్ని మనస్ఫూర్తిగా గుర్తిస్తూ, జ్ఞాపకం చేసుకుంటూ, ఆ మేలు చేసిన వ్యక్తి పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి. అదే విధంగా.. ఈ సువిశాలమైన ప్రపంచాన్ని మనకోసం సృష్టించిన.. విశ్వప్రభువైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం కూడా మన విధి. మనం పీల్చే శ్వాస ఆయన వరప్రసాదమే. మనం జీవించడానికి అనువుగా ఎన్నో వనరులను మనకు ఆయన అనుగ్రహించాడు. కాబట్టి ప్రతిక్షణం ఆయనకు కృతజ్ఞులమై ఉండాలి. అలాంటి కృతజ్ఞతాభావం లేనివారిలో విశ్వాసం స్థిరంగా ఉండదు. వారి ఆరాధనల్లో సంకల్పశుద్ధి కూడా ఉండదు.

ముఖ్యమైన పునాది

మనలో ఆత్మను నింపి, కళ్ళను, చెవులను, హృదయాన్ని సమకూర్చిన అల్లాహ్‌కు ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువేనని అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్ఆన్ చెబుతోంది. దేవునికి, అతని దాసునికి మధ్య ఉండే సంబంధానికి ముఖ్యమైన పునాది కృతజ్ఞత. అది మనసా, వాచా, కర్మణా ఉండాలి. మనలో స్థిరపడాలి. దాని కోసం మానవుడు తనకు దేవుడు ప్రసాదించిన వరాలను అనుక్షణం తలచుకుంటూ ఉండాలి. అందం, ఆరోగ్యం, సంపద, విద్య.. ఇలా అనేక వరాలను సృష్టికర్త మానవుడికి ఇచ్చాడు. మనకు ఉన్న వనరులను ఉపయోగించుకొనే బుద్ధిబలాన్ని కూడా అందించాడు. అవి చూసుకొని ఆనందిస్తూ, గర్వపడుతున్న మనిషి.. వాటిని ప్రసాదించిన సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలపడం మరచిపోతున్నాడు. మన హృదయంలో కృతజ్ఞతాభావాన్ని మేలుకొలపాలంటే... భగవంతుడు మనకు ఎన్నో మహాభాగ్యాలను ప్రసాదించాడనే భావన కలగాలి. ఆ భావనను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుకోవాలి. నిత్యం దైవాన్ని స్మరించుకుంటూ... దైవం పట్ల, మనకు సాయం చేసినవారిపట్ల కృతజ్ఞతా భావంతో మెలిగేవారు ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటారు. ప్రపంచంలో సంతోషానికి కారకులవుతారు.

> **సువిశాలమైన ప్రపంచాన్ని మనకోసం సృష్టించిన దైవానికి కృతజ్ఞత చెప్పుకోవడం మన విధి. మనం పీల్చే శ్వాస ఆయన వరప్రసాదమే.**



• మహమ్మద్ వహీదుద్దీన్

అంతా 'ఒక్క'టయ్యారు!





- ఒకే జైలు, ఒకే బ్యారక్‌లో జగన్ 'గ్యాంగ్'
- రాజ్ కసిరెడ్డి, పీఎస్ఆర్, వంశీ అక్కడే
- ముగ్గురి సెల్స్‌లో సీసీ కెమెరాలు

విజయవాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఒకరిది మద్యం మాయ. మరొకరిది మహిళపై కుట్ర. ఇంకొకరిది కిడ్నాప్ కిరికిరి. ఈ మూడు కేసుల్లో ఇరుక్కున్న ముగ్గురు 'జగన్' మనుషులు జైలులో ఒక్కటయ్యారు. మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి రాజశేఖరరెడ్డి, ముంబై నటి కాదంబరి జత్వాని కేసులో అరెస్టయిన పీఎస్ఆర్ ఆంజనేయులు ఒకరోజు వ్యవధిలో విజయవాడ జిల్లా కారాగారానికి వెళ్లారు. వారి కంటే ముందునుంచే గన్నవరం టీడీపీ కార్యాలయ ఉద్యోగి ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అదే జైలులో ఉంటున్నారు. ఈ ముగ్గురినీ జైలులో ఒకే బ్యారక్‌లో ఉంచడం విశేషం. జిల్లా జైలులో మూడు బ్యారక్‌లు ఉన్నాయి. ఒకటో నంబరు బ్యారక్‌లో 11 గదులు ఉన్నాయి. రెండో నంబరు బ్లాక్‌లో రెండు గదులు, మూడో నంబరు బ్లాక్‌లో మరో రెండు గదులు ఉన్నాయి. ఈ రెండు, మూడు బ్లాక్‌లను ప్రముఖులకు కేటాయిస్తారు. మిగిలిన వారిని వివిధ సెల్స్‌లోకి పంపుతారు. వల్లభనేని వంశీని ఒకటో నంబరు బ్యారక్‌లో ఉంచారు. ఇక.. రాజ్ కసిరెడ్డికి ఇదే బ్యారక్‌లో వేరే సెల్ కేటాయించారు. పీఎస్ఆర్‌ను కూడా ఇదే నంబరు బ్యారక్‌లోని మరో సెల్‌కు పంపారు. వైసీపీ హయాంలో విర్రవీగిన వారిలో ఒకరి తర్వాత ఒకరు జైలుకు క్యూ కడుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వారి గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

నాడు డాక్టర్.. నేడు యాక్టర్

పీఎస్ఆర్‌ను వెంటాడుతున్న 'స్త్రీ గండం'

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

కొందరికి వాహన గండం ఉంటుంది. మరి కొంతమందికి జలగండం ఉంటుంది. కానీ, ఐపీఎస్ అధికారి పెండ్యాల సీతారామాంజనేయులుకు (పీఎస్ఆర్) మాత్రం మహిళా గండం ఉన్నట్టు కనిపిస్తోంది. మహిళల విషయంలోనే ఆయన పరువు రెండు సార్లు బజారున పడింది. ఈ రెండు ఘటనలూ విజయవాడ కేంద్రంగానే జరగడం గమనార్హం. విజయవాడ పోలీసు కమిషనర్ హోదాలో పనిచేసినప్పుడు అసభ్యకరంగా సందేశాలు పంపి వేధించారని ఓ మహిళా వైద్యురాలు రోడ్డు ఎక్కడంతో పీఎస్ఆర్ శాఖపరంగా ఇబ్బందిపడ్డారు. ముంబై నటి కాదంబరి జత్వానిపై అక్రమంగా కేసును బనాయించడం వెనుక వ్యూహకర్తగా ఉండి ఇప్పుడు ఏకంగా జైలుకే వెళ్లారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో పోలీసు కమిషనర్‌గా విజయవాడకు పీఎస్ఆర్ వచ్చారు. ఆనాడు గన్నవరం నియోజకవర్గం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉండేది. అప్పుడు తెలుగుదేశం గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీ ఉన్నారు. ఆ రోజుల్లో వంశీ వాహనంలో బయటకు బయలుదేరితే భారీ కాన్వాయ్ ఉండేది. ఆయన కారు కాకుండా మరో ఆరేడు కారులు వెనుకాముందు ఉండేవి. దీనిపై పీఎస్ఆర్ పంజా విసిరారు. వంశీ కాన్వాయ్‌లో వాహనాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. దీంతో పీఎస్ఆర్, వంశీ మధ్య వైరానికి బీజం పడింది. ఆ తర్వాత ఒక సెటిల్‌మెంట్ వ్యవహారం వారిమధ్య దూరాన్ని మరింతగా పెంచిందని చెబుతుంటారు. అన్నపూర్ణ ప్యాకర్స్ విషయంలో ఒకవర్గానికి వంశీ కొమ్ముకాయగా, మరో వర్గానికి పీఎస్ఆర్ అభయం ఇచ్చారు. ఈ విషయంలోనూ ఒకరికొకరు హెచ్చరికలు జారీ చేసుకున్నారు. ఇది జరిగిన కొన్నాళ్లకు పీఎస్ఆర్ తనను లైంగికంగా వేధిస్తున్నారని ఒక మహిళా వైద్యురాలు ఆరోపణలు చేశారు. ఆయన పంపిన సందేశాలను ఉన్నతాధికారులకు చూపించారు. అప్పటి వరకు పులిలా కనిపించిన పీఎస్ఆర్ పిల్లిలా మారిపోయారు. వంశీయే ఆ మహిళను పీఎస్ఆర్‌పైకి బాణంలా వదిలారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ వ్యవహారంతో పీఎస్ఆర్‌ను పోలీసు ఉన్నతాధికారులు ఆగమేఘాల మీద బదిలీ చేశారు.

జత్వాని ఝలక్

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే పీఎస్ఆర్ ప్రాధాన్యం తిరిగి పెరిగిపోయింది. ఇంటెలిజెన్స్ విభాగాధిపతిగా పేట్రేగిపోయారు. జగన్ 'అంజన్న' అని పిలిచేంతగా అప్పటి ప్రభుత్వ పెద్దలతో కలిసి వ్యవహారాలు నడిపించారు. 2024 ఎన్నికలకు ముందు ముంబై నటి కాదంబరి జత్వానిపై అక్రమంగా కేసు నమోదు చేయించడంలో తెర వెనుక వ్యూహం రూపొందించారు. తానే నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి జత్వానీపై కుక్కల విద్యాసాగర్‌తో కేసు పెట్టించారు. ఐపీఎస్ స్థాయి అధికారులను ముంబై పంపించి, జత్వాని, ఆమె కుటుంబ సభ్యులను విజయవాడకు తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత జత్వాని కేసులో ఆయన ఇప్పుడు కటకటాలు లెక్కిస్తున్నారు.

కొసమెరుపు: ఒకనాడు 'ఆధిపత్య' పోరు సాగించిన వంశీ, పీఎస్ఆర్ ఇప్పుడు విజయవాడలో ఒకే జైలులో ఉన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి, ఉద్యోగి అపహరణ కేసుల్లో వంశీ కటకటాలు లెక్కిస్తుంటే, ఒక నటిని బలవంతంగా అరెస్టు చేసి వేధింపులకు గురిచేసిన కేసులో పీఎస్ఆర్ కారాగారానికి వెళ్లారు.



కమీషన్ల కిక్కు

జగన్ జేబులోకే!

(మొదటి పేజీ తరువాయి)

ఈ మొత్తాన్ని రాజ్ కసిరెడ్డికి అందించేవారని... అక్కడి నుంచి మిథున్‌రెడ్డి, సాయిరెడ్డి, బాలాజీ(భారతీ సిమెంట్స్), వైఎస్ అనిల్ రెడ్డిలకు చేరేవని తెలిపింది. వీరి ద్వారా వివిధ రూపాల్లో... అంతిమంగా అప్పటి సీఎం జగన్‌కు కమీషన్లు చేరేవని 'సిట్' వెల్లడించింది. వ్యక్తిగత, రాజకీయ లాభాల కోసం మద్యం వ్యాపారం నడపడాన్ని రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంగా అభివర్ణించింది. ఈ స్కామ్‌లో 300 నుంచి 400కోట్ల మేర అనుమానాస్పద లావాదేవీలు గుర్తించామని, మరింత లోతుగా వ్యవహారం తేల్చేందుకు కీలకమైన వ్యక్తుల కస్టడీ ఎంతో అవసరమని తెలిపింది. మద్యం కుంభకోణం కేసులో ఎనిమిదో నిందితుడిగా ఉన్న బూనేటి చాణక్యను అరెస్టు చేసిన సిట్ అధికారులు... ఆయన రిమాండ్ రిపోర్టులో అనేక సంచలన అంశాలు పొందుపరిచారు. ఆ నివేదిక ప్రకారం... వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే... 2019 ద్వితీయార్థంలో హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్లో సజ్జల శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో ఒక భేటీ జరిగింది. మద్యం కుంభకోణానికి అక్కడే బీజం పడింది. తెలుగు రాష్ట్రాల్లోని మద్యం డిస్టిలరీస్ యజమానులను భేటీకి పిలిపించారు. ఏపీకి లిక్కర్ సరఫరా చేయాలంటే కనీసం 12శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇందుకు కొందరు అంగీకరించారు. మరికొందరు నిరాకరించారు. కమీషన్లు ఇచ్చేందుకు సమ్మతించిన వారికి మాత్రమే ఆర్డర్లు ఇచ్చి... ఆ సరుకునే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. ఈ వసూళ్లను సుమిత్ అనే వ్యక్తి పర్యవేక్షించారు. తర్వాత. చాణక్య రంగంలోకి దిగారు. చాకచక్యంగా, పకడ్బందీగా... వివిధ పేర్లతో అంతర్జాతీయ ఫోన్ నెంబర్లు, కాలింగ్ యాప్స్, వీపీఎన్‌లు వాడుతూ డిస్టిలరీస్ యజమానులతో లావాదేవీలు జరిపారు. వ్యాపారులకు బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి చెల్లింపులు చేసిన వెంటనే చాణక్య నుంచి ఫోన్లు వెళ్లేవి. తర్వాత రెండు రోజుల్లో కమీషన్ ముట్టచెప్పాల్సిందే. లేదంటే... తదుపరి ఆర్డర్లు ఆపేసేవారు. 12 శాతంతో మొదలైన వసూళ్లు 20శాతం వరకూ చేరాయి. నెలవారీ కమీషన్ల మొత్తం రూ.50కోట్ల నుంచి రూ.60 కోట్లకు చేరింది. ఈ డబ్బులు బులియన్ వ్యాపారాలు, బోగస్ కంపెనీలు, హవాలా మార్గాల ద్వారా ఢిల్లీ, ముంబై, హైదరాబాద్‌కు చేరాయి. బంగారు నాణేలు, గార్మెంట్స్, ప్రచార వస్తువుల పేరుతో జీఎస్టీ ఇన్వాయిస్‌లు తీశారు. కానీ... అవేవీ రవాణా కాలేదని టోల్‌గేట్ డేటా ద్వారా తెలింది.

కమీషన్లు ఇస్తేనే...

జగన్ హయాంలో ఆదాన్ సుప్రీం, బ్రిలియంట్ బ్లెండ్, దారు హౌస్ బ్రాందీ, మాన్షన్ హౌస్(తిలక్ నగర్) మద్యాన్ని పుష్కలంగా విక్రయించారు. బాగాపేరున్న మెక్ డోవల్స్, ఇంపీరియల్ బ్లూ వంటివి పూర్తిగా ఆపేశారు. కమీషన్లు ఇచ్చేందుకు నిరాకరించడమే దీనికి కారణం. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2018-19లో మెక్‌డోవల్స్ బ్రాందీ 22.7 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. 2023-24నాటికి 5 లక్షల యూనిట్లకు పడిపోయినట్లు 'సిట్' తెలిపింది. ఇంపీరియల్ బ్లూ విస్కీ 20లక్షల నుంచి 7లక్షల యూనిట్లకు.. కింగ్‌ఫిషర్ బీరు కోటి నుంచి 11.8లక్షల యూనిట్లకు తగ్గిపోవడానికి కమీషన్లు చెల్లించక పోవడమే కారణమని వివరించింది.



చాణక్యకు రిమాండ్

విజయవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో మరో నిందితుడికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో ఎనిమిదో నిందితుడు, రాజ్ కసిరెడ్డి తోడల్లుడు బూనేటి చాణక్య అలియాస్ ప్రకాశ్‌ను సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. మద్యం కుంభకోణంలో మొత్తం నగదు వ్యవహారాలను చాణక్య చక్కబెట్టారని, మద్యం డిస్టలరీస్ నుంచి కమీషన్లు వసూలుచేసి రాజ్ కసిరెడ్డికి వేర్వేరు మార్గాల ద్వారా చేర్చేవారని వివరించారు. వాదనలు విన్న న్యాయాధికారి పి.భాస్కరరావు... చాణక్య తరఫు న్యాయవాదిని వాదనలు వినిపిస్తారా అని అడిగారు. వాదనలు వినిపించనని ఆయన చెప్పడంతో చాణక్యకు వచ్చేనెల 6 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆయనను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

చెప్పకుండా విదేశాలకు ఎందుకెళ్లారు?

- నెల రోజుల్లో జవాబివ్వకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవు
- సీనియర్ ఐపీఎస్ సునీల్‌కుమార్‌కు ప్రభుత్వం హెచ్చరిక

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో అనుమతి లేకుండా విదేశాల్లో అనధికారిక పర్యటనలు చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై రాష్ట్రప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. ప్రభుత్వం ఆమోదించి అనుమతిచ్చిన ట్రావెల్ ప్లాన్‌కు విరుద్ధంగా దుబాయ్, జార్జియా, యూఏఈ, యూకే, అమెరికా దేశాలకు వెళ్లినందుకు చర్యలకు ఉపక్రమించింది. అనుమతి తీసుకోకుండా ఎందుకు విదేశాలకు వెళ్లారో నెలలోగా సమాధానం చెప్పాలని, లేదంటే తప్పు చేసినట్లు భావించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

పీఎస్ఆర్‌ను వారంపాటు కస్టడీకి ఇవ్వండి

- సీఐడీ పిటిషన్... విచారణకు స్వీకరించిన కోర్టు

విజయవాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీపై వేధింపుల కేసులో విచారించేందుకు నిఘా విభాగం మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులును వారం రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు న్యాయస్థానాన్ని కోరారు. కేసు విచారణలో ఆయన ఏ మాత్రం సహకరించలేదని విజయవాడలోని మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని న్యాయస్థానం విచారణకు స్వీకరించింది.

నా కుమారుడి రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన రాజ్ కసిరెడ్డి తండ్రి ఉపేందర్‌రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 'మద్యం కుంభకోణం వ్యవహారంలో రాజ్ కసిరెడ్డికి రిమాండ్ విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించండి. వాటిని రద్దు చేయండి' అని కోరుతూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్‌రెడ్డి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. 'నా కుమారుడిని అదుపులోకి తీసుకొనే సమయంలో అధికారులు నిబంధనలు పాటించలేదు. అరెస్టుకు గల కారణాలను తెలియపరుస్తూ ఇచ్చిన నోటీసులో ఐపీసీ సెక్షన్లు మాత్రమే చేర్చారు. రిమాండ్ రిపోర్టులో అవినీతి నిరోధక చట్టంలో సెక్షన్లూ చేర్చారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఏసీబీ కోర్టు యాంత్రికంగా రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చింది' అని పేర్కొన్నారు.

కేసు నమోదుకు ముందు ఏసీబీ ప్రాథమిక విచారణ చేయలేదు

- ఐపీఎస్ అధికారి జాషువా న్యాయవాది వాదనలు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్టోన్‌క్రషర్ యజమానిని బెదిరించి కోట్లు వసూలు చేశారన్న ఆరోపణతో నమోదైన కేసు కొట్టివేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌లోఐపీఎస్ అధికారి పి.జాషువా తరఫు వాదనలు ముగిశాయి. పిటిషనర్‌పై కేసు నమోదు విషయంలో ఏసీబీ అధికారులు బీఎన్‌ఎస్‌ఎస్ చట్టం నిబంధనలు అనుసరించలేదని, ఎలాంటి ప్రాథమిక విచారణ జరపకుండానే విజిలెన్స్ నివేదిక ఆధారంగా కేసు పెట్టారని ఆయన న్యాయవాది వాదించారు. ఏసీబీ తరఫు వాదనల కోసం తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రభావతి బెయిల్‌పై విచారణ మే 7కు వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ నీలం ప్రభావతి బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి ఏ5గా ఉన్నారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించగా నిరాశ ఎదురైంది. హైకోర్టు తీర్పును ప్రభావతి, జనవరి 22న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కాగా, అడ్వొకేట్ ఆన్ రికార్డ్ (ఏవోఆర్) అందుబాటులో లేనందున కేసును మరో రోజుకు వాయిదా వేయాలని ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం కేసు విచారణను మే 7వ తేదీకి వాయిదా వేసింది.



మాజీ మంత్రి విడదల రజిని మరిది గోపీని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకొచ్చిన పోలీసులు

మాజీ మంత్రి విడదల రజిని మరిది

గోపి అరెస్టు

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని తాడేపల్లికి తరలించిన ఏసీబీ

- యడ్లపాడు మైనింగ్ వ్యాపారులను బెదిరించి రూ.2.20 కోట్లు అక్రమ వసూలు
- బాధితుల ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణ
- రజిని సహా నలుగురిపై ఏసీబీ కేసు నమోదు
- అర్ధరాత్రి దాటాక కోర్టు ముందుకు.. 14 రోజుల రిమాండ్

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజినికి అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) షాకిచ్చింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మైనింగ్ వ్యాపారులను బెదిరించి కోట్లు వసూలు చేసిన వ్యవహారంలో ఆమె మరిది విడదల వేణు గోపీనాథ్ అలియాస్ గోపిని అరెస్టు చేసింది. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో బుధవారం రాత్రి ఏసీబీ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించి తాడేపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. గురవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం రాత్రి పొద్దుపోయాక ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఇంట్లో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆయనకు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేట (ప్రస్తుతం పల్నాడు జిల్లా) నియోజకవర్గం యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిగలో ఉన్న లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమాని నల్లపనేని చలపతిరావును డబ్బు కోసం విడదల రజని బెదిరించారు (అప్పటికి ఆమె వైసీపీ ఎమ్మెల్యేగానే ఉన్నారు). వ్యక్తిగత సహాయకుడు దొడ్డ రామకృష్ణ ద్వారా ఐదు కోట్లు డిమాండ్ చేశారు. ఆ తర్వాత ప్రాంతీయ విజిలెన్స్ అధికారి పి.జాషువాతో పాటు తన మరిది గోపిని రంగంలోకి దించారు. పూర్తి అనుమతులతో 10.163 హెక్టార్లలో మైనింగ్ చేస్తున్నామని, అక్రమాలకు పాల్పడలేదని.. తామెందుకు 5 కోట్లు ఇవ్వాలని చలపతిరావు అభ్యంతరం చెప్పారు. 'ఎమ్మెల్యే అడిగితే ఇవ్వాల్సిందే.. లేదంటే రూ.50 కోట్ల జరిమానా తప్పదు' అని జాషువా బెదిరించారు. తన బృందంతోపాటు మైనింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి స్టోన్ క్రషర్ కార్యాలయంలో 2020 సెప్టెంబరు 20న తనిఖీలు చేశారు. అనంతరం గుంటూరులోని తన కార్యాలయంలో జరిమానా విధించేందుకు అనుకూలంగా నివేదిక సిద్ధం చేయించి.. మరోమారు చలపతిరావును భయపెట్టి బేరమాడారు. విధిలేని పరిస్థితిలో రూ.2 కోట్లు ఇచ్చేందుకు ఆయన సమ్మతించారు. 2021 ఏప్రిల్ 4న రాత్రి 11గంటల ప్రాంతంలో చిలకలూరిపేటలోని విడదల రజిని ఇంట్లో గోపి చేతికి రెండు కోట్ల రూపాయల నగదు ఇవ్వగా.. తమకూ చెరో పది లక్షలు ఇవ్వాలని గోపి, జాషువా పట్టుబట్టారు. చలపతిరావు తన వ్యాపార భాగస్వామి నంబూరి శ్రీనివాసరావు, పెరవలి నాగవంశీ ద్వారా గోపికి చిలకలూరిపేటలో, జాషువాకు గుంటూరులో ఆ మొత్తం అందజేశారు. 2022లో రజిని మంత్రి అయ్యారు. 2024 ఎన్నికల్లో ఆమెతో పాటు వైసీపీ పరాజయం పాలై టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చింది. తనకు జరిగిన అన్యాయంపై చలపతిరావు గతేడాది సెప్టెంబరు 2న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రజిని బలవంతపు వసూళ్లు నిజమేనని అటు విజిలెన్స్ విచారణలో, ఇటు ఏసీబీ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. రజిని ఒత్తిడి చేయడంతోనే తనిఖీల పేరుతో మైనింగ్ వ్యాపారులను ఇబ్బంది పెట్టినట్లు ఐపీఎస్ అధికారి జాషువా లిఖితపూర్వక వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ (సీఐయూ).. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7, 7ఏ తోపాటు ఐపీసీ 384, 120బీ సెక్షన్ల కింద విడదల రజిని (ఏ-1), పి.జాషువా (ఏ-2), విడదల గోపి(ఏ-3), రామకృష్ణ(ఏ-4)పై కేసు నమోదు చేసింది.

వదినకు కుడిభుజంగా..

చిలకలూరిపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విడదల రజినికి ఆమె మరిది గోపి కుడి భుజంగా వ్యవహరించారు. మొదట్లో కొంతకాలం వారి మధ్య అంత సఖ్యత లేదు. ఆ తర్వాత ఆమె వ్యవహారాలన్నీ గోపియే చూస్తూ వచ్చారు. స్టోన్ క్రషర్ యజమాని చలపతిరావును బెదిరించి రూ.2.2 కోట్లు వసూలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2021లో జరిగిన చిలకలూరిపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో 30వ వార్డు నుంచి వైసీపీ అభ్యర్థిగా గోపి పోటీచేసి గెలిచారు. తమ స్వస్థలమైన పురుషోత్తమపట్నంలో అప్పటి వైసీపీ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పర్యటనకు వచ్చినప్పుడు ఆయన అడ్డుకున్నారు. తమకు తెలియకుండా తమ గ్రామంలోకి ఎలా వస్తారంటూ ఎంపీ కారుపై దాడి చేయడం సంచలనం సృష్టించింది. శ్రీకృష్ణదేవరాయలు, రజిని మధ్య దూరం పెరగడానికి ఈ సంఘటన కూడా కారణం. అలాగే కోటప్పకొండ తిరుణాల సందర్భంగా గోపి ప్రభలపై రాజకీయ ప్రసంగం చేసి టీడీపీకి చెందిన వారిని కులం పేరుతో పేరుతో దూషించడంతో అప్పట్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక గోపి దూకుడు తగ్గింది. వరుసగా మూడు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాకపోవడంతో కౌన్సిలర్‌గా ఆయన సభ్యత్వాన్ని రద్దుచేస్తూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. ఆయన్ను ఏసీబీ హైదరాబాద్‌లో అరెస్టు చేసి తాడేపల్లి కార్యాలయానికి తరలించడంతో ఆయన్ను కలిసేందుకు కుటుంబ సభ్యులు గురువారం పురుషోత్తమపట్నం నుంచి వచ్చారు.

పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు

మాధవరెడ్డి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నారు. తర్వాత మాధవరెడ్డి పోలీసులకు చిక్కకుండా.. అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కొంతకాలం తర్వాత హైకోర్టులో ముందస్తు బెయిల్ పొందారు. 9 నెలలుగా ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. ఆ బెయిల్‌ను దర్యాప్తు బృందం తాజాగా రద్దు చేయించింది. తిరుపతి సీఐడీ డీఎస్పీ కొండయ్యానాయుడు, సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఎవరూ ఊహించని విధంగా రొంపిచర్లలోని ఫాంహౌస్‌లో గురువారం సాయంత్రం మాధవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ కేసులో మూడు నెలల క్రితం సబ్‌కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడైన పూర్వపు ఆర్డీవో మురళి ఏసీబీ అదుపులో ఉన్నారు. మాధవరెడ్డి పట్టుబడడంతో త్వరలో మరిన్ని పెద్దతలకాయలను సీఐడీ పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని.. పెద్దిరెడ్డితో పాటు ఆయన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డిని అదుపులోకి తీసుకోవచ్చని అంటున్నారు. మదనపల్లెకు చెందిన కొందరు కీలక వైసీపీ నాయకులు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు చెబుతున్నారు.

చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం వంకమద్దికి చెందిన మాధవరెడ్డి వ్యవసాయం చేసుకునేవారు. 1985లో మదనపల్లె వచ్చి వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆనాటి మంత్రి పెద్దిరెడ్డి వద్ద చేరారు. మదనపల్లె, పుంగనూరు, పీలేరు, రొంపిచెర్ల తదితర ప్రాంతాల్లో ఖరీదైన భూములు కబ్జా చేయడం, అడ్డొచ్చిన వారిని బెదిరించడం, తప్పుడు కేసులు బనాయించే వారన్న ఆరోపణలున్నాయి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక.. తమ భూ కుంభకోణాలు బయటకు వస్తాయని కొందరు రెవెన్యూ అధికారులు, వైసీపీ నేతలు, మాజీ మంత్రి అనుచరులతో కలసి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్ల దహనానికి మాధవరెడ్డి పాల్పడ్డారని పోలీసులు అంటున్నారు.

దేశం దాటిన 'మద్యం' కిరణ్‌రెడ్డి

- అమెరికాలో ఆచూకీ పట్టిన నిఘా వర్గాలు

తిరుపతి (నేర విభాగం), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడిగా భావిస్తున్న తిరుపతి వాసి కిరణ్‌రెడ్డి గుట్టుచప్పుడు కాకుండా దేశం దాటేశారు. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉన్నట్టు నిఘా వర్గాలు గుర్తించినట్టు సమాచారం. ఆయన తండ్రి రిటైర్డు ఏఎస్ఐ బాలసుబ్రమణ్యంరెడ్డి ఇప్పటికే సిట్ అధికారుల అదుపులో ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాయలసీమ వ్యాప్తంగా లిక్కర్ సరఫరాలో కిరణ్‌రెడ్డి కీలకంగా వ్యవహరించినట్టు భావిస్తున్నారు. ఆయనను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో 4నెలల కిందటే అమెరికాకు చేరుకున్నట్టు తాజాగా తెలిసింది. కిరణ్‌రెడ్డి గతంలోనూ అమెరికాలో సుమారు పదేళ్లు ఉన్నారు. అక్కడ 'ఫాస్ట్ సప్లైస్-ఫాస్ట్ క్లిక్' పేరిట స్విగ్గీ తరహాలో ఫుడ్ డెలివరీ వ్యాపారాలు చేశారని తెలిసింది. రాయలసీమ వ్యాప్తంగా లిక్కర్ అక్రమ సరఫరాకు సహకరించాలని సజ్జల, భార్గవ్ కోరడంతో ఏపీకి వచ్చినట్టు తెలిసింది. లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి వద్ద కొంతకాలం పనిచేశారని భావిస్తున్నారు. డికార్ట్ లాజిస్టిక్స్ పేరిట ఓ సంస్థను రిజిస్టర్ చేసి దానిద్వారా మద్యం అక్రమ సరఫరా చేసినట్టు తెలిసింది. ఆ సంస్థ రిజిస్ట్రేషన్ సమయంలో తిరుపతి శివజ్యోతినగర్‌లోని అపార్టుమెంట్ చిరునామా ఇచ్చారని గుర్తించారు. వాస్తవానికి అక్కడ డెకార్ట్ లాజిస్టిక్స్ పేరిట ఎలాంటి కార్యాలయం నడవడం లేదు. సంస్థ బోర్డు కూడా లేదు. ఈ నేపథ్యంలోనే కిరణ్‌రెడ్డిని విచారించడం అవసరమని సిట్ వర్గాలు భావిస్తున్నాయి.

వంశీ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

విజయవాడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు న్యాయస్థానంలో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఆయన దాఖలు చేసిన రెండో బెయిల్ పిటిషన్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం కొట్టేసింది. ఈ కేసులో అరెస్టయిన తర్వాత బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. రెండో బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం తీర్పుచెప్పారు.

తిరుమలలో భద్రత కట్టుదిట్టం

కొండకు వెళ్లే ప్రతి వాహనం తనిఖీ

తిరుమల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్ర దాడి నేపథ్యంలో తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కేంద్రం హెచ్చరికలతో జిల్లా పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అలిపిరిలో తనిఖీలను కట్టుదిట్టం చేశారు. ప్రతి వాహనాన్ని, వాటిలోని సామగ్రిని, అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణికుల లగేజీలను స్కానింగ్ యంత్రాల్లో సూక్ష్మంగా పరిశీలన చేసిన అనంతరం తిరుమలకు పంపారు. తిరుమలకు వచ్చే వాహనాలను రెండో ఘాట్‌లోని లింక్‌రోడ్డుకు సమీపంలో ఆపి తనిఖీలు నిర్వహించారు. అలిపిరి నుంచి శ్రీవారి ఆలయం వరకు బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు జల్లెడపట్టాయి. శ్రీవారి ఆలయం వైభాగంలో, గొల్లమండపం వద్ద సాయుధ సిబ్బందిని అప్రమత్తం చేశారు. తిరుమలలోని సీసీ కెమెరాల పనితీరుపై దృష్టిసారించారు. సీసీ కెమెరాల్లో ప్రతి ఒక్కరి కదలికపైనా నిఘా ఉంచాలని కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు.

తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

విశ్రాంతి భవనంలోకి ఉగ్రవాదులు ప్రవేశిస్తే భక్తులను ఎలా కాపాడాలి, ఉగ్రవాదులను ఎలా మట్టుబెట్టాలనే అంశంపై గురువారం సాయంత్రం ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించింది. ముగ్గురు ఉగ్రవాదులు లోపలికి ప్రవేశించగా దాదాపు 30మంది ఆక్టోపస్ సిబ్బంది లోపలకు వెళ్లి వారిని హతమార్చడం, ఉగ్రదాడిలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించడం వంటి చర్యలను చాకచక్యంగా నిర్వహించారు.



అన్నదాన సత్రం వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ బలగాలు

రెండో రోజూ సహకరించని మాధవ్!

- జగన్ భార్యను తిట్టారన్న కోపంతోనే చేబ్రోలు కిరణ్‌పై దాడికి యత్నం: మాజీ ఎంపీ

గుంటూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న చేబ్రోలు కిరణ్‌కుమార్‌పై దాడికి యాదృచ్ఛికంగానే ప్రయత్నించామని.. ఇందులో ఎటువంటి కుట్ర.. ముందస్తు పథకం లేవని మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఆయన రెండో రోజు కూడా విచారణకు సహకరించలేదని కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. రెండ్రోజుల కస్టడీలో భాగంగా బుధ, గురువారాల్లో ఆయన్ను వారు విచారించారు. బుధవారం రాజమండ్రి కేంద్ర కారాగారం నుంచి గుంటూరు తీసుకొచ్చి విచారణ చేపట్టేటప్పటికి రాత్రి అయింది. పూర్తిస్థాయిలో విచారించే అవకాశం లభించలేదు. దీంతో గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నల్లపాడు పోలీసు స్టేషన్లో వెస్ట్ డీఎస్పీ అరవింద్, నగరంపాలెం సీఐ నజీర్ ప్రశ్నించారు. 'పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌కుమార్‌పై దాడికి యత్నించడం, ఎస్పీ కార్యాలయంలోనూ దాడికి పాల్పడడం నేరం. అసలు కిరణ్‌ను గుంటూరుకు తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మీకెవరు ఇచ్చారు.? వైసీపీ నాయకులా.. పోలీసులా.. లేదంటే మీడియా ప్రతినిధులా..' అని అడుగగా.. తనకెవరూ చెప్పలేదని ఆయన అన్నట్లు సమాచారం. దాడికి పురిగొల్పింది ఎవరు.. వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరని అడుగగా.. తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొని అనుచరులతో కలిసి వస్తుండగా కిరణ్‌ను తరలిస్తున్న పోలీసు వాహనం యాదృచ్ఛికంగానే కంటబడిందని.. జగన్ సతీమణి భారతి పట్ల అనుచితంగా మాట్లాడిన నేపథ్యంలో కిరణ్‌కుమార్‌పై కోపంతో దాడికి ప్రయత్నించామని మాధవ్ చెప్పినట్లు తెలిసింది. వాహనం కనిపించగానే దాడికి ప్రయత్నించారంటే పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు అనగా.. ఆయన దాటవేసినట్లు సమాచారం. విచారణ తర్వాత పోలీసులు ఆయనకు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టు ముందు హాజరుపరిచారు. 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ స్రవంతి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన్ను బందోబస్తు మధ్య రాజమండ్రి తరలించారు.



భర్తను కోల్పోయిన సోహిని అధికారి

నాన్న ఎక్కడమ్మా?

తల్లికి మూడేళ్ల బాలుడి ప్రశ్న

బిడ్డకు ఏమీ చెప్పలేక ఏడ్చిన మాతృమూర్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఆ భయానక దృశ్యాన్ని కళ్లారా చూశాడు కాబోలు.. తల్లి పొత్తిళ్లలో ఆదమరిచి నిద్రపోయిన ఆ మూడేళ్ల బాలుడు అర్ధరాత్రి ఉన్నట్టుండి నిద్రలేచాడు. బాబు ఒళ్లు కంపిస్తోంది. భయం కళ్లలోనూ కనిపిస్తోంది... రెండు చేతులతో తల్లి చేతులను గట్టిగా పట్టుకొని.. 'నాన్న ఎక్కడమ్మా?' అని వణుకుతున్న గొంతుతో ప్రశ్నించాడు. బిడ్డకు సమాధానం చెప్పలేక ఆ తల్లి కన్నీళ్లు ఆపుకోలేక ఏడ్చేసింది! పెహల్గాం ఉగ్రదాడిలో తన తండ్రి బితాన్ అధికారిని కోల్పోయిన మూడేళ్ల బిడ్డ గురించే ఇదంతా! మా కుటుంబాన్ని ఉగ్రవాదులు ఛిద్రం చేశారని సోహిని అధికారి కన్నీళ్లు పెట్టుకున్నారు. అర్ధరాత్రి నిద్రలేచి నాన్న ఎక్కడ? అని అడిగిన నా బిడ్డకు.. 'మీ నాన్న ఎప్పటికీ తిరిగిరాడు' అనే చేదు నిజాన్ని ఎలా చెప్పగలను? అని సోహిని వాపోయింది. మూడేళ్ల బాబు చూస్తుండగానే.. తన భర్తను ఉగ్రవాదులు కాల్చి చంపారని ఆమె చెప్పింది.



పాకిస్థాన్ హైకమిషన్‌లోకి 'కేక్'..!

పహల్గాం దాడి నేపథ్యంలో.. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ కార్యాలయంలోకి ఓ వ్యక్తి కేక్ బాక్సుతో వెళ్తున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ దృశ్యాలను రిపబ్లిక్ టీవీ సహా.. పలు మీడియా సంస్థలు చిత్రీకరించాయి. "సంబురాలు జరుపుకొనేందుకు ఆ కేక్‌ని పాక్ హైకమిషన్ కార్యాలయానికి తీసుకెళ్తున్నారా?" అని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. ఆ వ్యక్తి ఎలాంటి సమాధానం చెప్పకుండా ముందుకు సాగడం వీడియోలో కనిపిస్తుంది.



వ్యాపారుల నిరసనలు

పహల్గాం దాడితో తమకే తీవ్ర నష్టం జరుగుతోందని జమ్మూకశ్మీర్‌లోని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధ, గురువారాల్లో వారు ముక్త కంఠంతో ఈ దాడిని ఖండించారు. దాల్ సరస్సులో లాంచీలు, పడవలు నడిపేవారు కూడా పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతూ.. ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. సరస్సులో పడవలను వరుసగా పెట్టి.. ప్లకార్డులతో తమ ఆందోళనను వ్యక్తపరిచారు. ఉగ్రదాడులు తమ జీవనోపాధిని దెబ్బతీస్తాయని వారు వ్యాఖ్యానించారు.



పెళ్లి ఆగిపోయింది

పాకిస్థాన్‌పై భారత్ విధించిన ఆంక్షలతో ఓ యువకుడి పెళ్లి నిలిచిపోయింది. రాజస్థాన్‌కు చెందిన సైతాన్‌సింగ్‌కు అట్టారీ సరిహద్దు అవతల.. పాకిస్థాన్‌లో ఉన్న యువతితో వివాహం నిశ్చయమైంది. శుక్రవారం పెళ్లి. అయితే.. వరుడి తరపు వారు కొందరు ఇప్పటికే పాకిస్థాన్‌కు వెళ్లగా.. సైతాన్‌సింగ్ ఇక్కడే ఉండిపోయాడు. సరిహద్దులను మూసివేయడంతో.. ఇప్పుడేంచేయాలో పాలుపోవడంలేదని ఆయన మీడియాతో వాపోయారు.




ఉగ్రవాదులకు గుణపాఠం నేర్పాలి

- **పర్యాటకుల మతం తెలుసుకుని పాశవికంగా కాల్చి చంపారు**
- **ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతు: ఒవైసీ**

హైదరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్ర మూకలకు తగిన గుణపాఠం నేర్పాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. శాంతి భద్రతలను కాపాడేందుకు కేంద్రం తీసుకునే చర్యలకు మద్దతు ఇస్తామన్నారు. పర్యాటకుల మత విశ్వాసాలను తెలుసుకుని ఉగ్రవాదులు పాశవికంగా కాల్చి చంపారని, వీరి తూటాలకు ఓ ముస్లిం యువకుడు కూడా ప్రాణాలు కోల్పోయాడని ఒవైసీ తెలిపారు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతు ఉందని ఒవైసీ ఆరోపించారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించే చర్యలకు మజ్లిస్ మద్దతు ఇస్తుందన్నారు.

అంతమొందించేందుకు ఎంతవరకైనా..



(మొదటిపేజీ తరువాయి)

మౌనం పాటించి, మృతులకు అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. పాకిస్థాన్‌కు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. "పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్రవాదులను, ఈ కుట్రకు సహకరించిన వారిని.. వారు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తాం" అని మోదీ స్పష్టం చేశారు. సాధారణంగా హిందీ, ప్రాంతీయ భాషల్లో ప్రసంగాన్ని ఆరంభించే ప్రధాని.. గురువారం హఠాత్తుగా కొద్దిసేపు ఆంగ్లంలో మాట్లాడారు. "మిత్రులారా.. బిహార్ గడ్డపై నుంచి యావత్ ప్రపంచానికి నేను ఒక్కటే చెబుతున్నా. అమాయకుల ప్రాణాలు తీసిన ప్రతి ఉగ్రవాదినీ భారత్ వెతికి పట్టుకుంటుంది. వారి వెనక ఉన్నవారినీ వదిలిపెట్టబోం. అందరినీ కఠినంగా శిక్షిస్తాం. వారి అంతు చూసేందుకు ఎంతవరకైనా వెళ్తాం. భారతదేశ స్ఫూర్తిని ఉగ్రవాదం ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదు. ఉగ్రవాదాన్ని క్షమించే ప్రసక్తే లేదు" అని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్ వెనక్కి తగ్గదన్న సందేశాన్ని, ముష్కరులకు హెచ్చరికనూ మోదీ ప్రపంచానికి తెలియజేసేందుకే ఆంగ్లంలో మాట్లాడారు. అనంతరం ఆయన హిందీలో ప్రసంగించారు. "బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నిస్తాం. యావత్ దేశం దీనికి కట్టుబడి ఉంటుంది. మానవత్వంపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరూ మనతోనే ఉన్నారు. ఈ కష్ట సమయంలో అనేక దేశాల ప్రజలు, నేతలు మనకు మద్దతుగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు" అని ప్రధాని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం ఉగ్రవాదం వెన్ను విరిస్తుందన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్న దారుణ ఘటనను దేశమంతా ఖండిస్తోందని, బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని, ఓ మహిళ సోదరుడిని, మరో మహిళ జీవిత భాగస్వామిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. "కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులపై జరిగిన దాడి కాదు. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన దుస్సాహసం" అని ప్రధాని పేర్కొన్నారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందన్నారు. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైందని మోదీ స్పష్టం చేశారు.

ఉగ్ర క్యాంపులను..

నాశనం చేయాల్సిందే!

మోదీ సర్కారు ఏ చర్య తీసుకున్నా మద్దతుగా నిలుస్తాం

- **ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడుదాం**
- **అఖిలపక్ష సమావేశం ప్రకటన**



గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో కల్లోలం రేపుతున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాద క్యాంపులను నాశనం చేయాల్సిందేనని అఖిలపక్షం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పహల్గాం దాడి నేపథ్యంలో మోదీ సర్కారు ఏ చర్య తీసుకున్నా పూర్తి మద్దతు ఇస్తామని ప్రకటించింది. జాతీయ భద్రత విషయంలో రాజకీయాలకు తావు లేదని, ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడుతామని స్పష్టం చేసింది. గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, జైశంకర్, నిర్మల సీతారామన్, కిరెణ్ రిజిజు ప్రభుత్వం నుంచి పాల్గొనగా.. ప్రతిపక్షాల నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, బీజేడీ నేత సస్మిత్ పాత్రా, ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్, తృణమూల్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ, టీడీపీ నేత లావు కృష్ణదేవరాయలు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఉగ్రదాడి మృతులకు అంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఉగ్రదాడి ఘటన గురించి, దానిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరాలు వెల్లడించారు. అఖిలపక్షంలో పాల్గొన్న నేతలందరూ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. జాతీయ భద్రత విషయంలో రాజకీయాలకు తావు లేదని, కలిసికట్టుగా నిలుద్దామని చెప్పారు.

కఠిన చర్యలు చేపట్టే ఉద్దేశంతో ప్రభుత్వం..

అఖిలపక్షం అనంతరం కిరెణ్ రిజిజు మాట్లాడారు. ఉగ్రదాడి అంశంలో అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ భేటీలో వెల్లడించారని చెప్పారు. దాడి వెనుక పాక్ హస్తం ఉందని, వారికి ఎలా గుణపాఠం చెప్పాలని అనుకుంటున్నదీ వివరించారని తెలిపారు. ప్రభుత్వానికి అన్ని విధాలా మద్దతు ఇస్తామని తనతో సహా ప్రతిపక్ష నేతలంతా ముక్తకంఠంతో చెప్పారని రాహుల్‌గాంధీ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించారని మల్లికార్జున ఖర్గే చెప్పారు. సాధ్యమైనంత త్వరగా జమ్ముకశ్మీర్‌లో శాంతి ఏర్పడటం అవసరమన్నారు. ఉగ్రదాడిలో గాయపడి అనంతనాగ్‌లో చికిత్స పొందుతున్న వారిని రాహుల్ గాంధీ శనివారం పరామర్శించనున్నారని తెలిపారు. ఇక భద్రతా వైఫల్యంపై చర్చించామని, తగిన చర్యలు తీసుకోవాలని కోరామని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్, తృణమూల్ ఎంపీ సుదీప్ వివరించారు.

రాజకీయాలకు తావు లేదు: లావు

దేశ భద్రతలో రాజకీయాలకు తావు లేదని, రాజకీయాలు వేరు జాతీయ భద్రత వేరని టీడీపీపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఉగ్రవాదం, జాతీయ భద్రతపై ఎంత దూరం వెళ్లినా కేంద్రానికి మద్దతుగా నిలుస్తామని, టీడీపీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. అఖిలపక్ష సమావేశం అనంతరం ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. సమావేశంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రానికి అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని తెలిపారు. "జాతీయ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని అన్ని పార్టీలు ముక్తకంఠంతో చెప్పాయి. పదిరోజుల క్రితమే శ్రీనగర్ వెళ్లాను. గుల్మార్గ్ వెళ్లి అక్కడి స్థానికులను కలిశాను. గత ఐదారేళ్లలో టూరిజం ఎంతో అభివృద్ధి చెందిందని, తమకు ఉపాధి గణనీయంగా పెరిగిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి అత్యంత బాధాకరం. ఉగ్రవాదాన్ని తగ్గించడం మాత్రమే మన ముందున్న సవాల్ కాదు. కశ్మీర్ అంటే కలిగిన భయానక వాతావరణాన్ని తొలగించాల్సిన బాధ్యత మనపై ఉందని టీడీపీ అభిప్రాయాన్ని చెప్పాను. సింధూ నదీ జలాల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయానికి మద్దతు ప్రకటించాం" అని శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. కాగా.. ఉగ్రవాదాన్ని తుదముట్టించడంలో కేంద్రానికి అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తామని వైసీపీపీ నేత మిథున్ రెడ్డి మీడియాకు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదంపై యుద్ధం జరగాలన్నారు.

భద్రతా వైఫల్యం నిజమే!?

పహల్గాం ఉగ్రదాడి వెనుక భద్రతా వైఫల్యం కూడా ఉందని అఖిలపక్ష భేటీలో కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల పత్రిక ఇండియా టుడే ఈ వివరాలను వెల్లడించింది. బైసరన్ ప్రాంతంలో భద్రతా బలగాలు ఎందుకు లేవని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించగా.. "అక్కడ ఎలాంటి తప్పూ జరగకపోతే.. మనం ఇక్కడ ఎందుకు భేటీ అవుతాం. ఏవో అంశాల్లో వైఫల్యం జరిగింది. అదేమిటో తేల్చాల్సి ఉంది. అమర్‌నాథ్ యాత్ర మొదలయ్యే వరకు కూడా బైసరన్ ప్రాంతంలో నిషేధం ఉంటుంది. కానీ స్థానిక అధికారులు భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వకుండానే.. పర్యాటకులను అనుమతించారు." అని ఈ భేటీలో ప్రభుత్వం తరఫున పాల్గొన్న నేత వెల్లడించినట్టు సమాచారం.

తుడిచి పెట్టేయాల్సిందే..!

లాడెన్‌కు, పాక్ ఆర్మీ చీఫ్‌కు తేడా లేదు

అమెరికా రక్షణ శాఖ మాజీ అధికారి రూబెన్

న్యూఢిల్లీ/శ్రీనగర్, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంతో పాటు అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్‌ను ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే చేసే దేశంగా అధికారిక ముద్ర వేయాలని అమెరికా ప్రభుత్వానికి ఆ దేశ రక్షణ శాఖ మాజీ అధికారి మిచెల్ రూబెన్ అన్నారు. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై ధ్వజమెత్తారు. ఆయనకు, బిన్ లాడెన్‌కు తేడా లేదని, ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నారని అన్నారు. ఉగ్రవాదుల మారణకాండకు భారత్ కూడా ప్రత్యక్షంగా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 'హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ చూపిన అదే స్పష్టతతో భారత్ ప్రతిస్పందించాలి' అని కోరారు. స్పష్టంగా చెప్పాలంటే.. హమాస్ విషయంలో ఇజ్రాయెల్ వ్యవహరించిన విధంగానే.. పాకిస్థాన్, పాక్ ఐఎస్ఐ విషయంలో చేయడం ప్రస్తుతం భారత్ విధి అని అన్నారు. 'కశ్మీర్ పాకిస్థాన్ జీవనాడి' అంటూ ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. ఆయన చేసిన ప్రసంగం ఉగ్రవాదానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఉందన్నారు. 'భారత్ ఇప్పుడు చేయాల్సింది ఆ జీవనాడిని కత్తిరించడమే..' అని స్పష్టం చేశారు.

తిరగబడాలి: జమ్మూ కశ్మీర్ మాజీ డీజీపీ

పహల్గాం ఉగ్రదాడిని 'పుల్వామా-2 ఘటన'గా జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ శేష్ పాల్ పోల్చారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన విధంగానే ఇది కూడా ఉందన్నారు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ఇటీవల చేసిన 'హిందూ వ్యతిరేక' ప్రసంగం గురించి ప్రస్తావించారు. ఇజ్రాయెల్ చేసినట్లుగానే భారత ప్రభుత్వం కూడా ప్రతిస్పందించాలని, పాకిస్థాన్‌ను నాలుగు ముక్కలు చేయాలని ఆయన కోరారు. భారత ప్రభుత్వం పాక్ ఆర్మీ వెన్ను విరిచేయాలని, పాకిస్థాన్‌ను 4 ముక్కలు చేయాలని పాల్ అన్నారు.

పీవోకేలో హమాస్ నేతలు

2023, అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి, తాజాగా పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండకు పోలికలున్నాయని భారత్‌కు ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ అన్నారు. రెండు ఘటనల్లోనూ సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. పీవోకేలో ఇటీవల హమాస్ నేతలు పర్యటించారని, అక్కడ జైషే మహ్మద్ ఉగ్రవాదులను కలిసినట్లు తెలిసిందని తెలిపారు. ఆ తర్వాతనే జరిగిన పహల్గాం దాడి అనుమానాలకు తావిస్తోందన్నారు.

పోటాపోటీ క్షిపణి పరీక్షలు

- **ఎంఆర్-ఎస్ఏఎంను పరీక్షించిన భారత నౌకాదళం**
- **ఒకటి రెండు రోజుల్లో పరీక్షలకు పాక్ నోటమ్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో అరేబియా సముద్ర ప్రాంతంలో ఇరు దేశాలూ పోటాపోటీగా క్షిపణి పరీక్షలు నిర్వహించాయి. తాము క్షిపణి పరీక్షలు చేపడతామంటూ పాకిస్థాన్ మిలటరీ నోటమ్ జారీ చేసిన క్రమంలో.. భారత నౌకాదళం సైతం అరేబియా సముద్రంలో క్షిపణి పరీక్షను విజయవంతంగా చేపట్టింది. నేవీకి చెందిన స్వదేశీ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక ఐఎన్ఎస్ సూరత్ నుంచి సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఛేదించే సత్తా కలిగిన క్షిపణిని పరీక్షించింది. 70 కిలోమీటర్ల పరిధిలో టార్గెట్లను ఛేదించగలిగిన మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్(ఎంఆర్-ఎస్ఏఎం)ను పరీక్షించారు. ఈ సందర్భంగా లక్ష్యాన్ని అది అత్యంత కచ్చితత్వంతో ఛేదించిందని భారత నౌకాదళం గురువారం వెల్లడించింది. కాగా, ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ ముంబైలోని నేవల్ డాక్ యార్డులో ఐఎన్ఎస్ సూరత్‌ను ప్రారంభించారు. ఇదొక పీ15బీ క్షిపణి విధ్వంసక యుద్ధనౌక.

నోటమ్ జారీ చేసిన పాక్

పహల్గాం ఉగ్రదాడి అనంతరం తాము ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణి పరీక్షలను చేపడతామంటూ పాకిస్థాన్ మిలటరీ నోటమ్ (నోటీస్ టు ఎయిర్ మెన్/మెరైనర్స్) జారీ చేసింది. గురు, శుక్ర వారాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని అందులో పేర్కొంది. కానీ.. అదే సమయంలో ఐఎన్ఎస్ సూరత్ నుంచి భారత నౌకాదళం సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఛేదించే మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్‌ను పరీక్షించడం గమనార్హం. వాస్తవానికి ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణులపై ఎంఆర్-ఎస్ఏఎంలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. కాగా, అరేబియా సముద్ర ప్రాంతంలో పాక్ నేవీ నావికాదళ విన్యాసాలు ప్రారంభించిందని, దీనిలో క్షిపణి పరీక్ష కూడా ఉందని భారత రక్షణ, భద్రత వర్గాలు తెలిపాయి. పాక్ తన గగనతల రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసిందని, భారత విమానాల కదలికలను ట్రాక్ చేయడానికి వారి అవాక్స్ నిరంతర నిఘా పెట్టిందని ఆ వర్గాలు వెల్లడించాయి.

అరేబియా జలాల్లోకి ఐఎన్ఎస్ విక్రాంత్



పహల్గాం దాడి అనంతరం.. పాకిస్థాన్ అరేబియా సముద్ర ప్రాంతంలో క్షిపణి ప్రయోగాలు ప్రారంభించింది. దీనికి ప్రతిస్పందనగా భారత నౌకాదళం కూడా విమాన వాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను రంగంలోకి దింపింది. ఇది కర్ణాటకలోని కార్వార్ నావల్ బేస్ నుంచి అరేబియా సముద్రంలోకి వెళ్తున్నట్టు ఉపగ్రహ చిత్రాల ద్వారా నిర్ధారణ అయింది. దేశీయంగా నిర్మించిన ఐఎన్ఎస్ విక్రాంత్ 262 మీటర్ల పొడవు, 59 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఇది 40 ఫైటర్ జెట్లను మోసుకెళ్లగలదు. ఈ యుద్ధనౌకలో 2 స్క్వాడ్రన్ల మిగ్-29 యుద్ధవిమానాలు, పది కమోవ్ కేఏ-31 హెలికాప్టర్లు ఉన్నాయి. ఈ యుద్ధనౌక స్ట్రైక్ ఫోర్స్ పరిధి 1500 కి.మీ.

మూడంచెల భద్రత మధ్య ఉండే చోట

ఇంత దారుణమా?

- **నిఘా వైఫల్యాలపై సమగ్ర విచారణ చేయాలి**
- **ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు.. బీజేపీ ఈ ఘటనను వాడుకోవడం బాధాకరం**
- **సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం**



సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియా, ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి పిరికిపందల చర్య అని, అది నేరుగా భారత ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. మూడంచెల భద్రత మధ్య ఉండే ప్రాంతంలో దారుణం జరిగిందని, ఇందులో నిఘా వైఫల్యాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అందరం ఐక్యంగా ఉండాల్సిన ఈ సమయంలో.. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండటం బాధాకరమని విమర్శించింది. ఉగ్రదాడికి నిరసనగా, మృతులకు నివాళిగా శుక్రవారం దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. పహల్గాం ఘటన నేపథ్యంలో గురువారం ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రదాడి మృతులకు నివాళిగా మౌనం పాటించారు.

అంతా సంయమనం పాటించాలి..

"పహల్గాం ఉగ్రదాడితో షాక్‌కు గురయ్యాం. ఇది నేరుగా ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి. దీనికి పాకిస్థానే ప్రధాన సూత్రధారి. దేశంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడికి తెగబడ్డారు. ఇలాంటి సమయంలో అందరం కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. పహల్గాం మూడంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య ఉండే ప్రాంతం. కేంద్ర పాలిత ప్రాంతం. అయినా ఉగ్రదాడి జరగడం బాధాకరం. నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపై సమగ్ర విశ్లేషణ జరగాల్సిన అవసరం ఉంది. ఉగ్రదాడిని అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాలు ఖండించిన తీరు హర్షణీయం. అయితే, ప్రజలను విభజించేలా, విద్వేషాన్ని ప్రోత్సహించేలా బీజేపీ వ్యవహరిస్తున్న తీరు బాధాకరం. బీజేపీ సోషల్ మీడియా వేదికల ద్వారా ఐక్యతను దెబ్బతీసేలా ప్రచారం చేయడం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది" అని తీర్మానంలో కాంగ్రెస్ పేర్కొంది. ఉగ్రదాడి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోందని జమ్మూకశ్మీర్ సీఎల్పీ నేత గులామ్ అహ్మద్ మిర్ పేర్కొన్నారు. ఎప్పుడూ భద్రత ఉండే 'బైసారన్ పర్యాటక ప్రాంతంలో దాడి జరిగిన రోజున భద్రత ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు.

రెండున్నర గంటలు పరిగెడుతూనే ఉన్నాం

- **మా కళ్ల ముందే చంద్రమౌళిని కాల్చేశారు**
- **'ఆంధ్రజ్యోతి'తో శశిధర్, సుమిత్రాదేవి**

విశాఖపట్నం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'పహల్గాంలో మమ్మల్ని దేవుడే కాపాడాడు. లేకుంటే అక్కడే చనిపోయేవాళ్లం. సుమారు రెండున్నర గంటలు కొండపై నుంచి కిందికి పరుగెడుతూనే ఉన్నాం'. విశాఖ నుంచి కశ్మీర్ పర్యటనకు వెళ్లి పహల్గాం కాల్పుల ఘటనలో ప్రాణాలతో బయటపడిన శశిధర్, సుమిత్రాదేవి దంపతులు చెప్పిన సంగతులివీ. వీరితో కలిసి ఆ పర్యటనకు వెళ్లిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళి ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన సంగతి తెలిసిందే. చంద్రమౌళికి వీరు అత్యంత సన్నిహితులు. విశాఖపట్నం లాసన్స్‌బే కాలనీలో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి విశాఖపట్నం చేరుకున్న ఈ దంపతులను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' గురువారం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు చెప్పిన వివరాలు వారి మాటల్లోనే..'మేం మొత్తం పదిమంది కశ్మీర్ పర్యటనకు ఈ నెల 18వ తేదీన వెళ్లాం. 22న పహల్గాం వెళ్లాం. మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో మేం ఇద్దరం, మరో నలుగురు కలిసి వాష్‌రూమ్‌కు వెళ్లాం. ఆ తర్వాత పది నిమిషాలకే కాల్పుల శబ్దం వినిపించింది. బయటకు వచ్చి చూస్తే సువిశాలమైన కొండపై సుమారుగా 400 మంది పర్యాటకులు అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. వారిని కొందరు తుపాకులతో వెంబడిస్తున్నారు. ఇదేదో ఉగ్రవాద చర్యలా ఉందని వెంటనే పక్కనే ఉన్న ఫెన్సింగ్ కింద నుంచి అటు వైపు దిగిపోయి పరుగెత్తడం ప్రారంభించాం. మాతో పాటు చంద్రమౌళి, ఆయన భార్య నాగమణి కూడా ఉన్నారు. తలా ఒక దిక్కుకు పరుగెత్తి చెట్ల వెనుక దాక్కున్నాం. వెనక్కి తిరిగి చూస్తే చంద్రమౌళిని మోకాళ్ల మీద కూర్చోమంటూ ఓ సాయుధుడు గద్దిస్తున్నాడు. ఆ దృశ్యం చూడలేక కళ్లు మూసుకున్నాం. కొద్దిక్షణాలకే మళ్లీ కాల్పుల శబ్దం వినిపించింది. ప్రాణ భయంతో అక్కడి నుంచి కిందకు పరుగు తీస్తూనే ఉన్నాం. సాయంత్రం నాలుగు గంటలకు కొండ దిగువకు చేరుకున్నాం. అక్కడ భారత సైనికులు కనిపించారు. చంద్రమౌళి కాల్పుల్లో చనిపోయారని ఆరోజు రాత్రే మాకు తెలిసింది. కానీ, ఆయన భార్య నాగమణికి చెప్పలేదు.' అని శశిధర్, సుమిత్రాదేవి దంపతులు వివరించారు.



బొట్టు కడిగేసుకున్నా

ఉగ్రవాదులు హిందువులనే టార్గెట్ చేశారని, ముస్లింలైతే వదిలేస్తున్నారని మా ఆయన నన్ను బొట్టు చెరిపేసుకోమన్నారు. అక్కడి వాగు నీళ్లతో బొట్టు చెరిగిపోయేలా ముఖం కడిగేసుకున్నా. ఎంతో బాధ అనిపించింది. ప్రాణాలు ముఖ్యం కాబట్టి ఆ పని చేయక తప్పలేదు.

- సుమిత్రాదేవి


బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన పర్యాటకులు

కశ్మీర్ నుంచి బెంగళూరుకు సురక్షితంగా 178మంది ప్రయాణికులు

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో టెర్రరిస్టుల దాడి నేపథ్యంలో కశ్మీర్‌లో చిక్కుకున్న 178 మంది కన్నడిగులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చారు. కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ రెండురోజుల పాటు కశ్మీర్‌లో ఉంటూ అధికారుల బృందంతో కలిసి కన్నడిగులను గుర్తించారు. వారందరినీ గురువారం బెంగళూరుకు తీసుకువచ్చారు. కశ్మీర్‌లోని వివిధ ప్రాంతాలలో గడిపేందుకు వెళ్లిన కన్నడిగులను మంగళవారం సాయంత్రం నుంచి గుర్తించడం ప్రారంభించారు. అందరినీ సురక్షితంగా శ్రీనగర్ విమానాశ్రయానికి తీసుకువచ్చి అక్కడి నుంచి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. వారి బంధుమిత్రులు వందలాది మంది విమానాశ్రయానికి వచ్చి స్వాగతించారు.

అనుకోకుండా సరిహద్దుదాటిన బీఎస్ఎఫ్ జవాన్

- అదుపులోకి తీసుకున్న పాక్ రేంజర్లు
- విడుదల కోసం ఇరుదేశాల బలగాల మధ్య చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అనుకోకుండా సరిహద్దును దాటిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్‌ను పాకిస్థాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. దీంతో మన జవాన్‌ను సురక్షితంగా విడుదల చేసేందుకుగాను ఇరు బలగాల మధ్య చర్చలు జరుగుతున్నాయని గురువారం అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సరిహద్దులో ఈ ఘటన జరిగింది. 182వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ పీకే సాహు.. నీడలో విశ్రాంతి తీసుకోవడానికి రైతులతో పాటు వెళ్లాడు. ఆ తరుణంలో అతన్ని బుధవారం పాక్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో జవాన్ యూనిఫాంను ధరించి ఉండటమేకాకుండా తన సర్వీస్ రైఫిల్‌ను కూడా కలిగి ఉన్నారు. జవాన్‌ను విడుదల చేయడానికి ఇరు దేశాల బలగాల మధ్య ఫ్లాగ్ సమావేశం జరుగుతోందని అధికారులు తెలిపారు.

పాక్‌లో 'పహల్గాం' సూత్రధారులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 : పాకిస్థాన్‌లో సూత్రధారులు కూర్చొని కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని జరిపించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పహల్గాం దాడి జరుగుతున్నంతసేపూ ఆ సూత్రధారులకు, ఉగ్రవాదులకు మధ్య రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ సంబంధాలు కొనసాగినట్టు కనుగొన్నారు. ప్రాథమికంగా తమ దర్యాప్తులో తేలిన అంశాలు, దొరికిన ఆధారాలు, రికార్డు చేసిన సంభాషణలను బట్టి వారు ఈ నిర్ధారణకు వచ్చారు. పాకిస్థాన్‌లోని కరాచీ, ముజఫరాబాద్‌ల్లో దీనికి సంబంధించిన డిజిటల్ మూలాలను పసిగట్టినట్టు ఓ ఇంగ్లీష్ న్యూస్ వెబ్‌పోర్టల్ కథనం పోస్టుచేసింది. పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల సంఖ్యపై ఇంకా స్పష్టత రాలేదుగానీ వారు నలుగురు నుంచి ఆరుగురి వరకు ఉండొచ్చునని, వారంతా పాకిస్థానీయులని, అందరూ ఉర్దూ మాట్లాడారని పోలీసులు చెబుతున్నారు. అంతర్గత నిఘా సమాచారం, స్థానికుల మాటలను బట్టి వారు ఈ నిర్ధారణకు వచ్చారని ఆ కథనం తెలిపింది. ఇంకా.. ఈ కథనాన్ని అనుసరించి, దాడిలో పాల్గొన్నవారిలో ఆదిల్ హుస్సేన్, ఆసిఫ్ షేక్‌లను అనంత్‌నాగ్‌లో కొద్దిరోజులుగా చూస్తున్నామని స్థానికులు తెలిపారు. 2018లో పాకిస్థాన్‌కు వెళ్లిన ఆదిల్ ఈ ఏడాదే తిరిగి వచ్చాడని ఇంటెలిజెన్స్ నివేదికలు తెలుపుతున్నాయి.

నియంత్రణ రేఖ వెంబడి 42 లాంచ్ ప్యాడ్స్

- సరిహద్దు దాటేందుకు 200 మంది ఉగ్రవాదులు సిద్ధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: నియంత్రణ రేఖ వెంబడి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 42 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్స్ సిద్ధంగా ఉన్నాయని నిఘావర్గాల సమాచారం. ఇక్కడ శిక్షణ పొందిన 200మంది ఉగ్రవాదులు ఏ క్షణమైనా భారత సరిహద్దులోకి అక్రమంగా ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది. సరిహద్దు దాటించేందుకు పాకిస్థాన్ సైన్యం వీరికి సహకరిస్తోంది. శిక్షణ పొందుతున్న ఉగ్రవాదుల్లో 115 మంది పాక్ జాతీయులున్నట్లు సమాచారం. వీరుకాక జమ్మూకశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్, జైష్ ఎ మహ్మద్, లష్కర్ ఎ తైబా తదితర ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 60 మంది విదేశీ ఉగ్రవాదులు ఇప్పటికే చురుగ్గా ఉన్నారని నిఘా వర్గాలు గుర్తించాయి. 17 మంది స్థానిక ఉగ్రవాదులు కూడా చురుగ్గా ఉన్నారని తెలిపాయి.

ఇద్దరి మృతదేహాలు స్వస్థలాలకు


- బెంగళూరు ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులకు అప్పగింత

బెంగళూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల కిరాతక దాడిలో బలైన ఇద్దరు కన్నడిగుల మృతదేహాలు గురువారం తెల్లవారు జామున బెంగళూరుకు చేరుకున్నాయి. శివమొగ్గ పట్టణానికి చెందిన మంజునాథ్‌రావ్, బెంగళూరుకు చెందిన భరత్‌భూషణ్ మృతదేహాలను కార్గోవిమానంలో ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. కేంద్రమంత్రి సోమణ్ణ నివాళులర్పించి, బంధువులను ఓదార్చారు. మంజునాథ్‌రావ్ మృతదేహాన్ని తుమకూరు మీదుగా శివమొగ్గకు తరలించారు. బెంగళూరు నగరం మత్తికెరె ప్రాంతానికి భరత్‌భూషణ్ మృతదేహాన్ని తీసుకువచ్చారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం సిద్దరామయ్య భరత్‌భూషణ్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ టీడీపీ కొవ్వొత్తుల ర్యాలీ

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద పార్టీ నేతలు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. గురువారం రాత్రి నిర్వహించిన ఈ క్యాండిల్ ర్యాలీలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తదితరులు పాల్గొన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ర్యాలీలో పాల్గొన్న నేతలు ఆకాంక్షించారు. ఉగ్రవాద నిర్మూలనకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నా టీడీపీ మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

జమ్మూ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. జవాన్ మృతి




శ్రీనగర్, ఏప్రిల్ 24: జమ్మూ-కశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ ఆర్మీ జవాన్ మృతి చెందారు. దాదు బసంత్‌గఢ్ ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 6 పారా ఎస్ఎఫ్ విభాగానికి చెందిన హవల్దార్ ఝంటు ఆలీ షేక్ మరణించినట్టు ఆర్మీకి చెందిన వైట్‌నైట్ కార్ప్స్ 'ఎక్స్' ద్వారా తెలిపింది. సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయినట్టు పేర్కొంది. ఆలీ ధైర్యసాహసాలు మరువలేనివని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపింది.


స్వస్థలాలకు వెళ్లేందుకు జమ్మూకశ్మీర్ రైల్వే స్టేషన్‌కు చేరిన పర్యాటకులు

సిమ్లా ఒప్పందం నిలిపివేత

భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై పాకిస్థాన్ ప్రతిచర్యలు


సిమ్లా ఒప్పందంపై సంతకాలు చేస్తున్న భుట్టో, ఇందిర

ఇస్లామాబాద్, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందం నిలిపివేత సహా భారత్ తీసుకున్న పలు కఠిన నిర్ణయాలపై.. పాక్ ప్రతీకార చర్యలకు ఉపక్రమించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జాతీయ భద్రత కమిటీ గురువారం భేటీ అయి.. అచ్చంగా భారత్ తీసుకున్న నిర్ణయాల తరహాలోనే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. పాక్ త్రివిధ దళాధిపతులు, మంత్రులు సైతం హాజరైన ఈ భేటీ ముగిసిన అనంతరం.. అందులో తీసుకున్న నిర్ణయాలతో ఆ దేశ ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. 1972లో కుదుర్చుకున్న సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు అందులో వెల్లడించింది. భారత్, అట్టారీ సరిహద్దును మూసివేయగా.. పాక్ వాఘా సరిహద్దును మూసేస్తున్నట్టు వెల్లడించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం కింద జారీ చేసిన అన్ని వీసాలనూ రద్దు చేసింది. వాణిజ్యపరంగా తెగతెంపులు చేసుకుంది. దౌత్య సంబంధాల స్థాయిని తగ్గించింది. మన విమానాలకు తన గగనతలంలోకి ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. భారతదేశం పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని.. సీమాంతర హత్యలకు పాల్పడుతోందని.. ఆగ్రహం వ్యక్తం చేసింది.అంతేకాదు.. సింధు జలాల ఒప్పందం కింద పాకిస్థాన్‌కు రావాల్సిన నీటిని మళ్లించే ఎలాంటి ప్రయత్నాన్నయినా యుద్ధచర్యగా (యాక్ట్ ఆఫ్ వార్)గా పరిగణిస్తామని హెచ్చరించింది.

- వాఘా సరిహద్దును తక్షణమే మూసివేస్తున్నామని.. అన్ని అనుమతులతో ఆ దారి గుండా ఇప్పటికే పాకిస్థాన్‌లోకి ప్రవేశించిన భారతీయులంతా ఏప్రిల్ 30లోగా వెళ్లిపోవాలని ఆదేశించింది.
- సిక్కు మత యాత్రికులకు తప్ప.. సార్క్ వీసా వినహాయింపు పథకం (ఎస్‌వీఈఎస్) కింద భారతీయులకు జారీ చేసిన అన్ని వీసాలూ తక్షణమే రద్దవుతున్నట్టు ప్రకటించింది. ఆ వీసాపై వచ్చిన భారతీయులంతా 48 గంటల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది.
- తమ దేశంలోని భారత రాయబార కార్యాలయంలో ఉన్న భారత సైనిక, నౌకా దళ, వైమానిక దళ సలహాదారులను అవాంఛిత వ్యక్తులుగా పేర్కొంటూ ఆ పోస్టులు రద్దయినట్టుగా భావించాలని పేర్కొంది. ఆయా సలహాదారులతోపాటు వారి సహాయక సిబ్బంది సైతం ఏప్రిల్ 30లోగా పాకిస్థాన్‌ను విడిచివెళ్లాలని ఆదేశించింది.
- ఏప్రిల్ 30 నుంచి ఇస్లామాబాద్‌లోని భారత రాయబార కార్యాలయంలో సిబ్బంది సంఖ్యను 30కి కుదిస్తున్నట్టు ప్రకటించింది.
- భారత దేశానికి చెందిన, భారతీయులు నడిపే విమానయాన సంస్థల విమానాలకు పాక్ గగనతలాన్ని తక్షణం మూసివేస్తున్నట్టు పేర్కొంది.
- భారత్‌తో అన్ని రకాల వాణిజ్య సంబంధాలూ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అంతేకాదు.. భారత్ నుంచి పాకిస్థాన్ గుండా వేరే దేశానికి/ ఇతర దేశాల నుంచి తమ భూభాగం గుండా భారత్‌కు జరిగే వాణిజ్య కార్యకలాపాలనూ అనుమతించబోమని తేల్చిచెప్పింది. కాగా, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్నది ఏకపక్ష నిర్ణయమని.. దాన్ని తాము తిరస్కరిస్తున్నామని పాక్ ప్రకటించింది. సింధుజలాలు 24 కోట్ల పాకిస్థానీయులకు జీవరేఖ అని, తమ హక్కులను కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది.

చుట్టుతిరిగి వెళ్లాల్సిందే!

పాక్ నిర్ణయంతో అంతర్జాతీయ విమాన ప్రయాణాలపై ప్రభావం



తమ గగనతలంలోకి భారత విమానాలకు ప్రవేశాన్ని నిషేధిస్తూ పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంతో.. మన విమానయాన సంస్థలకు చెందిన అంతర్జాతీయ విమాన ప్రయాణాలపై ప్రభావం పడుతోంది. అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాలకు తాము నడుపుతున్న విమానాలపై ఆ ప్రభావం ఇప్పటికే పడుతోందని.. వాటిని దారి మళ్లించాల్సి వస్తోందని ఎయిరిండియా, ఇండిగో సంస్థలు వెల్లడించాయి. ఇకపై ఆయా దేశాలకు వెళ్లే విమానాలను అరేబియా సముద్రం మీదుగా సుదూర మార్గాల గుండా నడిపించాల్సి ఉంటుందని సీనియర్ పైలట్లు తెలిపారు. ప్ర విమాన టికెట్ల ధరలు పెరిగి ఆ భారం ప్రయాణికులపై పడుతుందని వారు పేర్కొన్నారు.


భేటీకి హాజరైన జీ-20 దేశాల రాయబారులు

పహల్గాం దారుణం మిత్ర దేశాల దృష్టికి..

- జీ-20 రాయబారులకు వివరించిన విదేశాంగ కార్యదర్శి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దారుణాన్ని భారత్ మిత్ర దేశాలకు వివరించింది. విదేశీవ్యవహారాల కార్యదర్శి విక్రం మిస్రి జీ-20 కూటమిలోని దేశాల రాయబారులకు ఈ దాడికి సంబంధించిన సమాచారాన్ని వివరించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ దాడికి, సీమాంతర ఉగ్రవాదంతో ఉన్న సంబంధాన్ని వారి దృష్టికి తీసుకొచ్చారు. ఉగ్రవాదాన్ని క్షమించబోమన్న విధానాన్ని అనుసరిస్తున్నట్టు చెప్పారు. పాకిస్థాన్‌తో 1960లో కుదిరిన సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్టు, అత్తారీ సరిహద్దును మూసివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన మరుసటి రోజునే రాయబారులతో మిస్రి భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకొంది. ఈ భేటీలో జీ-20 కూటమిలోని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, రష్యా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, చైనా దేశాల రాయబారులు హాజరయ్యారు. వారితో పాటుగా వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, మలేసియా దేశాల రాయబారులు కూడా పాల్గొన్నారు. మిత్రదేశాలతో భేటీ అయిన విదేశీ వ్యవహారాల కార్యదర్శి వాస్తవ పరిస్థితులను, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ఎల్వోసీపై ప్రభావం!

- పాక్ నిర్ణయంతో దీర్ఘకాలంలో సరిహద్దు, కశ్మీర్ అంశాలు సంక్లిష్టం
- 1972లో యుద్ధం అనంతరం చరిత్రాత్మక సిమ్లా ఒప్పందం
- ఎల్వోసీ ఉనికిలోకి వచ్చింది కూడా అప్పుడే
- మూడోపక్షం జోక్యం వద్దన్న నిబంధన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పాకిస్థాన్ నుంచి విముక్తి కోరుతూ తూర్పు పాకిస్థాన్ ప్రజలు జరిపిన విముక్తి పోరాటానికి భారత్ మద్దతు పలకటం, ఆ నేపథ్యంలో పాక్ భారత సైన్యంపై దాడులకు దిగటంతో.. 1971లో ఇరు దేశాల మధ్య భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో భారత్ గొప్ప విజయం సాధించటమేగాక.. పాకిస్థాన్‌లోని 13 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ యుద్ధం నేపథ్యంలోనే బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా ఆవిర్భవించింది. యుద్ధం అనంతరం.. భారత్-పాక్ సిమ్లా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. 1972 జూలై 2వ తేదీన ఈ ఒప్పందంపై నాటి భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణానికి స్వస్తి పలికి స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పుకోవటం కోసం ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని నాడు భారత్-పాక్ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

ఒప్పందంలోని ప్రధానాంశాలు

- ఏ దేశమూ ఏకపక్షంగా వ్యవహరించి శాంతికి భంగం కలిగించే పనులకు పాల్పడవద్దు.
- ఒక దేశం అంతర్గత వ్యవహారాల్లో మరో దేశం జోక్యం చేసుకోవద్దు.
- ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే అన్ని విబేధాలను పరిష్కరించుకోవాలి. మూడోపక్షం జోక్యం వద్దు
- 1971 యుద్ధం కాల్పుల విరమణ సమయంలో ఉన్న స్థితినే సిమ్లా ఒప్పందం.. జమ్మూకశ్మీర్‌లో ఇరుదేశాల సరిహద్దుగా (లైన్ ఆఫ్ కంట్రోల్- ఎల్వోసీ)గా మార్చింది.
- యుద్ధం సందర్భంగా భారత సైన్యం స్వాధీనం చేసుకున్న 13,000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని పాకిస్థాన్‌కు తిరిగి ఇవ్వటానికి భారత్ అంగీకరించింది. శాంతికి కట్టుబడి ఉన్నామని చెప్పటానికి భారత్ ఇందుకు సమ్మతించింది. అయితే టర్టుక్, చాలుంకా వంటి కొన్ని వ్యూహాత్మక కీలకమైన ప్రాంతాలను మాత్రం భారత్ తన వద్దే ఉంచుకుంది.

ఒప్పందం నిలిపివేతతో జరిగేదేమిటి?

సిమ్లా ఒప్పందం అమలును నిలిపివేయాలని పాకిస్థాన్ తాజాగా నిర్ణయించింది. దీని వల్ల సంభవించే పరిణామాలు తక్షణం కాకపోయినా, దీర్ఘకాలంలో ప్రభావం చూపే అవకాశం ఉంది. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ అంశంగా మలిచే ప్రయత్నాలను ముందు నుంచీ చేస్తున్న పాక్ ఇక మీదట వాటిని మరింత ముమ్మరం చేయవచ్చు. కశ్మీర్ వివాదంలో మూడో పక్షం జోక్యం దిశగా పాక్ అడుగులు వేసే అవకాశం ఉంది. ఐరాస లేదా చైనా వంటి తన మిత్రదేశాల జోక్యాన్ని పాకిస్థాన్ కోరవచ్చు.సిమ్లా ఒప్పందాన్ని పక్కకపెడితే.. ఎల్వోసీకి కట్టుబడాల్సిన అవసరం ఉండదు. ఇప్పటికే ఎల్వోసీని ఉల్లంఘిస్తూ తరచూ కాల్పుల ఘటనలు చేసుకుంటున్నాయి. ఇవి మరింత పెరిగే ప్రమాదం ఉంది. తక్షణం కాకపోయినా, దీర్ఘకాలంలో.. ప్రాంతీయ స్థిరత్వానికి భంగం వాటిల్లి, భారత్-పాక్ మధ్య చర్చలకు దారులు పూర్తిగా మూసుకుపోయే పరిస్థితులు ఏర్పడవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పాకిస్థాన్‌కు యుద్ధ భయం!

- సరిహద్దులకు సైన్యం... నిఘా పెంపు
- ఆగమేఘాలపై క్షిపణుల పరీక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఎలాంటి చర్యలు తీసుకోనుందోనని దాయాది దేశం పాకిస్థాన్‌లో ఆందోళన మొదలైందా? అందుకే.. క్షిపణి పరీక్షలు నిర్వహిస్తూ.. సరిహద్దుల్లో నిఘాను పెంచుతూ.. సైన్యాన్ని తరలిస్తోందా? ఈ ప్రశ్నలకు తాజా పరిణామాలు ఔననే సమాధానం చెబుతున్నాయి.

సరిహద్దుల్లో హై అలర్ట్

పాకిస్థాన్ రక్షణ శాఖ బుధవారం నుంచే సరిహద్దుల్లో అప్రమత్తమైంది. సైన్యం, యుద్ధ ట్యాంకులను నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వద్దకు పంపడమే కాకుండా.. నిఘా, సైన్యం రవాణా విమానాలను తరలించింది. గురువారం ఆగమేఘాలపై క్షిపణి పరీక్షలు నిర్వహించగా.. భారత్ ఎలాంటి చర్యలకు దిగినా.. ఎదుర్కొనేందుకు సిద్ధమేనంటూ.. రక్షణ శాఖ మంత్రి ఖావాజా ఆసిమ్ ప్రకటించడం గమనార్హం..!

'ఫ్లాగ్ ఆపరేషన్'పై పదేపదే ప్రకటనలు

భారత్ తమపై అభాండాలు(తప్పుడు 'ఫ్లాగ్ ఆపరేషన్') మోపుతోందని పాక్ ప్రభుత్వం బుధవారం నుంచి ఆరోపణలు గుప్పిస్తోంది. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అధ్యక్షతన గురువారం జరిగిన జాతీయ భద్రత సమావేశం తర్వాత.. ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ ధార్, రక్షణ మంత్రి ఖావాజా ఆసిమ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇదే అంశాన్ని ఎత్తిచూపారు. "పహల్గాం దాడి తర్వాత ఎలాంటి విచారణ జరపకుండానే.. పాక్‌పై ఆరోపణలు చేశారు. ఫ్లాగ్ ఆపరేషన్ ద్వారా ఉగ్రదాడులకు సంబంధించి ఒక దేశం లేదా ఒక సంస్థపై దాడికి సిద్ధమనడానికి యుద్ధ వ్యూహం లాంటిదే. ఇప్పుడు భారత్ అదే చేస్తోంది." అని విమర్శించారు.

భారత్‌పై ఉగ్రవాద నెపం

పాక్ రక్షణ మంత్రి ఖావాజా ఆసిమ్ ఏకంగా భారత్‌పై ఉగ్రవాద నెపం మోపారు. "మాకు ఉన్న నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లో ఉగ్రవాద దాడులకు భారత్ కుట్రలు చేస్తోంది. మేం ఒకటే చెబుతున్నాం. మా పౌరులపై దాడి జరిగితే.. భారత పౌరులు కూడా సురక్షితంగా ఉండరు. యుద్ధానికి బదులుగా భారత్ మాపై ఉగ్రవాదానికి సిద్ధమవుతోంది. భారత్ ఏదైనా సాహసానికి దిగితే.. తగిన సమాధానం ఇస్తాం" అని ఆయన వ్యాఖ్యానించారు.



రాష్ట్రపతితో షా, జైశంకర్ భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: దాయాది దేశం పాకిస్థాన్‌పై భారత్ ఆంక్షలు.. దానికి ప్రతిగా పాక్ ప్రతి ఆంక్షల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మతో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉగ్రదాడికి సంబంధించిన వివరాలను ఇరువురు మంత్రులు ఆమెకు వివరించినట్లు సమాచారం. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను రాష్ట్రపతి కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. అదే సమయంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ జీ-20 దేశాల్లో ఎంపిక చేసిన దేశాల రాయబారులతో సమావేశం నిర్వహించింది.

అత్యంత హేయమైన చర్య: ట్రంప్

పహల్గాంలో నిస్సహాయులైన పర్యాటకులపై జరిగిన దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి పాల్పడ్డ వారిని పట్టుకోవడంలో భారత్‌కు తాము పూర్తిస్థాయిలో మద్దతిస్తామన్నారు. గురువారం ఆయన ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. ఈ ఘటన అత్యంత హేయమైన చర్య అని వ్యాఖ్యానించారు.

నేడు కశ్మీర్‌కు ఆర్మీ చీఫ్

భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం కశ్మీర్‌లో పర్యటించనున్నారు. శ్రీనగర్‌లో ఆయన ఆర్మీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. నియంత్రణ రేఖ వెంబడి భద్రత, నిఘాను ముమ్మరం చేయడం, అట్టారీ క్రాసింగ్ వద్ద తీసుకుంటున్న చర్యలపై సమీక్షిస్తారు.

కుప్పకూలిన పాక్ స్టాక్ మార్కెట్

భారత్ ఆంక్షల నేపథ్యంలో గురువారం పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కుప్పకూలింది. కరాచీ-100 ఇండెక్స్ 2,565 పాయింట్ల మేర నష్టపోయింది.


పాక్‌నుంచి వాఘా సరిహద్దు గుండా భారత్‌కు తిరిగి వస్తున్న ఓ భారతీయుడు

48 గంటల్లో వెళ్లిపోవాల్సిందే..

పాకిస్థాన్ జాతీయులకు అన్ని రకాల వీసాలు రద్దు

- వైద్యం కోసం మెడికల్ వీసాలపై వచ్చినవారికి మాత్రం 29వ తేదీ వరకు గడువు
- ఆదేశాలు జారీ చేసిన విదేశాంగ శాఖ
- అట్టారీ-వాఘా చెక్‌పోస్టు మీదుగా.. తిరిగి వెళ్లిపోతున్న పాకిస్థానీలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కఠిన చర్యలు చేపట్టిన భారత్.. పాకిస్థాన్ జాతీయులకు అన్నిరకాల వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు 48 గంటల్లోగా తిరిగి వెళ్లిపోవాలంటూ విదేశాంగశాఖ గురువారం మధ్యాహ్నం ఆదేశాలు జారీ చేసింది. సాధారణ వీసాలపై భారత్‌కు వచ్చిన పాకిస్థానీయులు ఈ నెల 27వ తేదీ నాటికల్లా తిరిగి వెళ్లిపోవాలని.. వైద్యం కోసం మెడికల్ వీసాలపై వచ్చినవారు 29వ తేదీలోగా వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇకపై పాకిస్థానీలకు ఎలాంటి వీసాలు ఇవ్వకుండా వీసా సర్వీసులను సస్పెండ్ చేసింది. మరోవైపు భారతీయులెవరూ పాకిస్థాన్‌కు వెళ్లవద్దని, ఇప్పటికే పాకిస్థాన్‌లో ఉన్నవారు వెంటనే తిరిగి రావాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల నేపథ్యంలో పాకిస్థానీయులు సరిహద్దుల్లోని అట్టారీ-వాఘా సమీకృత చెక్‌పోస్టు మీదుగా తమ దేశానికి వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీలోని బంధువులను కలిసేందుకు పాకిస్థాన్‌లోని కరాచీ నుంచి వచ్చిన ఓ కుటుంబం.. చెక్‌పోస్టు వద్ద మీడియాతో మాట్లాడింది. "బంధువులను కలిసేందుకు ఏప్రిల్ 15న ఢిల్లీకి వచ్చాం. 45 రోజులు వీసా గడువు ఉంది. కానీ వెంటనే తిరిగి వెళ్లిపోవాల్సి వస్తోంది. పహల్గాంలో దాడి చేసినది ఎవరైనా సరే అది తప్పే. ఇలాంటి విద్వేషాన్ని మేం కోరుకోవడం లేదు" అని పేర్కొంది. మరోవైపు ఇప్పటికే పాకిస్థాన్‌లోని బంధువుల వద్దకు వెళ్లిన భారతీయులు ఇదే చెక్‌పోస్టు మీదుగా తిరిగి వచ్చేస్తున్నారు.

'ఎక్స్' ఖాతా, పీఎస్ఎల్ నిలిపివేత

పాకిస్థాన్ ప్రభుత్వానికి చెందిన అధికారిక 'ఎక్స్' ఖాతాను భారతదేశంలో నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 'ఎక్స్' సంస్థ ఈ చర్య చేపట్టింది. మరోవైపు మన ఐపీఎల్ తరహాలో పాకిస్థాన్ నిర్వహించే 'పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)' క్రికెట్ మ్యాచ్‌ల ప్రసారాన్ని భారత్‌లో నిలిపివేశారు. ఫ్యాన్‌కోడ్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు పీఎస్ఎల్‌కు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని కూడా తొలగించేసింది.

నేను పాకిస్థానీ కాదు..: ప్రభాస్ హీరోయిన్


ఇమాన్వీ ఇస్మాయిల్

ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన నటులు, గాయకులు, టెక్నీషియన్లు భారత సినీ పరిశ్రమలో పనిచేయకుండా నిషేధిస్తున్నట్టు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయీస్' సంస్థ ప్రకటించింది. ఇక ప్రభాస్ నటిస్తున్న ఓ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న ఇమాన్వీ ఇస్మాయిల్ పాకిస్థానీ అని, ఆమెను తప్పించాలని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇమాన్వీ స్పష్టత ఇచ్చారు. తాను భారతీయ అమెరికన్ అని, లాస్ ఏంజిలిస్‌లో పుట్టానని తెలిపారు. తనకు, తన కుటుంబంలో ఎవరికీ కూడా పాకిస్థాన్‌తో ఎలాంటి సంబంధాలు లేవని, తప్పుడు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

పాక్ దౌత్యవేత్తకు సమన్లు.. మిలటరీ దౌత్య సిబ్బందికి నోటీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా పాకిస్థాన్‌పై భారత్ కఠిన ఆంక్షల పరంపర కొనసాగుతూనే ఉంది. దౌత్యపరమైన సంబంధాల విషయంలో తాజాగా కఠిన నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లోని ఉన్నత దౌత్యాధికారి సాద్ అహ్మద్ వరైచ్‌కు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సమన్లు పంపింది. ఆయనను స్వయంగా పిలిపించి పాక్ మిలిటరీ దౌత్య సిబ్బందికి నోటీసులు (పర్సోనా నాన్ గ్రాటా) అందించింది. ఈ నోటీసు అందుకున్నవారంతా వారం రోజుల్లోగా భారత్‌ను వదిలిపెట్టి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దౌత్యపర ఆంక్షలు మే ఒకటో తేదీ వరకు అమలులో ఉంటాయని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ తెలిపారు. రాయబార కార్యాలయాల్లోని సిబ్బంది సంఖ్యను క్రమంగా 55 నుంచి 30కు తగ్గిస్తామని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ESTD : 1975

VISWASANTHI CBSE SENIOR SECONDARY RESIDENTIAL SCHOOL

XI, XII PCM, PCB

◆ LKG to X, +1 & +2 PCM & PCB with IIT - JEE Main, Advanced & NEET Coaching ◆ IIT & Medical Foundation from VI to X Classes

SRI VISWASANTHI EDUCATIONAL INSTITUTIONS · EDUCATION · DISCIPLINE · ESTD : 1975, VUYYURU

విద్యారంగంలో అర్ధ శతాబ్దం ! విజయసాధనలో స్వర్ణోత్సవం !!

50 Golden Jubilee



మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు
Founder & Managing Director

శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి

ఉయ్యూరు - విజయవాడ దగ్గర - కృష్ణాజిల్లా - ఆంధ్రప్రదేశ్ M.P.C, Bi.P.C

Cell : 99 48 98 4444, 913 331 8502, 924 745 6148, 99 12 77 5666, 833 300 0899.



మాదల ప్రమీలారాణి
Founder




డా॥ మాదల సూర్యశేఖర్
M.B.B.S., M.B.A.,
Chief Executive Director



మాదల సుష్మ
MSIS., M.B.A.,
Executive Director

...The Best Residential Institution in India... ...Your Child's Bright Future Starts Here...





డా॥ మాదల రాజశేఖర్
M.B.B.S., M.S. (Ortho)
Director



డా॥ మాదల నీలిమ
M.B.B.S.,
Director

Separate Sections & Hostel for...BOYS & GIRLS
A.C. CAMPUS
NCC "A" & "B" Certificates

ADMISSIONS ARE IN PROGRESS
SINGLE CAMPUS with Limited Strength

Web Site : www.sriviswasanthischools.in E - mail Id : director.sriviswasanthi@gmail.com

విద్యాసేవలో 50 సంవత్సరాలు

లక్షల మంది, వేల మంది విద్యార్థులతో - ఎన్నో బ్రాంచీలలో కాక, ఒకే ఒక్క క్యాంపస్ నుండి

అతి తక్కువ మంది విద్యార్థులతో ఆల్ ఇండియా లెవల్‌లో అద్భుత ఫలితాలు సాధిస్తున్న... శ్రీ విశ్వశాంతి, ఉయ్యూరు.

Congratulations to... శ్రీవిశ్వశాంతి JEE MAIN టాపర్స్ TILL NOW



99.97 PERCENTILE
TUMMALACHERLA HARIKA



99.92 PERCENTILE
S RAGHURAM REDDY



99.87 PERCENTILE
SYED ABDUL GAFOOR



99.75 PERCENTILE
B Y V SAI CHARAN



99.71 PERCENTILE
MADALA SUHASINI

- 99.68 PERCENTILE — S KESAV RADHA KRISHNA
- 99.54 PERCENTILE — MADASU AASHRITH SAI
- 99.43 PERCENTILE — BAPATLA RAMCHARAN
- 99.33 PERCENTILE — R G V AYYAPPA
- 99.28 PERCENTILE — P L V SAI CHERITH
- 99.11 PERCENTILE — K SAI DURGA PRASAD
- 99.06 PERCENTILE — MOHAMMAD RAFIVULLA
- 99.05 PERCENTILE — TANISHK R SARODE
- 99.02 PERCENTILE — SYED AAFTAB
- 98.99 PERCENTILE — SANKET BORKAR
- 98.98 PERCENTILE — GUDA NITIN KOWSIK
- 98.96 PERCENTILE — METTAPALLI SAI VAMSI
- 98.92 PERCENTILE — D V THARUN REDDY
- 98.82 PERCENTILE — D V S LOKESH REDDY
- 98.81 PERCENTILE — BORIGI JYOTHIRADHITHYA
- 98.69 PERCENTILE — D SAI SUDEEPA
- 98.65 PERCENTILE — KETINENI SAI KIRAN
- 98.58 PERCENTILE — THUNUGUNTLA SAI HARSHITH
- 98.55 PERCENTILE — MUTTATH ASHISH SIMON
- 98.52 PERCENTILE — P CHARISHMA
- 98.47 PERCENTILE — P CHARAN NAGA SAI KUMAR
- 98.44 PERCENTILE — AVALA SOWMYA DEVI
- 98.28 PERCENTILE — SHSHI KIRAN BHARTI
- 98.27 PERCENTILE — SANNI KIRAN
- 98.24 PERCENTILE — P. N. CHANDRA MOULI
- 98.01 PERCENTILE — MANOJ POLAGANI
- 97.82 PERCENTILE — KELLA YASOVARDHAN
- 97.66 PERCENTILE — VIVEK VISHAL
- 97.57 PERCENTILE — A TEJA SWAROOP
- 97.43 PERCENTILE — RAVULAPALLI JUHI
- 97.41 PERCENTILE — SAI SRIPAD VEMULA
- 97.34 PERCENTILE — SONTENA SIVA
- 97.29 PERCENTILE — K VIGNESHWAR REDDY
- 97.20 PERCENTILE — N V SIVARAMAKRISHNA
- 97.19 PERCENTILE — SAILESH AMAN DOLA
- 97.16 PERCENTILE — VARDHAN
- 97.14 PERCENTILE — KOTHA DINESH
- 97.07 PERCENTILE — P DHANUSH KUMAR REDDY
- 97.06 PERCENTILE — G LIKHIL
- 96.85 PERCENTILE — K HARSHITH KUMAR
- 96.76 PERCENTILE — VAIBHAV BHOJRAJ SONKUSARE
- 96.70 PERCENTILE — KOTHAPALLI DHANUSH
- 96.62 PERCENTILE — PITTALA JAYA KRISHNA
- 96.42 PERCENTILE — S VENKATA SUDARSH
- 96.38 PERCENTILE — G. TEJA SAI SIDDHARTH
- 96.30 PERCENTILE — S CHOLA KESAV
- 96.14 PERCENTILE — KONA HARSHITH SAI
- 96.12 PERCENTILE — PEDDINA AYUSHMAN
- 96.09 PERCENTILE — GHANTA CHETANA PRIYA
- 96.07 PERCENTILE — N BHARATH ANNADANA

...Many More Toppers...

MPC, BiPCలలో IIT-JEE Main, Advanced, EAMCET, NEETలలో IPEతో పాటు అత్యంత అనుభవముగల సూపర్ సీనియర్ లెక్చరర్స్‌చే Limited Studentsతో Personal Supervisionతో ప్రత్యేక శిక్షణ ఇస్తూ... State Level & All India Levelలో టాప్ ర్యాంక్స్ సాధిస్తున్నాము.

అత్యంత ప్రతిభగల విద్యార్థులకు ఇంటర్‌లో చేరుటకు మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాము.

designed by : Thilak - 984 836 3105